శనివారం
12-4-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 200
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23

అక్షరాక్షరం అభ్యుదయం

రూ.96 వేల మార్కుకు బంగారం ధర

న్యూఢిల్లీ: బంగారం ధర మళ్లీ భగ్గుమంది. దేశీయంగా 10 గ్రాముల మేలిమి (24 క్యారెట్ల) బంగారం ధర రూ.96 వేల మార్కు దాటింది. దేశ రాజధాని ఢిల్లీలో 10 గ్రాముల మేలిమి పసిడి ధర రూ.6,250 పెరిగి రూ.96,450కు చేరింది. మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీలో 10 గ్రాముల పసిడి ధర జూన్ డెలివరీ రూ.1703 పెరిగి రూ.93,736కు చేరుకుంది. వెండి కిలో రూ.95,500 పలుకుతోంది. 99.5 స్వచ్ఛత కలిగిన బంగారం కూడా రూ.96 వేలు పలుకుతోంది. అంతర్జాతీయంగా ఔన్సు ధర 3,223 డాలర్లు ఉండగా, ఇంట్రాడేలో 3,237 డాలర్లకు చేరుకుంది.

నేతన్నలకు ప్రభుత్వం అండ

- కంచ గచ్చిబౌలిలో 400 ఎకరాలు ప్రభుత్వానివే
- దుస్తుల పరిశ్రమ ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్‌బాబు

విశాలాంధ్ర - హైదరాబాద్: సిరిసిల్ల ప్రజలకు సామాజిక స్పృహ ఎక్కువని, ఇది చాలా చైతన్యవంతమైన భూమి అని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ఎంతో మంది ప్రముఖులు ఇక్కడి నుంచే తమ ప్రయాణాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా పెద్దూర్ అపారెల్ పార్క్ లో రూ.102 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేసిన అత్యాధునిక దుస్తుల పరిశ్రమ "పంక్చుయేట్ వరల్డ్ ప్రైవేట్ లిమిటెడ్"ను ప్రారంభించారు. అనంతరం ఉద్యోగాలు పొందిన మహిళ లకు నియామక పత్రాలు అందజేశారు. ఈ పరిశ్రమ వల్ల ప్రస్తుతం 1600 మంది మహిళలకు ఉపాధి లభించనుందని, రాబోయే మూడేళ్లలో మరో రెండువేల మందికి ఉద్యోగాలు లభిస్తాయని, ఏటా ఇక్కడ 70 లక్షలకు పైగా దుస్తులు(పీసెస్) ఉత్పత్తి అవుతాయని, ఏటా రూ.300 కోట్ల విలువైన దుస్తులు అమెరికా, యూకే లాంటి దేశాలకు ఎగుమతి అవుతాయని నిర్వాహకులు మంత్రికి వివరించారు. శ్రీధర్‌బాబు

- మిగతా 2 లో

'మూసీ' పనులు వేగవంతం

- మీర్ ఆలం బ్రిడ్జికి జూన్‌లో టెండర్లు
- ప్రతిపాదనలు, డిజైన్లతో డీపీఆర్ సిద్ధం
- సీఎం రేవంత్ అధికారులకు ఆదేశం

విశాలాంధ్ర - హైదరాబాద్: మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మూసీ పునరుజ్జీవనంపై శుక్రవారం అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. బాపూఘాట్లో నిర్మించ తలపెట్టిన గాంధీ సరోవర్‌తో పాటు మీర్ ఆలం ట్యాంక్ పై నిర్మించనున్న బ్రిడ్జి నమూనాలను సీఎం పరిశీలించారు. మీర్ ఆలం బ్రిడ్జి నిర్మాణ పనులకు జూన్‌లో టెండర్లు పిలవాలని సూచించారు. అందుకు అవసరమైన సర్వేలు, నివేదికలు, ప్రతిపాదనలు, డిజైన్లతో డీపీఆర్ సిద్ధం చేసుకోవాలన్నారు. బ్రిడ్జికి సంబంధించి కన్సెల్టెన్సీలు తయారు చేసిన నమూనా డిజైన్లను అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. రెండున్నర కిలోమీటర్ల పొడవైన బ్రిడ్జిని అద్భుతంగా నిర్మించాలని, సందర్శకులు, ప్రయాణికుల రక్షణకు అత్యంత ప్రాధాన్యముండే డిజైన్లను ఎంచుకోవాలని సీఎం అధికారులను అప్రమత్తం చేశారు. బ్రిడ్జితో పాటు ఐలాండ్‌లు ఉన్న మూడు ప్రాంతాలను సింగపూర్ లోని గార్డెన్స్ బై ది బే ను తలపించేలా బర్డ్స్ పారడైజ్, వాటర్ ఫాల్స్ ఉండేలా అత్యంత సుందరంగా అభివృద్ధి చేయాలని సూచించారు. వెడ్డింగ్ డెస్టినేషన్ కు వీలుగా ఉండే కన్వెన్షన్ సెంటర్లతో పాటు అడ్వంచర్ పార్క్, థీమ్ పార్క్, యాంఫీథియేటర్ ఏర్పాటుకు వీలుగా డిజైన్లు ఉండాలన్నారు. బోటింగ్ తో పాటు పర్యాటకులు విడిది చేసేలా రిసార్ట్స్, హోటల్స్ అందుబాటులో ఉండాలన్నారు. పీపీపీ మోడల్లో ఈ ఐలాండ్ జోన్ను అభివృద్ధి చేసేలా ప్రతిపాదనలు తయారు చేయాలని ఆదేశించారు. ప్రాజెక్టుకు అవసరమైన హైడ్రాలజీ తో పాటు పర్యావరణ నిపుణులు లేదా పేరొందిన సంస్థలతో సర్వే చేయించాలని సూచించారు. బ్రిడ్జితో పాటు ఐలాండ్ జోన్ పక్కనే ఉన్న జూ పార్కుకు అనుసంధానం చేయాలని అన్నారు. ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, శ్రీనివాసరాజు, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్‌తో పాటు మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమి, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

డ్రైపోర్టుకు రూపకల్పన...

వందేళ్ల అవసరాలకు అనుగుణంగా డ్రైపోర్ట్‌కు రూపకల్పన చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులకు సూచించారు. రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) సమీపంలో సరైన ప్రాంతంలో డ్రైపోర్ట్ ఉండాలని అన్నారు. రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణం... ఆర్ఆర్ఆర్ పనుల పురోగతిపై ఐసీసీసీలో ముఖ్యమంత్రి శుక్రవారం సమీక్షించారు. హైదరాబాద్-విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణానికి అవసరమైన డీపీఆర్ తయారీకి సూత్రప్రాయ ఆమోదం తెలపాలని కేంద్ర హోం శాఖ కార్యదర్శి ఆదేశించిన నేపథ్యంలో ఆ పనులపై దృష్టిసారించాలని సీఎం సూచించారు. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగానికి భూ సేకరణ పూర్తి చేయాలని, దక్షిణ భాగం డీపీఆర్ కన్సల్టెన్సీ నివేదికను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నగరాన్ని... చత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌తో అనుసంధానించేలా జాతీయ రహదారికి ప్రతిపాదనలు తయారు చేసి జాతీయ రహదారుల ప్రాధికార సంస్థకు (ఎన్‌హెచ్ఏఐ) పంపించాలని సీఎం సూచించారు. హైదరాబాద్ నుంచి మంచిర్యాల వరకు జాతీయ రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేయాలని ఆదేశించారు. భూ సేకరణలో ఎదురవుతున్న ఇబ్బందులపై సీఎం ఆరాతీశారు. పంట నష్టపరిహారం చెల్లించేందుకు ఎన్‌హెచ్ఏఐ అంగీకరించడం లేదని అధికారులు సీఎంకు వివరించారు. పంట కాలం పూర్తవుతున్నందున రైతులతో మాట్లాడి భూ సేకరణ పూర్తి చేయాలని తెలిపారు. ఏవైనా సమస్యలుంటే ఆయా జిల్లాల

- మిగతా 2 లో

సామాన్య, పేద కుటుంబాలకు చేయూత

- కేవలం 15 నెలల్లోనే అభివృద్ధితో పాటు సంక్షేమ ఫలాలు
- 'రాజీవ్ యువ వికాసం'తో యువతకు ఉపాధి: పొంగులేటి

విశాలాంధ్ర-పినపాక : గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో చేయలేని అభివృద్ధిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 15 నెలల కాలంలో అభివృద్ధి ఫలాలు ప్రజలకు అందిస్తున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర ఆర్థికస్థితి అంతగా లేకపోయినా అభివృద్ధితోపాటు సంక్షేమ పథకాలు పెద్దఎత్తున అందజేస్తూ సామాన్య, పేద కుటుంబాలకు చేయూతనందిస్తున్నట్టు చెప్పారు. ఈనెల 14 న అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని సీఎం చేతుల మీదుగా శిల్పారామంలో భూభారత చట్టాన్ని ప్రజలకు అంకితం చేస్తారన్నారు. రైతులను రాజులు చేస్తామన్న వాగ్దానం మేరకు

- మిగతా 2 లో

తమిళులను మోసగించడమే

చెన్నై: వచ్చే ఏడాది తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ అన్నాడీఎంకే-బీజేపీ పొత్తులు ప్రకటించడంపై డీఎంకే ఎంపీ కనిమొళి స్పందించారు. బీజేపీతో ఎప్పటికీ పొత్తు పెట్టుకోబో మంటూ గతంలో పళనిస్వామి చేసిన ప్రకటనను ఆమె గుర్తు చేశారు. చెన్నైలో కనిమొళి మీడియాతో మాట్లాడుతూ 'బీజేపీ - అన్నాడీఎంకే మధ్య ఎప్పటికీ పొత్తు ఉండదన్నారు. ఈ రోజు ఒకే వేదికపై నుంచి పొత్తు ప్రకటించారు. బీజేపీ తీసుకొచ్చిన అనేక బిల్లులను అన్నాడీఎంకే పార్లమెంటులో వ్యతిరేకించింది. ఇప్పుడేమో పొత్తు పెట్టుకున్నారు. ఇది తమిళ ప్రజలను

- మిగతా 2 లో

ఏపీని నిలువరించాలి

జీఆర్ఎంబీకి తెలంగాణ లేఖ

విశాలాంధ్ర-హైదరాబాద్: గోదావరి-బనకచర్లపై ఏపీ ముందుకెళ్లకుండా చూడాలని గోదావరి నదీ యాజమాన్య బోర్డుకు తెలంగాణ నీటిపారుదలశాఖ ఈఎన్సీ కార్యాలయం లేఖ రాసింది. పోల వరం ప్రాజెక్టు, తాడిపూడి ఎత్తిపో తలపై ఎలాంటి టెండర్లు చేపట్టకు ండా చూడాలని కోరింది. 'ఈ నెల 7న జరిగిన సమావేశం లోనూ ఇదే అంశాన్ని ప్రస్తావించాం. గోదావరి-బనకచర్ల ప్రతిపాదన ఇంకా ప్రాథమి క దశలోనే ఉందని జీఆర్ఎంబీ చైర్మన్, ఏపీ సభ్యులు సమాధానం ఇచ్చారు. కానీ, మరుసటి రోజే ఏపీ జలహారతి కార్పొరేషన్ ఏర్పాటు చేసింది. ఆలస్యం చేయకుండా తక్షణమే ఏపీని నిలువరించాలి' అని లేఖలో పేర్కొంది.

పోక్సో నిందితుడికి 25 ఏళ్ల జైలు

విశాలాంధ్ర-హైదరాబాద్: నాంపల్లిలోని పోక్సో ప్రత్యేక న్యాయస్థానం సంచలన తీర్పు వెలువరించింది. మైనర్ బాలికను లైంగికంగా వేధించిన కేసులో నిందితుడు గుట్ల శ్రీనివాస్‌కు 25 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ తీర్పు చెప్పింది. 2023లో సైఫాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో గుట్ల శ్రీనివాస్ ఓ మైనర్ బాలికకు సెల్‌ఫోన్ ఇస్తానని నమ్మించి తన వెంట తీసుకెళ్లి లైంగికంగా వేధించాడు. బాధితురాలి తల్లి పోలీసులకు ఫిర్యాదు

- మిగతా 2 లో

హక్కులు మీకేనా... పౌరులకు లేవా!

ఈడీకి సుప్రీం మొట్టికాయలు

న్యూఢిల్లీ: 'ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)కు ప్రాథమిక హక్కులు ఉన్నప్పుడు, పౌరులకు ఉండవా! దీని గురించీ ఆలోచించాలి కదా' అని సర్వోన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. నాగరిక్ అపూర్తి నిగమ్ (ఎన్ఏఎన్) కుంభకోణం కేసును చత్తీస్‌గఢ్ నుంచి న్యూఢిల్లీకి బదిలీ చేయాలన్న ఈడీ ఫిర్యాదును ఆక్షేపించింది. పౌరులకు సంబంధించిన రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 కింద రిట్ పిటిషన్‌ను ఎలా దాఖలు చేశారంటూ ఈడీకి చీవాట్లు పెట్టింది. ఆపై పిటిషన్ ఉపసంహరణకు అనుమతిచ్చింది. ఆర్టికల్ 32 ప్రకారం తమ ప్రాథమిక హక్కుల ఉల్లంఘనపై సుప్రీంకోర్టును ఆశ్రయించేందుకు పౌరులకు హక్కు కల్పించబడింది. జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం వ్యాఖ్యలకు అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు స్పందిస్తూ తమ పిటిషన్ ఉపసంహరణకు అనుమతి కోరగా కోర్టు అంగీకరించింది. అదే సమయంలో మీకు హక్కులు ఉన్నప్పుడు, పౌరుల హక్కుల సంగతేమిటి? వాటి గురించి మీరు ఆలోచించాలని వ్యాఖ్యానించింది. కాగా, చత్తీస్‌గఢ్‌లోని కేసులో ముందస్తు బెయిల్ రావడాన్ని మాజీ ఐఏఎస్ అనిల్ తుతేజా దుర్వినియోగించినట్లు ఈడీ గతేడాదిలో ఆరోపించింది. ఎన్ఏఎన్ కేసు

- మిగతా 2 లో

అన్నాడీఎంకేతో బీజేపీ పొత్తు

- ముఖ్యమంత్రి అభ్యర్థి పళనిస్వామి
- అమిత్‌షా ప్రకటన

చెన్నై: తమిళనాడులో కీలక రాజకీయ పరిణామం చోటుచేసుకుంది. అన్నాడీఎంకే, బీజేపీ మధ్య మరోసారి పొత్తు కుదిరింది. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు వచ్చే ఏడాది జరగనున్న నేపథ్యంలో ఈ రెండు పార్టీల పొత్తుపై బీజేపీ అగ్రనాయకుడు, కేంద్ర హోంమంత్రి అమిత్ షా శుక్రవారం ఈ ప్రకటన చేశారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకేతో కలిసి పోటీ చేస్తా మని వెల్లడించారు. తమిళనాడు పర్యటనలో ఉన్న అమిత్ షా అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ సీఎం పళనిస్వామి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలైతో కలిసి చెన్నైలో మీడియా సమావేశంలో మాట్లాడారు. పళనిస్వామి సారథ్యంలోనే ఎన్నికలకు వెళ్తామని ప్రకటించారు.

అన్నాడీఎంకే, బీజేపీ కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థి పళనిస్వామి అని అమిత్‌షా ప్రకటించారు. గతంలోనూ ఈ రెండు పార్టీలు జట్టుకట్టిన విషయం తెలిసిందే. తాజాగా వచ్చే ఎన్నికల్లోనూ రెండు పార్టీలూ కలిసి పోటీ చేయనున్నాయి. అవసరమైతే...

- మిగతా 2 లో

నేడు ఏపీ ఇంటర్ ఫలితాలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ ఇంటర్మీడియట్ ఫలితాలను ఈనెల 12వ తేదీ శనివారం విడుదల చేయనున్నారు. ఈ మేరకు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సోషల్ మీడియా వేదికగా శుక్రవారం వెల్లడించారు. ఉదయం 11 గంటలకు ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాలు విడుదలవుతాయి.

తొలిసారిగా వాట్సాప్ గవర్నెన్స్ సేవల ద్వారా ఇంటర్ ఫలితాలు పొందేలా ఏర్పాటు చేశారు. ఇందుకోసం వాట్సాప్ గవర్నెన్స్ నంబరు... 9552300009కు హి..అని మెసేజ్ పెడితే ఇంటర్

- మిగతా 2 లో

సుంకాల యుద్ధం తీవ్రతరం

ఆర్థిక దోపిడీకి రేవంత్ సర్కార్ యత్నం

- రూ.10 వేల కోట్ల అప్పు కోసం రూ.169 కోట్ల లంచం
- విచారణ సంస్థలకు ఫిర్యాదు చేస్తాం
- హెచ్‌సీయూ భూముల్లో పర్యావరణ విధ్వంసం : కేటీఆర్

విశాలాంధ్ర - హైదరాబాద్: హెచ్‌సీయూ భూముల్లో పర్యావరణ విధ్వంసం జరగడమేకాదు రూ.10 వేల కోట్ల ఆర్థిక మోసం జరిగిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఈ కుంభకోణానికి కర్త, కర్మ, క్రియ, సూత్రదారి, పాత్రదారి అంతా సీఎం రేవంత్‌రెడ్డినే అని పేర్కొన్నారు. చివరకు ఐసీఐసీఐ బ్యాంకు... భూ యాజమాన్య హక్కులు ఎవరివో తెలియకుండానే రూ.10 వేల కోట్లు రుణం ఇచ్చి తన ప్రతిష్టను కోల్పోయిందని, త్వరలోనే ఆబ్యాంకు కుప్పకూలడం ఖాయమని అన్నారు. ఈ కుంభకోణంపై సమగ్ర విచారణ జరపాలని కేంద్ర దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదు చేస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. విషయంపై ప్రధాని మోదీ వెంటనే స్పందించి విచారణకు ఆదేశించి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో శుక్రవారం మీడియా సమావేశంలో అయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత త్రీడీ మంత్రం (మోసం, విధ్వంసం, దృష్టి మళ్లించడం) అమలు చేస్తోందని మండిపడ్డారు. రైతన్న కడుపు మీద కొట్టడమే కాకుండా ప్రజల దృష్టి మరల్చి భయంకరమైన ఆర్థిక దోపిడీకి రేవంత్ రెడ్డి ప్రభుత్వం పాల్పడిందని ఆరోపించారు. హెచ్‌సీయూలో జరిగిన పర్యావరణ విధ్వంసం పై దేశం మొత్తం నివ్వెర పోయి చూసిందని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పుల ప్రకారం ఆ 400 ఎకరాలు ముమ్మాటికి అటవీ భూమేఅని,

- మిగతా 2 లో

14X14 సెల్‌లో రాణా

- 24 గంటల సీసీటీవీ నిఘా-డిజిటల్ భద్రత: 18 రోజుల ఏఐఏ కస్టడీ
- కొనసాగుతున్న విచారణ



న్యూఢిల్లీ: ముంబై ఉగ్రదాడి కుట్రదారుడు తహవ్వుర్ రాణాను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) కస్టడీలోకి తీసుకుంది. ఈ మేరకు ప్రత్యేక ఎన్ఐఏ కోర్టు అతనికి 18 రోజుల కస్టడీ విధించింది. ముంబై తరహా దాడులను ఇతర నగరాల్లోనూ చేయాలని రాణా కుట్ర పన్నినట్లు కోర్టుకు ఎన్ఐఏ తెలిపింది. 26/11 దాడికి జరిగిన కుట్రకు సంబంధించిన వివరాలన్నీ రాబట్టడం కోసం అతనిని దీర్ఘకాలం కస్టడీలో ఉంచడం అవసరమని, అందుకోసం అనుమతి ఇవ్వాలని కోరింది. తొలుత 20 రోజుల కస్టడీని ఎన్ఐఏ కోరగా, 18 రోజులకు కోర్టు మంజూరీ ఇచ్చింది. అతనికి ప్రతిరోజు వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించింది. ఎన్ఐఏ అధికారుల సమక్షంలో రోజు విడిచి రోజు న్యాయవాదిని కలిసేలా రాణాకు అనుమతి ఇచ్చింది. కస్టడీ సమయంలో

- మిగతా 2 లో



"కొత్తపట్నం" నిషేధంపై నిరసనలు

కొత్త పట్నం రాజకీయ పాఠశాలపై ఉమ్మడి మద్రాసు రాష్ట్ర ప్రభుత్వ దమనకాండపై తీవ్ర నిరసన వ్యక్తం అయింది. ప్రభుత్వం విధించిన నిషేధాజ్ఞలను ఉల్లంఘించినందుకు వంద మందిని పైగా ప్రభుత్వం అరెస్టు చేసింది. ఈ రాజకీయ పాఠశాలలో మిలిటరీ శిక్షణ ఇస్తున్నారని, బాంబులు తయారు చేయడం నేర్పుతున్నారని ప్రభుత్వం దాష్టీకానికి దిగింది.

ప్రత్యేక వ్యాసం 4వ పేజీలో

విజయవాడ మెట్రో కదలిక

భూసేకరణపై చర్యలు ప్రారంభం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: విజయవాడ మెట్రో కదలిక ప్రారంభమయింది. మెట్రో రైలు ప్రాజెక్ట్ రూపకల్పనకు గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాల పరిధిలో అవసరమైన భూసేకరణకు సంబంధించిన అంశాలపై అధికారులు చర్యలు చేపట్టారు. ఆర్డీవో సుబ్రహ్మణ్యం, రెవెన్యూ అధికారులతో కలిసి విజయవాడ మెట్రో ప్రాజెక్ట్ చీఫ్ మేనేజర్ జీపీ రంగారావు శుక్రవారం గన్నవరం, కేసరపల్లిలో పర్యటించారు. బస్టాండ్, హెచ్‌సీఎల్, కేసరపల్లి కూడలిలో 12:42 మీటర్లతో నిర్మించనున్న మెట్రో స్టేషన్‌లకు అవసరమైన భూసేకరణపై చర్చలు జరిపారు. ప్రాజెక్ట్ మొదటి కారిడార్‌లో 26 కిలో మీటర్లు ప్లాన్ చేసిన సంగతి తెలిసిందే. ఈ కారిడార్ పీఎన్‌బీఎస్ నుంచి

- మిగతా 2 లో

ఇదీ లోకం!



ఆల్రెడీ, మనల్ని గట్టిగా తన్నారు కదన్నా!

విశాలాంధ్ర

ఆర్థిక దోపిడీకి రేవంత్ సర్కార్ యత్నం

(మొదటిపేజీ తరువాయి)

రిజర్వ్ ఫారెస్ట్ అని దాని ప్రత్యేకంగా డిక్లేర్ చేయకపోయినా అడవులకు ఉండాల్సిన లక్షణాలు ఉంటే యాజమాన్య హక్కులు ఎవరి పేరు మీద ఉన్నా దాన్ని అటవీ భూమి గానే గుర్తించాలని 1996లో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని గుర్తు చేశారు. 1980 ఫారెస్ట్ కన్జర్వేషన్ యాక్ట్ ప్రకారం అటవీ భూములను తాకట్టుపెట్టే లేదా అమ్మే హక్కు రాష్ట్ర ప్రభుత్వాలకు లేదన్నారు. బీజేపీకి చెందిన ఓ ఎంపీ వెనుక నుంచి పూర్తిస్థాయిలో సీఎంకు సహకరిస్తున్నార న్నారు. ఓ బ్రోకరేజ్ కంపెనీతో సంప్రదింపులు జరిపారని చెప్పారు. బీజేపీ ఎంపీ పూర్తి స్థాయిలో సహకరించిన ఓ బ్రోకర్ కంపెనీని తీసుకొచ్చి దోపిడీ విధానం చెప్పారని ఆరోపించారు. ఎఫ్ఆర్‌బీఎంను బైపాస్ చేసి డబ్బులు తీసుకొస్తామని చెప్పి అందుకు కమీషన్ ఇవ్వాలని ఆ కంపెనీ కోరగా దానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.169 కోట్లు లంచం ఇచ్చిందని వివరించారు. సుప్రీంకోర్టు తీర్పు రాగానే 75 కోట్లకు ఒక ఎకరం చొప్పున ఆ 400 ఎకరాల భూమిని టీజీఐఐసీకి బదిలాయిస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం ఒక జీవో ఇచ్చింది తప్ప ఆ భూమిని సేల్ డీడ్ , మ్యుటేషన్ చేయలేదంటే ప్రభుత్వానికి ఆ భూమిపై ఓనర్ షిప్ లేదనే విషయం స్పష్టం అవుతుందన్నారు. ఎలాంటి వెరిఫికేషన్ చేయకుండా, భూ యాజమాన్య హక్కులు ఎవరి దగ్గర ఉన్నాయో తెలుసుకోకుండానే ఐసీఐసీఐ బ్యాంకు రూ.పదివేల కోట్లు చెల్లించిందన్నారు.

విలువను కుదించారు...

కంచ గచ్చిబౌలిలో ఎకరం రూ.75 కోట్లు అని జూన్‌లో జీవో ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం ఐదు నెలల తర్వాత మళ్లీ ఇంకో సంస్థతో నవంబరు 23న కొత్త విలువ తీసుకొచ్చిందని కేటీఆర్ మండిపడ్డారు. 75 కోట్లు కాదు కేవలం ఎకరం రూ.52 కోట్లు మాత్రమే అని రిపోర్ట్ తయారు చేశారని తెలిపారు. ఈ ఐదు నెలల కాలంలో రూ.25 కోట్ల విలువ ఎందుకు తగ్గిందనే దానికి ప్రభుత్వం సమాధానం చెప్పాల న్నారు. ఆ తర్వాత బహిరంగ మార్కెట్లో రిలయబుల్ వ్యాల్యూ అసెస్మెంట్ అని ఎకరాకు రూ.41.6 కోట్లు మాత్రమే అని ప్రభుత్వం ప్రకటించిందని అలా ఆ 400 ఎకరాల భూమి విలువను రూ.30 వేల కోట్ల నుంచి రూ.16,640 కోట్లకు ప్రభుత్వం కుదించిందని దుయ్యబట్టారు.

సుంకాల యుద్ధం తీవ్రతరం

- చైనాపై 145 శాతం విధించిన అమెరికా
- దీటుగా 125 టారిఫ్ ప్రకటించిన చైనా
- అగ్రరాజ్యాల రగడతో మార్కెట్లపై ప్రభావం

వాషింగ్టన్/బీజింగ్: అమెరికా , చైనా మధ్య సుంకాల యుద్ధం తీవ్రరూపం దాల్చుతోంది. పరస్పరం సుంకాలు విధిస్తూ రెండు అగ్రరాజ్యాలు ఢీ అంటే ఢీ అన్నట్లుగా వ్యవహరిస్తున్నాయి. ఇప్పటికే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దూకుడుగా వ్యవహరిస్తూ చైనాపై సుంకాన్ని 10 శాతం నుంచి 145 శాతానికి అమాంతం పెంచేశారు. అటు బీజింగ్ కూడా తగ్గేదేలేదంటూ వాషింగ్టన్‌పై సుంకాన్ని 125 శాతానికి పెంచేసింది. దీంతో అంతర్జాతీయ మార్కెట్లపై ప్రభావం పడుతోంది. ఇదే పరిస్థితి కొనసాగితే ప్రపంచ మాంద్యం రావచ్చన్న ఆందోళన పెరుగుతోందని. మరోవైపు అగ్రరాజ్యాలు సంయమనం పాటించాలని, చర్చల ద్వారా ఈ సమస్యను పరిష్కరించుకోవాలని కొన్ని దేశాలు హితవు పలుకుతున్నాయి. కాగా, అమెరికా ఏకపక్షంగా బెదిరింపులకు దిగుతోందని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ అన్నారు. యుద్ధమే కోరుకుంటే చివరి వరకు పోరాడతామన్నారు. కొత్త సుంకాలు శనివారం నుంచి అమల్లోకి వస్తాయని చెప్పారు.

ఈ నంబర్ గేమ్ వల్ల రెండు దేశాలపై దీర్ఘకాలిక ప్రతికూల ప్రభావం ఉంటుందని హెచ్చరించారు. చైనా వస్తువులపై సుంకాలను తొలగించే దిశగా అమెరికా నిర్ణయం తీసుకోవాలన్నారు. ఇకపై అమెరికా విధించే సుంకాలను పట్టించుకోబోమని, ఆ దేశంపై ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ)కు ఫిర్యాదు చేశామని చైనా అధికారికంగా ప్రకటించింది. ఏకపక్షంగా అమెరికా తీసుకున్న నిర్ణయాలను ప్రతిఘటించడానికి కలిసి రావాలని యూరోపియన్ యూనియన్‌ను పిలుపునిచ్చింది. 'చైనా, యూరప్ అంతర్జాతీయ బాధ్యతలను నిర్వర్తించాలి... ఏకపక్షంగా తీసుకుంటున్న ఈ

నిర్ణయాలను కలిసికట్టుగా తిప్పికొట్టాలి' అని శుక్రవారం బీజింగ్‌లో జరిగిన సమావేశంలో జిన్‌పింగ్ అన్నారు. ఏ రకంగానూ వాణిజ్య యుద్ధాలు, సుంకాల యుద్ధాలను చైనా కోరుకోవడం లేదు కానీ ఆ యుద్ధాలు వస్తే వెనకడుగు వేయదని చైనా విదేశాంగ శాఖ అధికారి లిన్ జియాన్ తెలిపారు. చైనా సార్వభౌమత్వం, భద్రత, అభివృద్ధి, స్వప్రయోజనాలకు విఘాతం కలగకుండా తమ చర్యలు ఉంటాయని చెప్పారు. బహుపాక్షిక వాణిజ్య వ్యవస్థను సమర్థించారు. అంతర్జాతీయ సమాజ ఉమ్మడి ప్రయోజనాల పరిరక్షణకు చైనా కట్టుబడి ఉందన్నారు. న్యాయం కోసం నిలబడినప్పుడు అందరూ మద్దతిస్తారని అన్నారు. అమెరికా వాణిజ్య యుద్ధం కోరుకుంటే చైనా తుది వరకు పోరాడుతుందని చెప్పారు.

చర్చించి పరిష్కరించుకోండి: స్పెయిన్ ప్రధాని

స్పెయిన్ ప్రధాని పెడ్రో శాంచెజ్‌తో జిన్‌పింగ్ బీజింగ్‌లో భేటీ అయ్యారు. అమెరికా సుంకాల పేరిట వేధిస్తుండటాన్ని ఐక్యంగా ప్రతిఘటిద్దామన్నారు. యూరోపియన్ యూనియన్ మద్దతును కోరినట్లు తెలిపారు. స్పెయిన్ ప్రధాని స్పందిస్తూ ఈ పరిస్థితిని పరిష్కరించడం కోసం చైనా, అమెరికా కూర్చొని మాట్లాడుకోవాలని సూచించారు. చైనా, యూరోపియన్ యూనియన్ మధ్య మరింత సమతుల్యతతో కూడుకున్న సంబంధాలు అవసరమని అభిప్రాయపడ్డారు. చైనాతో ఈయూకు వాణిజ్య సమస్యలు ఉండటాన్ని ఉద్దేశించి ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అయితే ఈ బహుళ ధ్రువ ప్రపంచంలో యూరోపియన్ యూనియన్‌ను మూలస్తంభంగా చైనా పరిగణిస్తుందని జిన్‌పింగ్ ఆయనతో చెప్పారు. యూరోపియన్ యూనియన్ ఐక్యతా, వృద్ధికి దృఢంగా మద్దతిచ్చే దేశం తమదన్నారు. వాణిజ్య యుద్ధం వల్ల ఎవరికీ ప్రయోజనం ఉండదని జిన్‌పింగ్ నొక్కిచెప్పారు. అదే సమయంలో స్పెయిన్-చైనా మధ్య సైన్స్, టెక్నాలజీ, విద్య, చిత్ర పరిశ్రమ రంగాల్లో ఒప్పందాలు జరిగాయి. పోర్క్, చెర్రీ ఎగుమతుల ప్రోటోకాల్స్‌ను రెండు దేశాల అధినేతలు నిర్ణయించారు. ఇంధనం, హైటెక్ ఉత్పత్తులు, స్మార్ట్ సిటీల ప్రాజెక్టుల్లో స్పెయిన్‌తో సహకారానికి లభించిన అవకాశాన్ని చైనా సద్వినియోగించుకుంటుందని జిన్‌పింగ్ చెప్పినట్లు 'జిన్హువా' వార్తా సంస్థ వెల్లడించింది.

వాణిజ్య యుద్ధం మంచిది కాదు: ఇటలీ ఉప ప్రధాని ఆంటోనియో

వాణిజ్య యుద్ధాలతో ఎవరికీ ఎలాంటి ప్రయోజనం ఉండదని ఇటలీ ఉప ప్రధాని, ఆ దేశ విదేశాంగ శాఖ మంత్రి ఆంటోనియో తజానీ నొక్కిచెప్పారు. సుంకాలు లేని వాణిజ్యమే తన కల అని అన్నారు. సుంకాలతో వినియోగదారులకూ, వ్యాపారులకూ సమానస్థాయిలో నష్టం కలుగుతుందన్నారు. ఓపెన్ మార్కెట్స్, స్వేచ్ఛా వాణిజ్యం, న్యాయమైన పోటీ పద్ధతులను విశ్వసిస్తామని తెలిపారు. అమెరికాతో సానుకూల వాతావరణంలో చర్చలు జరపాలన్న యూరోపియన్ కమిషన్ నిర్ణయానికి ఇటలీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని చెప్పారు. నిర్మాణాత్మక చర్చల ద్వారా అందరికీ ప్రయోజనం కలిగే పరిష్కారాలు సాధించుకోగలమన్న నమ్మకం ఉందని ఆంటోనియో వెల్లడించారు. ఇదిలావుంటే, అత్యధికంగా విధించిన సుంకాలపై 90 రోజుల విరామాన్ని అమెరికా ప్రకటించడాన్ని ఈయూ స్వాగతించింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ సుస్థిరతకు ఇది దోహదమవుతుందని యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వోన్ డెర్ లెయన్ అన్నారు. పరస్పర అవగాహనతో ప్రయోజనాత్మక వాణిజ్యం దిశగా అమెరికాతో నిర్మాణాత్మక చర్చలకు ఈయూ కట్టుబడి ఉందని చెప్పారు. వాణిజ్యం, సరఫరా గొలుసుల పనికి స్పష్టమైన, అంచనా వేయగల పరిస్థితులు అవసరమన్నారు. 'సుంకాలు... వ్యాపారాలు, వినియోగదారులను దెబ్బతీసే పన్నులు. అందుకోసమే జీరో టారిఫ్ ఒప్పందం కోసం యూరోపియన్ యూనియన్ కట్టుబడింది' అని ఉర్సులా వెల్లడించారు.

ఆర్థిక నేరగాళ్లకు పాలకుల రక్షణ

ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే అర్బన్ నక్సల్స్ పేరుతో కేసులా?
సీపీఐ కార్యదర్శి నారాయణ

విశాలాంధ్ర-నర్సీపట్నం: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అత్యంత అప్రమాదకరంగా మారిందని సీపీఐ కార్యదర్శి డా.కె.నారాయణ విమర్శించారు. లక్షల కోట్లు దోచుకెళ్లిన కార్పొరేట్ కంపెనీ యజమానులకు వత్తాసు పలుకుతూ... పేదలపై మోయలేని భారం మోపుతోందని ధ్వజమెత్తారు. అనకాపల్లి జిల్లా నర్సీపట్నం కృష్ణ ప్యాలెస్‌లో శుక్రవారం రాజ్యాంగ రక్షణ-లౌకికవాద పరిరక్షణపై సీపీఐ అధ్వర్యంలో జిల్లా సదస్సు జరిగింది. సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ అధ్యక్షత వహించారు. నారాయణ మాట్లాడుతూ దేశంలో విలువైన అటవీ సంపద, ఖనిజ సంపదను మన ప్రజలకు కాకుండా కార్పొరేట్ కంపెనీలకు దోచిపెడుతోందన్నారు. పాలకులకు చిత్తశుద్ధి ఉంటే విదేశాలకు పారిపోయిన ఆర్థిక నేరస్తులను దేశానికి తీసుకురావాలని సవాల్ విసిరారు. మూడుసార్లు అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం అణగారిన వర్గాలు, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టేందుకు కనీస చర్యలు తీసుకోవడం లేదన్నారు. పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వడం లేదని, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 100 రోజుల పని కల్పించడం లేదని నారాయణ విమర్శించారు. పేదల సొంతింటి కల నెరవేరిన దాఖలాలు కనిపించట్లేదన్నారు. పేదల సమస్యలపై కమ్యూనిస్టులు పోరాడితే అర్బన్ నక్సల్స్ పేరుతో జైల్లో పెడుతున్నారని, అక్రమ కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర పాలకుల తీరు మారకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పార్లమెంట్ ఆవరణలో అరకు కాఫీ ఉత్పత్తుల స్టాల్స్‌లో పెట్టి గొప్పగా ప్రచారం చేసుకుంటున్న పాలకులు... కిందిస్థాయిలో గిరిజనులకు చేసిందేమీ లేదన్నారు. ప్రజలు చెల్లిస్తున్న పన్ను ఎవరి జేబులోకి వెళుతోందని నారాయణ ప్రశ్నించారు. పంట రుణాలు తీసుకుంటున్న రైతులపై బ్యాంకర్ల ఒత్తిడి పెరుగుతోందని, కానీ లక్షల కోట్లు అప్పులు తీసుకొని విదేశాలకు పారిపోయిన బడా పారిశ్రామికవేత్తలను ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ దేశానికి రాకుండా కాపాడుతున్నారని ఆరోపించారు. గుజరాత్ చెందిన పారిశ్రామికవేత్తలు 22 మందికి పైగా విదేశాల్లో దాక్కున్నారని, వారందరినీ మోదీ కాపాడుతున్నారన్నారు. చంద్రబాబు, పవన్, జగన్... మోదీకి వంత పాడుతూ తమ ఆస్తులు కాపాడుకుంటున్నారన్నారు. గిరిజన గ్రామాలు ఖాళీ చేయించి కార్పొరేట్ల పరం చేయాలని అమిత్‌షా వంటి నేతలు కుట్రలు పన్నుతున్నారని, పేదల జోలికొస్తే సహించేది లేదని నారాయణ హెచ్చరించారు. రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గంలో అధికార, విపక్ష నేతలు లాలూచీతో వ్యాపార లావాదేవీలు నడుపుతున్నారని ఆరోపించారు.

జేఈఈ విద్యార్థులకు పవన్ న్యాయం చేయాలి

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ విశాఖపట్నం పర్యటన సందర్భంగా జేఈఈ పరీక్షలు రాయకుండా విద్యార్థులు నష్టపోయారని, నరేంద్ర మోదీతో మాట్లాడి వారికి పవన్ న్యాయం చేయాలని నారాయణ డిమాండ్ చేశారు. పవన్‌కు మోదీ, అమిత్ షాతో ఉన్న పరిచయాలను ఉపయోగించుకొని విద్యార్థులతో మళ్లీ పరీక్షలు రాయించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. పోలీసుల అత్యుత్సాహంతోనే ట్రాఫిక్ సమస్య ఏర్పడిందని, అందుకే విద్యార్థులు సమయానికి పరీక్ష కేంద్రానికి చేరుకోలేకపోయారన్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, అల్లూరి సీతారామరాజు జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ, జిల్లా సహాయ కార్యదర్శి రాము నాయుడు, రాజాన దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఏపీ ఇంటర్ ఫలితాలు

(మొదటిపేజీ తరువాయి)

ఫలితాలు వస్తాయి. APresults.bie.gov.in వెబ్‌సైట్‌లో లాగిన్ అయి కూడా విద్యార్థులు తమ ఫలితాలు చూసుకోవచ్చు. resultsbie.ap.gov.in వెబ్‌సైట్‌లోను, మనమిత్ర యాప్‌లోను ఇంటర్ ఫలితాలు పొందవచ్చు.

బీహార్‌లో కాంగ్రెస్ నిరసన ర్యాలీ

పాట్నా: బీహార్‌లో ఎన్డీఏ సర్కారుకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. ఆ పార్టీ అనుబంధ విద్యార్థి విభాగం ఎన్ఎస్‌యూఐ... 'పలాయన్ రోకో, నౌకరీ దో' పాదయాత్ర నిర్వహిస్తోంది. ఈ క్రమంలో వారి పాదయాత్ర బీహార్ రాజధాని పట్నాలోని సీఎం నివాసానికి చేరుకోగానే కొందరు నిరసనకారులు ఆ నివాసంలోకి దూసుకెళ్లే ప్రయత్నం చేశారు. అప్పటికే అక్కడ బారీకేడ్లు ఏర్పాటు చేసుకుని సిద్ధంగా ఉన్న పోలీసులు... కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలను అడ్డుకున్నారు.

అన్నాడీఎంకేతో బీజేపీ పొత్తు

(మొదటిపేజీ తరువాయి)

కనీస ఉమ్మడి కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామని అమిత్ షా తెలిపారు. 1998లో నాటి సీఎం జయలలిత నేతృత్వంలో బీజేపీ, అన్నాడీఎంకే కూటమిగా ఏర్పాటైనప్పుడు లోక్‌సభ ఎన్నికల్లో భారీ విజయం సాధించామని అమిత్ షా గుర్తు చేశారు. ఈ పొత్తు కోసం అన్నాడీఎంకే ఎలాంటి షరతులు, డిమాండ్లు పెట్టలేదని తెలిపారు. ఆ పార్టీ అంతర్గత వ్యవహారాల్లో తాము జోక్యం చేసుకోబోమన్నారు. ఈ పొత్తు ఎన్డీఏకు, అన్నాడీంఎకేకు మేలు చేస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. సీట్ల కేటాయింపు, తదితర అంశాలను తర్వాత నిర్ణయిస్తామన్నారు. తమిళనాడులో డీఎంకే వాస్తవ సమస్యల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే సనాతన ధర్మం, త్రిభాషా విధానం వంటి అంశాలను తెరపైకి తీసుకొస్తోందని అమిత్ షా విమర్శించారు. కాగా, తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలైను అమిత్ షా ప్రశంసించారు. తమిళనాడు బీజేపీ కొత్త అధ్యక్ష ఎన్నిక ప్రక్రియలో భాగంగా శుక్రవారం నయినార్ నాగేంద్రన్ నామినేషన్ దాఖలు చేసిన నేపథ్యంలో... అమిత్‌షా 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. అన్నామలై పనితీరు ప్రశంసనీయమన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ విధానాలను ప్రజలకు చేరవేయడంలోనైనా, పార్టీ కార్యక్రమాలను గ్రామ గ్రామానికీ తీసుకెళ్లడంలోనైనా ఆయన కృషి అపూర్వమైనదని కొనియాడారు. అన్నామలై సంస్థాగత నైపుణ్యాలను పార్టీ జాతీయస్థాయిలో వినియోగించుకుంటుందని పేర్కొన్నారు.

తమిళనాడు పార్టీ కొత్త అధ్యక్షుడిగా నాగేంద్రన్?

మరోవైపు, తమిళనాడు బీజేపీ అధ్యక్ష పదవికి తిరునల్వేలి ఎమ్మెల్యే నయినార్ నాగేంద్రన్ నామినేషన్ పత్రాలు సమర్పించారు. ప్రస్తుతం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఆయన కొనసాగుతున్నారు. టి.నగర్‌లోని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యాలయానికి విచ్చేసి ఆయన ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఎన్నిక లాంఛనమేనని వార్తలు వస్తున్నాయి. రాష్ట్ర అధ్యక్ష పదవికి నాగేంద్రన్ పేరును అన్నామలై, కేంద్రమంత్రి ఎల్.మురుగన్, కేంద్ర మాజీ మంత్రి పొన్ రాధాకృష్ణన్‌తో పాటు మహిళా మోర్చా అధ్యక్షురాలు వనతి శ్రీనివాసన్ ప్రతిపాదించారు. నాగేంద్రన్‌ను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా అధిష్ఠానం దిల్లీలో శనివారం ప్రకటించనున్నది. నాగేంద్రన్ గతంలో అన్నాడీఎంకేలో కీలక పదవులు నిర్వహించారు. రాష్ట్ర మంత్రిగానూ సేవలందించారు. అసెంబ్లీ ఎన్నికల వేళ నాగేంద్రన్ నియామకం ప్రాధాన్యం సంతరించుకుంది.

హక్కులు మీకేనా... పౌరులకు లేవా!

(మొదటిపేజీ తరువాయి)

నిందితులు కొందరికి న్యాయపరమైన మినహాయింపులు కల్పించడం కోసం హైకోర్టు జడ్జితో చత్తీస్‌గఢ్‌లోని రాజ్యాంగబద్ధ పదవుల్లో ఉన్న కొంత మంది కుమ్మక్కు అయినట్లు ఇటీవల సంచలన ఆరోపణలు చేసింది. చత్తీస్‌గఢ్ నుంచి పీఎంఎల్ఏ కేసును బదిలీ చేయడమే కాకుండా మనీలాండరింగ్ వ్యవహారంతో ముడిపడిన ప్రముఖులకు ఇచ్చిన ముందస్తు బెయిల్ రద్దు చేయాలని కూడా ఈడీ కోరింది. పీడీఎస్ కుంభకోణంలో ఏసీబీ, చత్తీస్‌గఢ్ పోలీస్ ఆర్థిక నేరాల విభాగం దాఖలు చేసిన ఎఫ్ఐఆర్, చార్జిషీట్ ఆధారంగా మనీలాండరింగ్ కేసును 2019లో ఈడీ దాఖలు చేసింది. ఈ కేసు క్రమంలో రూ.3కోట్ల మేర అక్రమ సంపదను దర్యాప్తు అధికారులు సీజ్ చేశారు. అప్పట్లో ఎన్ఏఎన్ చైర్మన్‌గా తుతేజా, మేనేజింగ్ డైరెక్టర్‌గా శుక్లా ఉన్నారు.

14×14 సెల్‌లో రాణా

(మొదటిపేజీ తరువాయి)

సాఫ్ట్ టిప్ పెన్ను మాత్రమే వాడేందుకు అతనికి అనుమతి ఉంది. రాణాను తమ కస్టడీలోకి తీసుకున్న ఎన్ఐఏ అధికారులు అతనిని విచారిస్తున్నారు. దీంతో దర్యాప్తు సంస్థ కేంద్ర కార్యాలయం ఉన్న దిల్లీలోని సీజీఓ కాంప్లెక్స్ ప్రాంతమంతా భద్రతా వలయంగా మారింది. అదనంగా దిల్లీ పోలీస్, పారామిలటరీ సిబ్బందిని ఎన్ఐఏ భవనం బయట మోహరించారు. క్లియరెన్స్ లేకుండా ఎవరికీ ప్రవేశం ఉండదు. రాణాను ఉంచిన సెల్ ఎన్ఐఏ భవనం కింది అంతస్తులోని 14 × 14 అడుగుల వైశాల్యమున్న చిన్న గది. ప్రతి అంగుళం 24 గంటల సీసీ కెమెరాలతో నిఘాలో ఉంటుంది. బహుళ అంచెల డిజిటల్ భద్రతనూ ఆ గదికి ఏర్పాటు చేశారు. రాణాకు ఆహారం, తాగునీరు, వైద్య సదుపాయాలన్నీ గదిలోనే అందిస్తారు. లోపలే టాయిలెట్ ఉంది. పడుకునేందుకు నేలపై పడక వేశారు. రాణా సెల్‌లోకి వెళ్లేందుకు 12 మంది ఎన్ఐఏ అధికారులకు మాత్రమే అనుమతి ఉంది. పాకిస్థానీ కెనడియన్ అయిన రాణా (64)ను భారత్‌కు అమెరికా అప్పగించింది. అతను గురువారం భారత్ చేరుకున్నాడు. అర్ధరాత్రి దిల్లీలోని పాటియాలా హౌస్ కోర్టులో రాణాను ఎన్ఐఏ అధికారులు హాజరుపర్చారు. సీనియర్ న్యాయవాది దయాన్ కృష్ణన్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ నరేందర్ మాన్ ఎన్ఐఏ తరపున వాదనలను వినిపించారు. రాణా తరపున దిల్లీ లీగల్ సర్వీసెస్ అథారిటీ న్యాయవాది పీయూష్ సచ్‌దేవ వాదించారు. ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు జడ్జి చందర్‌జిత్ సింగ్ జనాంతిక విచారణ జరిపారు. రాణాకు 18 రోజుల ఎన్ఐఏ కస్టడీకి అనుమతించారు. రాణాను ఎన్ఐఏ అధికారులు విచారిస్తున్నట్లు తెలిసింది. దాదాపు 17 ఏళ్ల తర్వాత రాణాను భారత్‌కు తీసుకు రాగలగడం దర్యాప్తు సంస్థలు సాధించిన విజయమని పార్టీకలకతీతంగా రాజకీయ నాయకులు కొనియాడారు. అయితే మోదీ ప్రభుత్వం ఈ అంశాన్ని రాజకీయ ప్రచారాస్త్రంగా మల్చుకోవడాన్ని, తమ ఘనతగా చెప్పుకోవడాన్ని ప్రతిపక్షాలు ఆక్షేపించాయి. చేసిన నేరానికిగాను చట్ట ప్రకారం తగు విధంగా రాణాను శిక్షించాలని ప్రతిపక్ష పార్టీలు కోరాయి.

తమిళులను మోసగించడమే

(మొదటిపేజీ తరువాయి)

మోసగించడమే. బలవంతంగా అన్నాడీఎంకే బహిరంగ పొత్తును ప్రకటించింది' అని తెలిపారు. మరోవైపు, ఇదే అంశంపై కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం సైతం స్పందించారు. బీజేపీ, అన్నాడీఎంకేకు ఏ నిర్ణయాలైనా తీసుకునే స్వేచ్ఛ ఉంటుందన్నారు. గతంలో బీజేపీతో అన్నాడీఎంకే ఉందన్న ఆయన... ఆ తర్వాత తమిళనాడులో బీజేపీ తమను కిందకు లాగుతోందని గ్రహించి ఎన్డీయేతో బంధాన్ని తెంచుకుందన్నారు. తాజాగా మళ్లీ కూటమిలోకి తిరిగి వచ్చారని తెలిపారు. అన్నాడీఎంకే రాష్ట్రంలో చాలా వరకు క్షీణించిందన్నారు. గతంలో పొత్తుల కోసం అన్నాడీఎంకే వద్దకు ఎవరైనా రావాల్సిన పరిస్థితి నుంచి... ఇప్పుడు ఆ పార్టీ నేతలే దిల్లీకి వెళ్లాల్సిన దుస్థితికి చేరుకున్నారని విమర్శించారు. బీజేపీ రాజకీయాలను తమిళ ప్రజలు అంగీకరించరన్నారు.

'మూసీ' పనులు వేగవంతం

(మొదటిపేజీ తరువాయి)

కలెక్టర్లతో మాట్లాడాలని, సాంకేతిక, న్యాయ సమస్యలు ఉంటే వాటి పరిష్కారానికి కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారికి ముఖ్యమంత్రి సూచించారు. ఔటర్ రింగు రోడ్డు నుంచి రీజినల్ రింగు రోడ్డు వరకు రేడియల్ రోడ్లు... ఆర్ఆర్ఆర్ నుంచి తెలంగాణ సరిహద్దుల వరకు ఉన్న రహదారుల విస్తరణపైనా ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. సమీక్షలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు శ్రీనివాసరాజు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఆర్ అండ్ బీ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్, ప్రత్యేక కార్యదర్శి హరిచందన, ముఖ్య ఇంజినీర్లు తిరుమల, జయభారతి తదితరులు పాల్గొన్నారు.

ఫ్యూచర్ సిటీ వరకు మెట్రో విస్తరణ

ఫ్యూచర్ సిటీ వరకు మెట్రోను విస్తరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారు. అందుకు అవసరమైన తుది ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ లో మెట్రో విస్తరణపై ముఖ్యమంత్రి సమీక్షించారు. మెట్రో రెండో దశ విస్తరణకు సంబంధించిన ప్రతిపాదనల పురోగతిని ఆరా తీశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులు రావాల్సి ఉందని, ఇప్పటికే దిల్లీలో అధికారులను కలిసి సంప్రదింపులు జరిపినట్లు అధికారులు వివరించారు. హైదరాబాద్ మెట్రో రెండో దశ విస్తరణకు సంబంధించి నాగోల్ నుంచి శంషాబాద్ ఎయిర్ పోర్ట్ వరకు (36.8 కి.మీ.), రాయదుర్గం-కోకాపేట నియోపొలిస్ (11.6 కి.మీ.), ఎంజీబీఎస్-చాంద్రాయణగుట్ట (7.5 కి.మీ.), మియాపూర్-పటాన్‌చెరు (13.4 కి.మీ.), ఎల్‌బీ నగర్-హయత్ నగర్ (7.1 కి.మీ.) మొత్తం 76.4 కి.మీ.ల విస్తరణకు రూ.24,269 కోట్ల అంచనాలతో డీపీఆర్‌ను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి పంపించింది. కేంద్రంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం చెరిసగం నిధులు భరించేలా జాయింట్ వెంచర్‌గా ఈ ప్రాజెక్టు చేపట్టేలా ప్రతిపాదనలు తయారు చేసింది. కేంద్రం నుంచి అనుమతులు సాధించేందుకు నిరంతరం ప్రయత్నించాలని, అనుమతులు రాగానే పనులు ప్రారంభించేందుకు సన్నద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఎయిర్ పోర్టు నుంచి ఫ్యూచర్ సిటీలోని యంగ్ ఇండియా స్కిల్ డెవెలప్‌మెంట్ యూనివర్సిటీ వరకు 40 కిలోమీటర్ల మేరకు మెట్రో విస్తరించేందుకు కొత్త ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. దాదాపు 30 వేల ఎకరాల విస్తీర్ణంలో ఫ్యూచర్ సిటీ అభివృద్ధి చెందుతుందని, భవిష్యత్తు నగర విస్తరణ అవసరాల దృష్ట్యా మెట్రోను మీరాన్పేట వరకు పొడిగించాలని చెప్పారు. అందుకు అవసరమయ్యే అంచనాలతో డీపీఆర్ తయారు చేసి కేంద్రానికి పంపించాలని సూచించారు. హెచ్ఎండీఏతో పాటు ఎఫ్ఎస్డీఏ ను (ఫ్యూచర్ సిటీ డెవెలప్‌మెంట్ అథారిటీ)ని ఈ రూట్ మెట్రో విస్తరణలో భాగస్వామ్యులను చేయాలని చెప్పారు. సీఎం సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, శ్రీనివాసరాజు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సీఎం ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రి, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్, హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి పాల్గొన్నారు.

నేతన్నలకు ప్రభుత్వం అండ

(మొదటిపేజీ తరువాయి)

మాట్లాడుతూ నేతన్నలకు ఎప్పుడూ కాంగ్రెస్ పార్టీనే అండగా ఉంటుందని చెప్పారు. గత పాలకులు నేతన్నలకు చేసిందేం లేదని కేవలం మాటలతోనే కాలం వెల్లదీశారని దుయ్యబట్టారు. వేములవాడ దేవాలయభివృద్ధికి చేసిందేం లేదని, మేం చిత్తశుద్ధితో ఆలయాభివృద్ధికి కృషి చేస్తున్నామని అందులో భాగంగానే బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించామని వివరించారు. విద్యాభివృద్ధికి శాతవాహన యూనివర్సిటీని రెండు వందల ఎకరాల్లో ఏర్పాటు చేశామని, గత బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న పదేళ్లు ఈ యూనివర్సిటీని పట్టించుకోలేదని విమర్శించారు. మేం అధికారంలోకి వచ్చాక ఇంజినీరింగ్ కాలేజ్, లా కాలేజ్ మంజూరు చేశామని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్రాభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నా ప్రతిపక్షాలు తమ స్వార్థ రాజకీయాల కోసం మాపై దుష్ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. కంచ గచ్చిబౌలిలో 400 ఎకరాలు ముమ్మాటికి ప్రభుత్వ భూమే అని స్పష్టం చేశారు. సహచర మంత్రులతో సమన్వయం చేసుకొని ఉమ్మడి కరీంనగర్ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని అన్నారు. చేనేత మహిళా సంఘాలకు రూ.ఐదు లక్షల చొప్పున ఇచ్చి సిరిసిల్ల ప్రాంతానికి 12 వేలకు పైగా అంత్యోదయ కార్డులు ఇచ్చామని వివరించారు. అంతకు ముందు సిద్దిపేట జిల్లా ఇబ్రహీంనగర్ వడగళ్ళ వర్షానికి దెబ్బతిన్న పంటపొలాలను పరిశీలించారు. రైతులను అడిగి వారి జరిగిన నష్టంపై ఆరా తీశారు. రైతాంగానికి ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా ఉంటుందని, అధైర్యపడాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు.

విజయవాడ మెట్రో కదలిక

(మొదటిపేజీ తరువాయి)

గన్నవరం వరకు ఉండనుంది. ప్రాజెక్ట్ రూపకల్పనలో భూసేకరణకుగాను మొత్తం రూ.1,152 కోట్లు అవసరమవుతుందని ప్రాథమిక అంచనా వేశారు. తొలిదశలో చేపట్టబోయే మెట్రోలైన్‌కు సేకరించే 82.66 ఎకరాల్లో రైల్వే సహా కేంద్ర ప్రభుత్వ సంస్థలకు చెందిన స్థలం 1.03 ఎకరాలుగా ఉంది.

సామాన్య, పేద కుటుంబాలకు చేయూత

(మొదటిపేజీ తరువాయి)

రూ. రెండు లక్షలు రుణమాఫీ చేశామన్నారు. పినపాక నియోజకవర్గం మణుగూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ... సన్న వడ్లు పండించే రైతన్నలకు క్వింటాకు రూ. 500 బోనస్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌కే దక్కిందన్నారు. పులుసు బొంత ప్రాజెక్టుకు త్వరలో సీఎం శంకుస్థాపన చేస్తారన్నారు. అర్హులకు అందించేందుకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు వేగవంతమైన చర్యలు తీసుకుంటున్నామని మంత్రి చెప్పారు. ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్లు కేటాయించినట్లు చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలకనుగుణంగా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా రూ. 10 లక్షల వరకు ఉచితంగా వైద్య సదుపాయం కల్పిస్తున్నామన్నారు. రూ. 500లకే గ్యాస్‌తోపాటు... రాజీవ్ యువ వికాసం ద్వారా నిరుద్యోగ యువకులకు రూ. 50 వేల నుంచి రూ. నాలుగు లక్షల వరకు సబ్సిడీ పై రుణాలు అందుస్తున్నట్లు చెప్పారు. దేశ చరిత్రలోనే పేద కుటుంబాలకు సన్న బియ్యం అందించడం తమ ప్రభుత్వానికే సాధ్యమైందన్నారు. మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు బలరాం నాయక్, పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆహార భద్రతకు సన్నబియ్యం: తెల్ల రేషన్ కార్డు ఉన్న పేదలందరికీ సన్న బియ్యం అందిస్తున్నామని మంత్రి పొంగిలేటి చెప్పారు. పేద ప్రజలకు ఆహార భద్రత కల్పించేందుకు రాష్ట్రం సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు. మణుగూరు మండలంలోని బొజ్జవారి గుంపు కూనవరం రోడ్డులో ఆదివాసీ తెగకు చెందిన వంక శివలక్ష్మి కుటుంబ సభ్యులతో కలిసి మంత్రి భోజనం చేశారు. పాయసం, పులిహోర, సేంద్రీయ ఎరువులతో పండించిన తోటకూర పప్పు, గోంగూర చట్నీ మంత్రికి ఆత్మీయంగా వడ్డించింది. రాష్ట్రంలో 80 శాతానికి పైచిలుకు బడుగు బలహీన, దళిత, గిరిజన, మైనార్టీ ప్రజలు లబ్ధి పొందుతున్నారని మంత్రి వివరించారు. శివలక్ష్మికి అన్నివిధాల సాయమందించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ కు సూచించారు.

పోక్సో నిందితుడికి 25 ఏళ్ల జైలు

(మొదటిపేజీ తరువాయి)

చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు... అన్ని ఆధారాలు సేకరించి కోర్టుకు సమర్పించారు. దీనిపై సుదీర్ఘ వాదనల అనంతరం పోక్సో ప్రత్యేక న్యాయస్థానం గుట్ల శ్రీనివాస్‌ను దోషిగా తేల్చింది. తాజాగా 25 ఏళ్ల జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించింది. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా మరో ఆరు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి ఆదేశించారు. బాధితురాలికి పరిహారంగా రూ.5 లక్షలు చెల్లించాలని తీర్పులో పేర్కొంది.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - కొండమల్లేపల్లి : మండల పరిధిలోని బాల్ల తండా వద్ద పిఎసిఎస్, ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రంను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఐకెపి కేంద్రంలోనే రైతు వరి పంటను విక్రయించి ప్రభుత్వం కల్పిస్తున్న కనీసం మద్దతు ధరను పొందాలన్నారు. అదేవిధంగా రైతులకు క్వింటాలకు 500 రూపాయల బోనస్ ప్రభుత్వం అందిస్తుందని, ధాన్యంలో తరుగు పేరుతో కోతలు లేకుండా చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేసేలా అధికారులకు సూచించారు రైతులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. పిఎసిస్ చైర్మన్ డాక్టర్ దూదిపాల వేణుధర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నరసింహ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఊట్కూరు వేమన్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ కాసర్ల వెంకటేశ్వర్లు, మాజీ జడ్పిటిసి సలహాదారులు పసునూరి యుగంధర్ రెడ్డి, మేకల శ్రీనివాస్ యాదవ్, మార్కెట్ డైరెక్టర్ పెద్దిశెట్టి సుధాకర్, డిసిఓ పత్య నాయక్, డిటిసిఎస్ హనుమంతు శ్రీనివాస్ గౌడ్, ఎంపీడీవో బాలరాజు రెడ్డి, సహకార సంఘం సీఈఓ పల్లా తిరుపతిరెడ్డి, సహకార సంఘం డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

సన్న బియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - నేరేడుచర్ల : కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు రేషన్ దుకాణాలలో సన్న బియ్యం ఇస్తుండడంతో కడుపునిండా భోజనం చేస్తున్నారని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు కొంత చిన్న వెంకటరెడ్డి అన్నారు. నేరేడుచర్ల మున్సిపాలిటీలోని 13వ వార్డులో రేషన్ కార్డు లబ్ధిదారులతో సన్న బియ్యం భోజన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వం దొడ్డు రకం బియ్యం ఇవ్వడంతో లబ్ధిదారులు తినలేక పోయారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి పేదవాడు రేషన్ బియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉద్దేశంతో ఒక్కొక్కరికి 6 కేజీల బియ్యాన్ని అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ తాళ్ల సురేష్ రెడ్డి పట్టణ అధ్యక్షులు నూకల సందీప్ రెడ్డి మాజీ మున్సిపల్ చైర్మన్ ప్రకాష్ నాయకులు పాండు నాయక్ చింతమల్ల సైదులు కత్తి శ్రీనివాస్ రెడ్డి కొనతం మంజుల రమాదేవి ఝాన్సీ శంకరాచారి మరియమ్మ శ్రీను పాల్గొన్నారు.

వరంగల్ మహాసభను విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - కారేపల్లి : కాంగ్రెస్ పార్టీ అసాధ్యంగాని హామీలను కాంగ్రెస్ పార్టీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని బిఆర్ఎస్ పార్టీ నేత, వైరా మాజీ శాసనసభ్యులు బానోతు మదన్లాల్ ఆరోపించారు. బి ఆర్ ఎస్ పార్టీ వ్యవస్థాపకులు కల్వకుంట్ల చంద్రశేఖరరావు, పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావుల ఆదేశాలతో బహిరంగ సభ సందర్భంగా శుక్రవారం సింగరేణి కేంద్రమైన కారేపల్లిలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ వైరా నియోజకవర్గం అంటేనే ఉద్యమాల గడ్డ అని, నాటి తెలంగాణ పోరాటం నుండి నేటివరకు అడుగడుగునా బీఆర్ఎస్కు ప్రజలు జేజేలు పలుకుతున్నారన్నారు. 25 ఏళ్ల పార్టీ ఆవిర్భావ వేడుకలను వాడవాడలో పండుగలా నిర్వహించాలని కోరారు. బహిరంగ సభకు తరలి వెళ్లే పార్టీ శ్రేణులకు ప్రాధాన్యత ఇవ్వాలని స్థానిక నాయకులను కోరారు. కారేపల్లి మండలం నుండి సుమారు 2000 మందిని బహిరంగ సభకు తరలించాలన్నారు. సూచించారు. ఏప్రిల్ 27న అన్ని గ్రామాల్లో పార్టీ జెండాలను ఆవిష్కరించి బయలు దేరాలని పిలుపునిచ్చారు.

మహిళల ఆర్థిక అభివృద్ధే ధ్యేయం : మంత్రి సీతక్క

విశాలాంధ్ర జిల్లా బ్యూరో-మహబూబాబాద్: తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పథకం దేశానికె ఆదర్శమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి, ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. శుక్రవారం మహబూబాబాద్ జిల్లా, కొత్తగూడ మండలం గుంజేడు గ్రామంలో రేషన్ కార్డుదారుడు సిరబోయిన క్రాంతి కుమార్, వారి కుటుంబ సభ్యులు పద్మ, జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, అటవీ శాఖ అధికారి విశాల్, తదితర అధికారులతో కలిసి సీతక్క సన్న బియ్యం భోజనం చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి, పేద ప్రజలకు, మహిళలకు అన్ని వర్గాల ప్రజలకు చేదోడు, వాదోడుగా ఉంటుందని అన్నారు. ప్రతి పేదవాడి ఆకలి తీర్చేందుకు ఈ సన్న బియ్యం పథకం ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. మహిళ ఆర్థిక అభివృద్ధి కోసం ఉచిత బస్సు ప్రయాణం, 500 కె గ్యాస్ పంపిణీ పథకం, వడ్డీ లేని రుణల ద్వారా మహిళలు వివిధ నూతన వ్యాపారాలను ప్రారంభించి ఆర్థికంగా ఎదగాలని కోరారు. సోలార్ విద్యుత్ సరఫరా ప్లాంట్, వ్యవసాయ ఆధారిత వ్యాపారులతోపాటు వాణిజ్య వ్యాపారాలను ప్రారంభించాలన్నారు. కొత్తగూడ మండలం శ్రీ గుంజేడు ముసలమ్మ గ్రామ ఐక్య సంఘానికి 60 లక్షలు, వడ్డీ లేని రుణాలు, 25 కోట్ల బ్యాంకు లింకేజీ, గంగారం మండలానికి 15 లక్షల వడ్డీ లేని రుణాలు, పది కోట్ల బ్యాంకులు లింకేజ్ మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, అటవీ శాఖ అధికారి విశాల్, రెవెన్యూ డివిజన్ అధికారి కృష్ణవేణి, డిడబ్ల్యుఓ ధనమ్మ, డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, స్థానిక తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీవో రవీంద్ర ప్రసాద్, డిఎస్ఓ ప్రేమ్ కుమార్, డిఎం సివిల్ సప్లై కృష్ణవేణి, మండల ప్రత్యేక అధికారి వేముల సురేష్ పాల్గొన్నారు.

మే20న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - కొమరం భీం : మహాత్మ జ్యోతిరావు పూలే 198వ జయంతిని కాగజ్ నగర్ రిటైర్మెంట్ భవన్లో సిఐటియు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించరు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన సిఐటియు రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు మాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావు పూలే ఒక గొప్ప సామాజిక న్యాయ సంఘకర్త కుల వివక్షతపై పోరాడిన గొప్ప మేధావి వెనుకబడిన వర్గాల కోసం పోరాడిన గొప్ప మహనీయుడన్నారు. సమాజంలో అగ్ర కులాల వారి బానిసలుగా బతుకుతున్న విప్లవాన్ని రగిలించారు. పూలే స్ఫూర్తితో మే 20న దేశవ్యాప్తంగా కార్మిక సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్మికులకు కనీస వేతనం నెలకి 26 వేలు 8 గంటల పని దినాలను అమలు పరచాలని ఈఎస్ఐపిఎం సౌకర్యాలను పని భద్రత కల్పించాలని పలు డిమాండ్లతో ఆల్ ట్రేడ్ యూనియన్స్ ఆధ్వర్యంలో మే 20 న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె పిలుపునిచ్చింది. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్, ఉపాధ్యక్షులు త్రివేణీ, శ్రీకాంత్ బాలకిషన్.శంకర్ సహాయక కార్యదర్శి పద్మా, ఆఫీసు బేరర్ వెలిశాల క్రిష్ణమాచారి, జిల్లా నాయకులు, నగేశ్ మోరేష్, సంజీవ్ మాయ గౌస్ శివరాం పాల్గొన్నారు.

22 మంది మావోయిస్టు సభ్యులు లొంగుబాటు : ఎస్పీ

విశాలాంధ్ర - ములుగుజిల్లాబ్యూరో : ప్రభుత్వ నిషేధిత సిపిఐ మావోయిస్టు పార్టీకి చెందిన 22 మంది మావోయిస్టు సభ్యులు, ములుగు జిల్లా ఎస్పీ డా.పి.శబరీష్ ఎదుట లొంగిపోయారు. తెలంగాణ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ములుగు జిల్లా పోలీసులు, సిఆర్పిఎఫ్ 39 బెటాలియన్ అధికారుల సమక్షంలో పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ ముందు లొంగిపోయిన మావోయిస్టు సభ్యులును హాజరు పర్చారు. జిల్లా ఎస్పీ సభరీష్ మాట్లాడుతూ అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు, ప్రభుత్వం ఎదుట లొంగిపోవడం కోసం నిర్వహిస్తున్నటువంటి "పోరుకన్నా ఊరు మిన్న, మన ఊరికి తిరిగి రండి" కార్యక్రమం ద్వారా ములుగు జిల్లాలో లొంగిపోయినటువంటి మావోయిస్టు సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాల గురించి తెలుసుకొని హింసాత్మక నక్సలిజం మార్గాన్ని వదిలిపెట్టి కుటుంబంతో కలిసి ప్రశాంతమైన జీవితాన్ని గడపాలని నిర్ణయించుకొని వివిధ హోదాలో పనిచేయుచున్న 22 మంది నిషేధిత సిపిఐ మావోయిస్టులు లొంగిపోయారని పేర్కొన్నారు.

వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా నేడు సిపిఐ ఆందోళన

విశాలాంధ్ర - ఖమ్మం : భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) జాతీ య సమితి పిలుపులో భాగంగా వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా ఈనెల 12న అన్ని మండల, జిల్లా కేంద్రంలో ఆందోళనలు నిర్వహించనున్న ట్లు సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ ప్రకటనలో తెలి పారు. బిజెపి లౌకిక వాదానికి తూట్లు పొడుస్తూ మతోన్మాద చర్యలకు పాల్పడుతుందని సురేష్ ఆరోపించారు. మెజార్టీ, మైనార్టీ ప్రాతిపదికన ఎన్నికల్లో లబ్ది పొందెందుకు మాత్రమే ప్రయత్నిస్తుందని ఆరోపించారు. బిజెపికి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాట క్రమంలో ఈ ఆందోళనను నిర్వహించ నున్నట్లు ఆయన తెలిపారు. పార్టీ నాయకత్వం అన్ని మండలాల్లో ఆందోళనలు జరిగేవిధంగా చూడాలని కోరారు.

13న గొర్రెల కాపరుల సంఘం ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర బ్యూరో - పెద్దపల్లి: ఈనెల 13న గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం 4వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షులు సలేంద్ర రాములు యాదవ్ పిలుపునిచ్చారు. 13న బీపీ మండల్ యాదవ్ వర్ధంతి గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం 4వ ఆవిర్భావ దినోత్సవాన్ని యాదగిరి గుట్ట (యాదాద్రి)లోని లక్కీ ఫంక్షన్ హాల్లో నిర్వహించడం జరుతుందని, దీనికి పెద్దపల్లి జిల్లాలో ఉన్న అఖిల భారత యాదవ మహాసభ నాయకులు ప్రజాప్రతినిధులు, హాజరై గొల్ల, కురుమల, గొర్రెల కాపరుల ప్రస్తుత స్థితిగతులు సహకార సంఘాల నిర్వహణ సంక్షేమం పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుతెన్నులపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందించుకోవడం జరుగుతుందన్నారు. గొర్రెల, మేకల పెంపకం పై అవగాహన కార్యక్రమం వుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బత్తిని లక్ష్మణ్ యాదవ్ దాడి చంద్రమౌళి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు

విశాలాంధ్ర- జిల్లా బ్యూరో మహబూబాబాద్: హక్కుల కోసం పోరాడిన మహాత్మా జ్యోతి బాపూలే బలహీన వర్గాలకు ఆత్మ స్థైర్యం కల్పించి, వారి హక్కుల కోసం పోరాడిన మహనీయుడు జ్యోతిబా పూలే అని ఆయన ఆశయాలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్లో బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతి బాపూలే 199వ జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పోతో కలిసి జ్యోతి వెలిగించి ఆయన చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ బలహీన వర్గాలకు ఆత్మస్థైర్యం కల్పించి, వారి హక్కుల కోసం పోరాడిన మహనీయుడు మహాత్మా జ్యోతి బాపూలే అని అన్నారు. బి.సి. డెవలప్మెంట్ అధికారి ఎం. నరసింహస్వామి, మైనారిటీ శాఖ అధికారి శ్రీనివాస్, జెడ్.పి సీ.ఈ.ఓ పురుషోత్తం, జిల్లా సహకార శాఖ అధికారి వెంకటేశ్వర్లు, వ్యవసాయ శాఖ అధికారి విజయ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య కలెక్టరేట్ సూపరింటెండెంట్లు మదన్ మోహన్, వినోద్, కుల సంఘాల నాయకులు కామా సంజీవరావు, కిషన్ నాయక్ బోడ లక్ష్మణ్ నాయక్, పొన్నాల యుగంధర్, చిత్తారి సోమన్న, సూర్య ప్రకాష్, సాయికుమార్, పింద్రాల రాందాస్, మంద శశి, ఉద్యోగులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - కొత్తగూడెం : సింగరేణి కాలరీస్ కార్పొరేట్ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతి రావు పూలే జయంతి వేడుకలను సింగరేణి ప్రధాన కార్యాలయ, హెచ్ఆర్డి కాన్ఫరెన్స్ హాల్ నందు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమానికి జనరల్ మేనేజర్ (పర్సనల్) వెల్ఫేర్, ఐఆర్ అండ్ పిఎం కవితా నాయుడు అధ్యక్షత వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా సంస్థ డైరెక్టర్(పా), (పిఅండ్ పి) కే.వెంకటేశ్వర్లు, విశిష్ట అతిధి గా డైరెక్టర్ (ఈ అండ్ ఎం) డి.సత్య నారాయణ రావు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మహాత్మా జ్యోతి రావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి సింగరేణియులకు మహాత్మా పూలే జయంతి శుభాకాంక్షలు తెలియజేసారు. గుర్తింపు సంఘం జనరల్ సెక్రటరీ కే.రాజ్ కుమార్, ప్రాతినిధ్య సంఘం జనరల్ సెక్రటరీ సి.త్యాగరాజన్, సిఎంఓ ఏఐ కార్పొరేట్ ప్రెసిడెంట్ ఎస్.వెంకటా చారి, ఎస్సీ ఎస్టీ ఓబీసీ లైజన్ ఆఫీసర్లు, నాయకులు పి.హరి శంకర్, మాలకొండయ్య, మురళి, నాగేశ్వర రావు, ఎన్.రమేష్, వేంకటేశ్వర రావు, కే.వి.ప్రకాష్, జే.సతీష్, అంతోటి నాగేశ్వరరావు, జిఎంలు మనోహర్, సుబ్బారావు, శ్రీనివాస్, ఎలిశా, ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - గార్ల : బలహీన వర్గాలకు ఆత్మస్థైర్యం కల్పించి వారి హక్కుల కోసం పోరాడిన మహనీయుడు మహాత్మ జ్యోతిబా పూలే అని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ధనియాకుల రామారావు, ఇల్లందు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ భూక్యా నాగేశ్వరావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జ్యోతిబాపూలే 198వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సమాజంలో కుల వివక్ష,అంటరానితనంపై పోరాటం చేసి, వెనుకబడిన బడుగు, బలహీన వర్గాలకు హక్కులు కల్పించి మహిళలకు విద్యా అవకాశాలు కల్పించిన గొప్ప సంఘసంస్కర్త అని కొనియాడారు. ఆయన సత్యశోధక్ సమాజాన్ని స్థాపించారని తెలిపారు. నాయకులు బాపనపల్లి సుందర్, రవి, ఎం.సురేష్, అశోక్,మల్లిబాబు, వీరాస్వామి, శేఖర్, యాదగిరి, కేశవులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర- తొర్రూరు: తొర్రూరు డివిజన్ కేంద్రంలోని కాంగ్రెస్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే జయంతి వేడుకల సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించి ఘనంగా జరుపుకున్నారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంచు సంతోష్ మాట్లాడుతూ జ్యోతిరావు పూలే తన జీవితాంతం సామూహిక ఆర్థిక సాంస్కృతిక రాజకీయ శక్తులను విశ్లేషించడంలో అవిశ్రాంతగా కృషిచేసి పోరాటం చేశారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గంజి విజయపాల్ రెడ్డి, పెదగాని సోమయ్య,యూత్ పట్టణ అధ్యక్షుడు మహేష్ యాదవ్, నాయకులు గుండాల నరసయ్య,మంగళపల్లి రామచంద్రయ్య, జీనుగ సురేందర్ రెడ్డి, ధర్మారపు మహేందర్, బచ్చలి లక్ష్మణ్, కిషన్ యాదవ్, బిజ్జాల అనిల్, ముద్దసాని సురేష్, కుశాల్, హేమంత్ నాయక్, చంటి, పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి, సింగరేణి : దోపిడి, బానిసత్వం, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం సామాజిక మార్పుకోసం పోరాడిన మహనీయుడు జ్యోతిబా పూలే అని బీసి సంక్షేమ సంఘం నేత,రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. శుక్రవారం గోదావరిఖని ఓసిపి-5 గని ఆవరణలో 198వ పూలే జయంతిని పురస్కరించుకొని సింగరేణి బిసి ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జ్యోతి బా పూలే విగ్రహాన్ని ఆర్ కృష్ణయ్య, ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజఠాకూర్తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూలే ఆనాటి కాలంలో బడుగు బలహీనవర్గాల కోసమే కాకుండా అస్పృశ్యతా నిర్మూలన కోసం, మహిళా అభ్యున్నతి, విద్య కోసం ఎంతగానో కృషిచేశారని అన్నారు. ఆర్జీ వన్ జీఎం డి.లలిత్ కుమార్తో పాటు పలువురు సింగరేణి బిసి ఉద్యోగ సంఘం నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : మహాత్మ జ్యోతిబా పూలే జయంతి వేడుకలను శుక్రవారం కలెక్టరేట్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అదనపు కలెక్టర్లు, ఇతర జిల్లా అధికారులు జ్యోతి బా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ మాట్లాడుతూ, అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు జ్యోతిబా పూలే అని కొనియాడారు. అస్పృశ్యత, అంటరానితనం, కులవివక్షత వంటి సామాజిక రుగ్మతలను నిర్మూలించేందుకు జ్యోతిబా పూలే పోరాటం, చూపిన తెగువ స్ఫూర్తిదాయకమని అన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల అధికారి శ్రీనివాస్, ఎస్సీ సంక్షేమ అధికారి రాజేశ్వర్ గౌడ్, మైనారిటీ అధికారి మోహన్ సింగ్, సిపిఓ జీవరత్నం, ఎల్డిఎం రామ్ గోపాల్, జిల్లా పరిశ్రమల మేనేజరు నరసింహారెడ్డి, వివిధ కుల సంఘాల నాయకులు నర్సాగౌడ్, భాస్కర్, ప్రభాకర్, మనోజ్, ముడుగు సత్యనారాయణ గౌడ్, ఇతర నాయకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : విద్య, మహిళల బలోపేతానికి మహాత్మా జ్యోతిబాపూలే చేసిన కృషి అపూర్వమని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు.మహాత్మా జ్యోతిబాపూలే 199 వ జయంతిని పురస్కరించుకొని జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నల్గొండ జిల్లా కేంద్రంలోని క్లాక్ టవర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన మహాత్మ జ్యోతిబాపూలే జయంతి కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతిబాపూలే విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించిన అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జ్యోతిబాపూలే సాధించిన ఘనత దేశానికి మార్గదర్శకమైందని, చదువు కోసం, మహిళల సాధికారత కోసం ఆయన చేసిన కృషి అపూర్వమని అన్నారు. సామాజిక ఉద్యమకారునిగా, కుల వివక్షతకు వ్యతిరేకంగా, అన్ని వర్గాల సమానత్వానికి కృషి చేసిన మహాత్మ జ్యోతిబాపూలే సేవలు నేటి సమాజం ఆచరిస్తున్నదని అన్నారు. శాసన సభ్యులు నెల్లికంటి సత్యం, ఎస్పీ శరత్ చంద్ర పవార్,విశ్రాంత ఐఏఎస్ అధికారి చోల్లేటి ప్రభాకర్, సంఘాల నాయకులు లక్ష్మీనారాయణ, చక్రధర్ అడిషనల్ ఎస్పీ రమేష్, జెడ్పి సీఈవో ప్రేమ్ కరన్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ పీడి రాజ్ కుమార్, డిఆర్డిఓ శేఖర్ రెడ్డి, నల్గొండ ఆర్డిఓ వై. అశోక్ రెడ్డి, డిఎస్పి శివరామిరెడ్డి, సహాయ బీసీ సంక్షేమ అధికారి సంజీవ, ఇతర అధికారులు, వివిధ సంఘాల నాయకులు కార్యక్రమానికి హాజరై మహాత్మ జ్యోతిబాపూలేకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాగా సమాచార పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతి సారథి కళాకారులు మహాత్మ జ్యోతిబాపూలే గొప్పతనాన్ని తమ సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ఆహుతులకు తెలియజేశారు

విశాలాంధ్ర బ్యూరో - సంగారెడ్డి : అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడిన మహనీయుడు మహాత్మా జ్యోతిబాపూలే అని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. శుక్రవారం మహాత్మ జ్యోతిబాపూలే 199వ జయంతి నీ పురస్కరించుకొని సంగారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సమీపంలో ఉన్న మహాత్మ జ్యోతిబాపూలే విగ్రహానికి టీజీఐఐసీ నిర్మల జగ్గారెడ్డి, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్లతో కలిసి పూలమాలలు వేసి ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. మహాత్మ జ్యోతిబాపూలే సమాజంలో అన్నగారిన వర్గాలు అభ్యున్నతికి జీవితాన్ని అంకితం ఇచ్చిన మహా నాయకుడు అన్నారు. సత్యమేవ జయతే నినాదంతో సమ సమాజ నిర్మాణం కోసం పాటుపడిన మహనీయుడు మహాత్మ జ్యోతిబాపూలే అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, వివిధ శాఖల జిల్లా అధికారులు, కుల సంఘాల ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

పూలే ఆశయాలకు పోరాడదాం

విశాలాంధ్ర - ఖమ్మం : భారతదేశ సంఘ సంస్కర్త, మహత్మ జ్యోతిరావు పూలే ఆశయాల కోసం పోరాడదామని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు పిలుపునిచ్చారు. మహత్మ జ్యోతిరావు పూలే 198వ జయంతి సందర్భంగా శుక్రవారం సిపిఐ కార్యాలయం గిరిప్రసాద్ భవన్లో జరిగిన కార్యక్రమంలో పూలే చిత్ర పటానికి సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్లు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు మాట్లాడుతూ శూద్రులకు చదువులకు దూరం చేసిన మనువాదాన్ని తోసిపుచ్చి చదువు ద్వారానే మనిషి విజ్ఞానవంతుడవుతాడని, మనువాదానికి వ్యతిరేకంగా మహత్మ జ్యోతిరావు పూలే పోరాడారన్నారు. మహిళలను తక్కువ చేసి వీరికి చదువులు అవసరం లేదని వంటింటికే పరిమితం చేసిన మనువాదులకు వ్యతిరేకంగా 1948లో మహారాష్ట్ర పూణే నగరంలో స్త్రీలకు పాఠశాలను ఏర్పాటు చేసిన మహనీయుడు పూలే అన్నారు. బిసి హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మేకల శ్రీనివాసరావు, తాటి -వెంకటేశ్వరరావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జమ్ముల జితేందర్రెడ్డి, ఏపూరి లతాదేవి, పోటు కళావతి, నాయకులు గాదె -లక్ష్మి నారాయణ, నూనె శశిధర్, తాటి నిర్మల, జ్వాలా నర్సింహారావు, మేకల రవికుమార్, పోటు పూర్ణచంద్రరావు, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

పామాయిల్ సాగుకు మొగ్గు చూపాలి: కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : ప్రభుత్వం పట్టాలిచ్చిన గిరిజన రైతులు ఆర్వోఎఫ్ఆర్ భూములలో పామాయిల్ సాగుకు మొగ్గు చూపాలని కలెక్టర్ జితేష్. వి. పాటిల్ సూచించారు. శుక్రవారం సాయంత్రం మంత్రి పొంగిలేటి శ్రీనివాసరెడ్డి పర్యటన అనంతరం ఐటిడిఓ పిఓ రాహుల్ తో కలిసి కలెక్టర్ పినపాక తహసిల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. మండలంలో నెలకొన్న సమస్యలపై తహసిల్దార్ అద్దంకి నరేష్ను అడిగి తెలుసుకున్నారు. పురాతన కార్యాలయ భవనాన్ని కలెక్టర్, పివోలు పరిశీలించారు. మైనర్ రిపేర్లు ఎస్టిమేషన్ వేసి పంపాలని తహసీల్దార్ కు సూచించారు. కార్యాలయంలోని ఆవరణ ను పరిశీలించి మట్టి తొలించి మునగ మొక్కలు నాటాలని సూచించారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సునీల్ కుమార్, డిప్యూటీ తాసిల్దార్ సమ్మయ్య, రెవిన్యూ ఇన్స్పెక్టర్ రమేష్, సర్వేయర్ నరేష్, యుడిసి శ్రీనివాసరావు, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి : డీఎస్పీ

విశాలాంధ్ర - ఇల్లందు : శాంతిభద్రతల కోసం అహర్నిశలు కృషి చేస్తున్న పోలీసుల తోపాటు వారి కుటుంబ సభ్యులు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని ఇల్లందు డీఎస్పి ఎన్.చంద్రభాను పలు సూచనలు చేశారు. శుక్ర వారం పట్టణంలోని స్థానిక అయితా ఫంక్షన్ హాల్లో ఇల్లందు సబ్ డివిజన్ పోలీస్ అధికారులకు, సిబ్బందికి వారి కుటుంబ సభ్యులకు సీఐ బత్తుల సత్యనారాయణ నేతృత్వంలో కంటి పరీక్షల శిబిరం నిర్వహించారు. ఖమ్మం పట్టణానికి చెందిన మ్యాక్స్ విజన్ ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ శరత్, నరేందర్ ఆధ్వర్యంలో ఈ కంటి పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎన్.చంద్రభాను పాల్గొన్నారు. విధినిర్వహణలో నిరంతరం శ్రమించే పోలీసులు తమ ఆరోగ్యం గురించి ఎప్పటికప్పుడు చెకింగ్ చేయించుకోవాల న్నారు. పోలీసులు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుండాల సీఐ రవీందర్, టేకులపల్లి సిఐ సురేష్, సబ్ డివిజన్ ఎస్సైలు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు కంటి పరీక్షలు చేయించుకున్నారు.

ఇస్రో ఆన్లైన్ వెబినార్లో విద్యార్థులు పాల్గొనాలి

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : ఈనెల 19న భారత అంతరిక్ష సంస్థ ఇస్రో నిర్వహించే ఆర్యభట్ట స్వర్ణోత్సవ ఆన్లైన్ విబినార్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు విధిగా పాల్గొనాలని సింగరేణి కాలరీస్ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి జి. శ్రీనివాస్ కోరారు. భారతదేశం మొట్టమొదటి సాటిలైట్ ఆర్యభట్ట ప్రయోగించి 50 ఏళ్ళు పూర్తి అవుతున్న నేపథ్యంలో ఈ స్వర్ణోత్సవం నిర్వహిస్తున్నట్లు శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో చెప్పారు. ఈ సందర్భాన ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో) సంస్థ విద్యార్థులు, ఉపాధ్యాయుల్లో శాస్త్రీయ దృక్పథం, సైంటిఫిక్ స్పిరిట్, భారతీయ, అంతరిక్ష విజ్ఞానం, సాంకేతిక అవగాహన పెంపొందించడానికి ఈ ఆన్లైన్ వెబినార్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా సింగరేణి పాఠశాలల్లోని ఉపాధ్యా యులు, విద్యార్థులందరూ www.aryabhata.India space week.org వెబ్సైట్లో ఈనెల 17లోపు రిజిస్ట్రేషన్ చేసుకొని పాల్గొనాలని శ్రీనివాస్ కోరారు. ఇందులో వివిధ రకాల పోటీలు నిర్వహించి పాల్గొన్న ప్రతి ఒక్కరికి ఇస్రో సర్టిఫికెట్స్ ప్రధానం చేస్తుందన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేసిన డియంహెచ్ఓ

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో : గర్భిణీ స్త్రీలకు, పాలిచ్చు తల్లులకు, వృద్ధులకు ఎండాకాలంలో తీసుకోవలసిన జాగ్రత్తల పట్ల అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ గోపాల్రావు వివరించారు. శుక్రవారం రాయిని గూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని జాకారం, ములుగు ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలను డియంహెచ్ఓ గోపాల్రావు ఆకస్మిక తనఖీ చేశారు. రోజువారి రోగుల వివరాలను అడిగి తెలుసుకుని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులను జాగ్రత్తగా చూచుకోవాలన్నారు. అనంతరం మందుల నిల్వల రిజిస్టర్లను పరిశీలించి, అందుబాటులో లేని మందులను ముందస్తుగా, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయానికి రిక్వైర్మెంట్ పంపించాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో, ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలలో ఓఆర్ఎస్, జింక్ కార్నర్ ఏర్పాటు చేయాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీని, మందుల నిల్వల రోజువారి రిపోర్టును జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయానికి పంపించాలని సూచించారు. ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాల మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ జితేందర్ ,నవ్య, సూపర్వైజర్ దేవమ్మ, ఆరోగ్య కార్యకర్తలు తిరుమల, నరసమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

14న రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల స్వీకరణ : కలెక్టర్

విశాలాంధ్ర -కొమురం భీం : నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకం కొరకు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 14వ తేదీ వరకు కల్పించిన అవకాశాన్ని అర్హత గల అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 12, 13, 14 తేదీలలో మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మునిసిపల్ కార్యాలయాలలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కేంద్రాలు కార్యాలయ పని వేళలలో తెరిచి ఉంటాయని, అర్హత గల అభ్యర్థులు దరఖాస్తులు అందజేయాలన్నారు. 3 రోజుల పాటు ప్రజాపాలన కేంద్రాల సిబ్బంది, డేటా ఎంట్రీ ఆపరేటర్లు కార్యాలయ పని వేళలు ఉదయం 9 నుండి సాయంత్రం 5 గంటల వరకు విధులకు తప్పనిసరిగా హాజరు కావాలని, దరఖాస్తుదారుల నుండి దరఖాస్తులు స్వీకరించాలన్నారు.

సంపాదకీయం

రాణా సరే, హెడ్లీ మాటేమిటి?

ముంబైలో, ముఖ్యంగా దక్షిణ ముంబైలో 2008 నవంబర్ 11 న జరిగిన ఘోరమైన తీవ్రవాద దాడి వెనక ప్రధాన కుట్రదారుడు తహవ్వుర్ రాణాను అమెరికా నుంచి మన దేశానికి రప్పించినందుకు మోదీ ప్రభుత్వం జబ్బలు చరుచుకుంటోంది. కాదు రాణాను వెనక్కు రప్పించడానికి యూపీఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడే కృషి ప్రారంభించామని అప్పుడు కేంద్ర హోం మంత్రిగా ఉన్న పి.చిదంబరం చరిత్రను గుర్తు చేస్తున్నారు. ఒక దేశంలో దాగి ఉన్న తీవ్రవాదులను రప్పించడం అంత సులువైన వ్యవహారం కాదు. మొట్ట మొదట ఇలా రప్పించడానికి రెండు దేశాల మధ్య ఒక ఒడంబడిక ఉండాలి. మొత్తం మీద తహవ్వుర్ రాణా గురువారం ప్రత్యేక విమానంలో సకల కట్టుదిట్టాల మధ్య భారత్‌కు చేరుకున్నాడు. ఇక ఆయన మీద విచారణ జరిగి ఆయనకు శిక్ష పడాలి. 2008 నాటి ముంబై దాడులు చాలా భీకరమైనవి. పాకిస్థాన్ నుంచి పది మంది తీవ్రవాదులు సముద్ర మార్గంలో వచ్చి నవంబర్ 26 నుంచి 29 దాకా యదేచ్ఛగా దాడులు చేశారు. ఈ దాడుల్లో 173 మంది మరణించారని, 308 మంది గాయపడ్డారని అంచనా. ఇలాంటి సందర్భాలలో మృతుల సంఖ్యపై గానీ, క్షతగాత్రుల సంఖ్యపైగానీ నికరమైన సమాచారం ఉండదు. పాకిస్థాన్ నుంచి వచ్చిన పది మంది తీవ్రవాదుల్లో ఒక్క అజ్మల్ కసాబ్ మాత్రమే పట్టుబడ్డాడు. ఆయన మీద విచారణ జరిగింది. చివరకు ఆయనను ఉరి కూడా తీశారు. తహవ్వుర్ రాణాను అమెరికా నుంచి వెనక్కు రప్పించిన ఘనత తమదేనని మోదీ ప్రభుత్వం ఎన్ని గొప్పలైనా చెప్పుకోవచ్చు. కానీ ముంబై దాడికి కుట్ర పన్నిన వారిలో రాణాది చాలా చిన్న పాత్రేనని కేంద్ర మాజీ హోం శాఖ కార్యదర్శి జి.కె.పిళ్లే అంటున్నారు. రాణాను తీసుకొచ్చిన విమానం మన దేశంలో వాలక ముందే పిళ్లే ఈ విషయం బయట పెట్టారు. అసలు పాత్రధారి డేవిడ్ కోల్మన్ హెడ్లీ. ఆయనను మాత్రం మోదీకి సన్నిహిత మిత్రుడైన ట్రంప్ ప్రభుత్వం వెనక్కు పంపలేదు. నిజానికి అమెరికా ప్రభుత్వం హెడ్లీని రెక్కల కింద పెట్టుకుని కాపాడుతోంది. 2008 నవంబర్ 11 న బొంబాయిలో తీవ్రవాదులు కిరాతకమైన దాడికి పాల్పడినప్పటికీ, ఈ దాడుల వెనుక అసలు కుట్రదారు హెడ్లీ అని తెలిసినప్పటికీ అమెరికా ప్రభుత్వం ఆయనను తిప్పి పంపలేదు. 2008 నాటి దాడుల తరవాత కూడా హెడ్లీ అనేక సార్లు మన దేశానికి వచ్చారంటున్నారు. ముంబై దాడుల వెనక సూత్రధారి ఆయనే అని అమెరికా మనకు ఎప్పుడూ చెప్పలేదు. ఆయన అమెరికా పాస్‌పోర్టు పై మన దేశం వస్తున్నందువల్ల, ఆయన గురించి అమెరికా ప్రభుత్వం అసలైన సమాచారం ఇవ్వనందువల్ల ఆయనను అరెస్టు చేయడం కుదరలేదు. మన దేశం వచ్చి హెడ్లీ ఇక్కడి నుంచే పాకిస్థాన్ కూడా వెళ్లారు. నిజానికి హెడ్లీ ఒక వేపు అమెరికా తరఫున, మరో వేపు పాకిస్థాన్ తరఫున ఏజెంట్‌గా పని చేశారు. తహవ్వుర్ రాణాను వెనక్కు తీసుకొచ్చినందువల్ల ఆయన చేత ముంబై దాడులకు సంబంధించిన సమాచారం రాబట్టడానికి ప్రయత్నం ఎటూ జరుగుతుంది. ఆయన ఏ మేరకు సమాచారం బయట పెడ్తారో తెలియదు. హెడ్లీ మాత్రం ఇప్పుడు కూడా భారత వ్యతిరేక కార్యకలాపాల్లో మునిగి ఉన్నారు.

డేవిడ్ హెడ్లీని అమెరికా ప్రభుత్వం 2009 లోనే అరెస్టు చేసింది. కానీ మన దేశానికి మాత్రం అప్పగించడం లేదు. హెడ్లీని, రాణాను అమెరికా అరెస్టు చేసిన సమయంలో పిళ్లేనే కేంద్ర హోం శాఖ కార్యదర్శిగా ఉన్నారు. హెడ్లీ మన దేశానికి నకిలీ పత్రాలు సిద్ధం చేయడం మేరకే రాణా పాత్ర ఉందని పిళ్లే అంటారు. ముంబై దాడులకు ముందు కూడా హెడ్లీ అనేక సార్లు మన దేశానికి వచ్చారు. ఆయన పాకిస్థానీ ఏజెంట్ అని మన గూఢచార వర్గాలు కూడా పసిగట్టలేక పోయాయి. అమెరికా చాలా జాగ్రత్తగా హెడ్లీ అసలు స్వరూపం దాచేసింది. అమెరికా ఈ పని చేయకుండా ఉండి ఉంటే మనం ఆయన మీద నిఘా పెట్టడానికి అవకాశం ఉండేది. తహవ్వుర్ రాణా తీవ్రవాదులకు సహాయం చేసిన వాడే తప్ప తన ప్రాణాన్ని పణంగా పెట్టి తీవ్రవాద కార్యకలాపాలకు పాల్పడ్డ వాడు కాదంటారు. ఆయన ఎప్పుడూ తెర వెనకే ఉండి, హాయిగా షికాగోలో ఉంటూ తీవ్రవాద కార్యకలాపాలకు పాల్పడే వారికి సలహాలు, సూచనలు ఇచ్చేవాడు. ముంబై దాడులకు ముందు, ఆ తరవాత ఏం జరిగిందనే అంశం మాత్రం రాణాకు కచ్చితంగా తెలుసు. 1997 నుంచే రాణా ముంబై పేలుళ్లకు అసలు సూత్రధారి అయిన డేవిడ్ హెడ్లీతో కలిసి పని చేస్తున్నాడు. రాణా పాకిస్థాన్‌లో కులీన కుటుంబంలో పుట్టినవాడే. పాకిస్థాన్‌లోని సైనిక కళాశాలలో చదువుకున్నాడు. 1997లో రాణా కెనడాకు ప్రవాసం వెళ్లాడు. షికాగోలో రాణా వలస వచ్చే వారికి తోడ్పడడం కోసం ఒక కార్యాలయం నెలకొల్పాడు. వృత్తి రీత్యా రాణా వైద్యుడు. లష్కర్-ఎ-తోయిబా, పాక్ గూఢచార సంస్థ ఐఎస్ఐ పథకం ఏమిటో రాణాకు వివరించినట్టు సాయపడడానికి ఆయన ఒప్పుకున్నట్టు హెడ్లీ చెప్పాడు. నకిలీ పత్రాల ఆధారంగా హెడ్లీకి భారత్ వీసా వచ్చేట్టు చేశాడు. ఇవన్నీ చట్ట రీత్యా నేరాలే గనక ఈ అంశం ఆధారంగా కూడా రాణాకు శిక్ష పడే అవకాశం ఉంటుంది. ముంబై దాడులకన్నా ఒక వారం ముందు తహవ్వుర్ రాణా ముంబై వచ్చాడు. అహమదాబాద్, దిల్లీ, కోచ్చి, ఆగ్రా తదితర ప్రాంతాలలో తన భార్యతో సహా పర్యటించాడు. ఈ ప్రాంతాలన్నింటికి మన పోలీసులు రాణాను తీసుకెళ్లి ఆయన ఎక్కడెక్కడ తిరిగింది, ఎవరెవరితో మాట్లాడింది తెలుసుకునే ప్రయత్నం చేయవచ్చు. ఇవన్నీ ఆయనకు వ్యతిరేకంగా సాక్ష్యాలుగా పనికొస్తాయి. అయితే లష్కర్-ఎ-తోయిబా, పాకిస్థాన్ లోని మేజర్ ఇక్బాల్‌తో రాణాకు సంబంధాలున్నాయి. హెడ్లీనే ఈ మాట చెప్పారు. అయితే ఐఎస్ఐతో సంబంధాల విషయంలో మాత్రం హెడ్లీ ఏ విషయమూ బయట పెట్టలేదు. రాణా కేవలం తీవ్రవాదులకు వెసులుబాటు కలిగించడమే కాక స్వయంగా తీవ్రవాది అని మనం సాక్షాధారాలు సేకరిస్తే తప్ప కఠిన శిక్ష విధించడానికి అవకాశం ఉండదు. ముంబై దాడుల్లో మరణించిన వారిలో బ్రిటన్, ఇజ్రాయిల్, ఆస్ట్రేలియా, అమెరికా పౌరులు కూడా ఉన్నారు కనక ఈ దేశాలవారు మనకు గూఢచార సమాచారం అందిస్తే తప్ప పూర్తి ఫలితం ఉండదు. అన్నింటికన్నా మించి వాజపేయి ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు 1999 లో మన విమానాన్ని దారి మళ్లించి కాబూల్‌లో దింపితే ప్రయాణికుల ప్రాణ రక్షణ పేరిట మన జైళ్లల్లో ఉన్న మసూద్ అఝర్, ఉమర్ షేక్, ముస్తాక్ అహమద్ జర్గర్ అనే తీవ్రవాదులను అప్పటి కేంద్ర మంత్రి జస్వంత్ సింగ్ భద్రంగా కాబూల్‌లో దింపి వచ్చిన ఉదంతాన్ని గుర్తుంచుకుంటే ఈ ప్రభుత్వ సరళి ఎలా ఉంటుందో అంతు పట్టదు.

యానాం రాజుగోరు... సాహిత్య దివాణం...

ఈ రాజులతో మా చెడ్డ చిక్కు. వీళ్లు తమ మర్యాదలతో ఎంత చంపేస్తారో... వారి సాహిత్యంతో కూడా అంతే దగ్గరైపోతారు. కేఎన్‌వై పతంజలి అలాగే నాకు గురువుగారయ్యారు. దాట్ల నారాయణ మూర్తి రాజు కూడా అంతే. ఇప్పుడు ఈ "దాట్ల" వంశాంకురం..."సాగి" వారి అల్లుడు అయిన దాట్ల దేవాదానం రాజు కూడా అంతే. అంతకు ముందు వ్యక్తిగతంగా పెద్దగా పరిచయం లేదు ఈ యానాం రాజుగారితో. నేను అమలాపురం వచ్చేశాక... అటు నవలంత దూరం కాదు... ఇటు గల్పికంత దగ్గరా కాని ఓ 15 పేజీల కథంత దూరంలో ఉన్నారు ఈయన. నవలైతే చాలా ఆలస్యమవుతుంది పూర్తి చేయడానికి. గల్పికైతే వెంటనే అయిపోతుంది. కాని ఓ వెలితి వెంటాడుతుంది. అదే కథ అయితే మన చొక్కా జేబులోనో, ప్యాంట్ మడతల్లోనో ఇరుకుని మనతో పాటే నడుస్తుంది. అలాగే ఈ దాట్ల దేవాదానం రాజు గోరు కూడా తన కథలతో

చక్రవాకం
- ముక్కామల చక్రధర్

పాఠకుల శరీరాల్లో భాగం అయిపోయారు. తెలుగు కథా సాహిత్యంలో చాలా ప్రయోగాలు జరిగాయి. శ్రీశ్రీ కుక్కపిల్ల, అగ్గిపుల్ల, సబ్బుబిళ్ల మీద కవిత్వం రాయండర్రా అని సవాల్ విసిరితే... రా.వి.శాస్త్రి గారు ఏకంగా ఆ మూడింటి మీద కథలే రాసేశారు. కేతు విశ్వనాథ రెడ్డి అమ్మవారి నవ్వు అంటూ కథ రాస్తే దాన్ని మా మామ ఖదీర్ బాబు ఏకంగా రీ టోల్డ్ కథగా మార్చేశాడు. గొలుసు కథలంటూ కొందరు రాశారు. ఇలా కథల్లో అనేక ప్రయోగాలు చేశారు. కానీ ఈ యానాం రాజు గోరు "ఏవండి మీ దృష్టిలో గోదారంటే ఏంటి" అని పెద్ద వారిని, "వురేయ్ అబ్బాయి... నువ్వు చెప్పుమీ గోదారంటే ఏంటో" అని పిన్నలని అడిగి వారు చెప్పిన దాన్ని బట్టి కథలల్లేశారు. అంటే మంచి కవి శిఖామణిని అడిగితే మనోడు " దళిత గోదారి" అని చెబితే ఆ పేరుతోనే కథ రాసేశారు రాజుగోరు. మరో పెద్దాయన్ని అడిగితే ఆయన "గోదారి మయాన" అని చెబితే అదే పేరుతో ఓ జంట గోదావరి మధ్యలో ఏం చేశారో కథగా మలిచారు. ఇలాగే ఇంకొందరనుకోండి. ఈ కథలు బాగున్నాయా... అని అడిగితే... నేను చెప్పిన సమాధానం ఏంటంటే... "రాజుగోరు... ఇదిగో మీకే" కథలు బాగోడం... బాగోకపోడం కాదండి బాబూ... అసలు ఈ అవిడియాకే మీ మండువా ముందు నేల మీద కూర్చుని గోదావరి మీ ఇంట్లోకి ఎలా వస్తోందో తెలుసుకోవాలనుందండి. ఆయ్. అవునండి. సత్త ప్రమాణమండి... ఆయ్.

మా గోదావరోళ్లకి ఎటకారం ఎక్కువని హేళన చేసిన వాళ్లే సంకురాతిరికి కోళ్ల పందాలు సూసేందుకు వొత్తారు. ఒక్కోసారి ఈ బస్సులు, రైళ్లు, చివరాఖరికి ఇమానాలు కూడా దొరక్క చాలా మంది రాలేకపోతారు. అలాంటోళ్ల కోసం... ఇతర ప్రాంతాల్లో ఉన్న తెలుగు వారందరి కోసం కోడి పందాల మీద "బరి" అంటూ నవల రాసిన తొట్టతొలి పందెం కోడి ఈ దాట్ల దేవాదానం రాజు గారేనని కోళ్లకి కట్టే కత్తుల మీద వొట్టేసి చెప్పగలను. కోడి పలావు బాగుంటుంది. కోడి కూర బాగుంటుంది. మరి కాకి... నెమలి... ఎలా ఉంటాయి తింటానికి. కంగారు పడకండి. ఆ కాకి, నెమలి కోడి పందాలకు తీసుకువచ్చే కోళ్లలో రకాలు. ఇయన్ని ఎవరు సెబితే తెలియాలి. ఈ దాట్ల రాజుగోరు సెబితే తెలియాలి. అందుకే దాట్ల దేవాదానం రాజుగోరు చెప్పారు. మనకి తెలిసింది. అదన్నమాట సంగతి.

యానాం ఎవరిది. ఫ్రెంచోరిది. "గోవా, డయ్యూ, డామన్, పుదుచ్చేరి ఇవన్నియును కేంద్ర పాలిత ప్రాంతములు" అని ఎనిమిదో తరగతిలో బట్టీ పట్టి ఓ ఐదు మార్కులు కొట్టేశాం. ఇక్కడి వరకూ ఆల్ ఓకే. పుదుచ్చేరి ప్రభుత్వంలోదే ఈ యానాం. ఈ గ్రామం అన్ని వస్తువులు పరమ చీప్‌గా దొరుకు ప్రాంతం. అక్కడుంటారు దాట్ల వారు సాగి వారి ఆడపడుచుతో కలిసి. అంటే ఇదేం సొంతూరు కాదు కాని ఆ రాష్ట్రం వారు ఈయన్ని సొంతమనిషి చేసేసుకుని ఈయన రచనలకి అవేవో బిరుదులు గట్రా ఇచ్చేశారు. కళా పోషణ అన్నాక మనిషుండాలి. ఆ ప్రభుత్వానికి కళా పోషణ ఉంది. కవులు కావాలి. అందుకే ఈ దాట్ల వారిని ఏరి, కోరి పిలిచి మరీ సత్కరించుకున్నారు. ఊరికే ఇచ్చేయలేదు లెండి. మరి వందేళ్ల క్రితం పుదుచ్చేరి ప్రభుత్వం ఎలా ఉందో కథలు కథలుగా రాశారు. చిత్రం ఏంటంటే ఈ కథల్లో పాత్రల పేర్లు ఫ్రెంచోళ్ల పేర్లే. అలాంగుంటది దాట్ల గారి ఫ్రెంచి పెన్ను. మరి ఆంధ్రప్రదేశ్ మనిషి కదా... మనం కూడా ఏదో ఒకటి చేయాలి కదా అనుకున్న ఇప్పటి ప్రభుత్వం కూడా ఇదిగో ఈమధ్యనే "అయ్యా ఫలానీ రాజుగోరు. ఈ ఉగాది నుంచి మీరు కళారత్నండి. అంతే మరింకేం మాట్లాడకండి. ఇదిగో ఈ హంస అట్టుకుపోండి" అంటూ సత్కరించారు.

నాక్కూడా సేపల పులుసు అంటే చాలా ఇష్టం. కానీ తినలేం. ఎందుకూ. బామ్మర్లం కదా. అందుకన్న మాట. కానీ ఓ రాజు గారికి కూడా చేపల పులుసంటే వల్లమాలిన అభిమానం. ఆయన తినొచ్చు. ఎందుకూ... వారు మాంసాహారులు కాబట్టి. కానీ ఈ కథలో రాజుగోరు తినలేదు. మళ్లీ ఇదెందుకు. ఎందుకంటే మాంసాహారం పూర్తిగా వదిలేసి శాఖాహారిగా మారిపోయారు కాబట్టి. ఇక్కడే కథ పుట్టింది. శాఖాహారిగా మారిన రాజు గారు మనిషి మారారు కాని... జివ్హ చాపల్యం పోలేదు. అది పట్టుకున్నారు దాట్ల దేవాదానం రాజుగోరు. కథలో రాజుగారికి శీరమేను చేపల పులుసు తినాలని ఓ ఇది. కాని ఎలా. శాఖాహారిగా మారారుగా. తిన్నారా... తినలేదా... శీరమేను సంపాదించి పులుసెట్టుకుని తింటే ఎలా ఉంటదో ఈ కథను సంపాదించి చదివితే అలాగే ఉంటది. ఎతకండి. దొరుకుతుంది. చదవండి. పులుసు కోసం శీరమేను సంపాయించడానికి మార్కెట్‌కి వెళ్తారు. నాదీ గ్యారంటీ. రా.వి.శాస్త్రి గారన్నట్లు ఈ దాట్ల దేవాదానం రాజు గారు మూడో యవ్వనంలో ఉన్నారు. ఆ యవ్వనం ఆరు యవ్వనాలు కావాలనుకోవడం ఆయన గురించి కాదంటే కాదు. మన గురించే. ఎందుకంటే మరిన్ని మంచి కథలు వస్తాయి కదా అని దురాశ. దురాశ మంచి కథలకు చోటు.

(కళారత్న పురస్కారం వచ్చిన దాట్ల గారికి ఆదివారం నాడు యానాంలో కవిసంధ్య అభినందన సభ నిర్వహిస్తున్న సందర్భంగా ఈ నాలుగు మాటలు)

- సీనియర్ జర్నలిస్టు, 99120 19929

వ్యవసాయంపై ట్రంప్ ప్రతీకార సుంకాల ప్రభావం

సోమ మర్ల

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ భారతదేశంతో సహా వివిధ దేశాల నుంచి దిగుమతయ్యే ఉత్పత్తులపై ఇటీవల పరస్పర సుంకాలను విధించారు. అమెరికా విధించే అధిక సుంకాల ప్రభావం భారత ఆర్థిక వ్యవస్థపై తీవ్రంగా ఉండగలదని న్యూఢిల్లీలోని వాణిజ్య విధానాల పరిశోధనా సంస్థ జీటీఆర్ఐ హెచ్చరించింది. మార్కెట్‌లో పండించిన పంటలకు మద్దతు ధరలు సైతం లభించక కుదేలవుతున్న మన రైతు పరిస్థితి మరింత దిగజారగలదని ఆర్థిక విశ్లేషకులు భావిస్తున్నారు.

గత శతాబ్దపు 90వ దశకం వరకు మన దేశం నూనెగింజలు, పప్పుధాన్యాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధిని కలిగి ఉండే వాళ్లం. కాగా 1995వ సంవత్సరంలో అమలులోకి వచ్చిన డబ్ల్యుటీవో నిబంధనల ప్రకారం మనం పామాయిల్, పొద్దుతిరుగుడు నూనెలపై దిగుమతి సుంకాలను భారీగా తగ్గించి దిగుమతి చేసుకోవటం ప్రారంభించాం. దేశంలో ఈ పంటల సాగు గిట్టుబాటు కాక, రైతులు నువ్వులు, వేరుశెనగ, పప్పుధాన్యాల సాగును మానుకోవటంతో తలెత్తిన కొరతను నివారించటానికి కేవలం వంటనూనెల దిగుమతులపై మన ప్రభుత్వం 16 బిలియన్ డాలర్ల వరకు వెచ్చిస్తున్నది.

గత సంవత్సరం 2024లో మన దేశం అమెరికాకు కార్లు, ఫోన్లు, ఐపాడ్‌లు, రెడీమేడ్ దుస్తులు, కారు విడి భాగాలు, వివిధ ఇంజినీరింగ్ ఉత్పత్తులు, బియ్యం, పత్తి, నెయ్యి వంటివి 89 బిలియన్ల డాలర్ల విలువైన ఎగుమతులు చేసింది. వీటిలో కార్లు, మొబైల్ ఫోన్లు మిగిలిన ఉత్పత్తుల వాటా 70 శాతంగా నుండి, ముఖ్యంగా వ్యవసాయ, లఘు పరిశ్రమల ఉత్పత్తులే ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రతి సంవత్సరం భారత్ 400 మిలియన్ డాలర్ల విలువైన మంచినీటి రొయ్యలు ఎగుమతి చేస్తోంది. కాగా అమెరికా నుంచి మనం 47 బిలియను డాలర్ల విలువైన దిగుమతులు చేసుకుంటున్నాం. ఈ వాణిజ్యంలో అమెరికా 48 బిలియను డాలర్ల లోటును భరిస్తున్నది. ఈ లోటును భర్తీ చేయటానికి అమెరికా 27 శాతం మేరకు పరస్పర సుంకాలను విధించింది. పైగా అమెరికా నుంచి పత్తి, మొక్కజొన్న, గోదుమలు, కార్లు అమ్మకాలకు అక్కడి అగ్రి బిజినెస్, బహుళ జాతి సంస్థలకు 140 కోట్ల జనాభా గల భారత మార్కెట్లకు బార్లా తెరవాలని వాదిస్తున్నది. కాగా అమెరికా నుంచి ధాన్యం, గోదుమలు, పత్తి, వెన్న, పాలు, కోడి మాంసం మన మార్కెట్లను అతి చౌక ధరలకు ముంచెత్తితే మన రైతుల, చిన్న ఉత్పత్తిదారులు, లఘు పరిశ్రమల ఆర్థిక స్థితి మరింత కుదేలయ్యే ప్రమాదం ఉన్నది. పైగా కార్లు, ఐఫోన్లు వంటి వస్తువులను మినహాయిస్తే అమెరికాకు మనం ఎగుమతి చేసే ఉత్పత్తుల్లో 70 శాతం పైగా రెడీమేడ్ దుస్తులు, పాదరక్షలు, బియ్యం, పత్తి వంటి ఉత్పత్తులను చిన్న రైతులు, అధిక సంఖ్యలో కార్మికులను వినియోగించే చిన్న పరిశ్రమల నుంచే ఉన్నాయి. ట్రంప్ మన దేశం ఉత్పత్తులపై 27 శాతం టారిఫ్ విధించటం వలన అమెరికా సూపర్ మార్కెట్లలో మన ఉత్పత్తుల ధరలు ఈ దామాషాలో పెరిగి, అక్కడి వినియోగదార్ల నుంచి గిరాకీ తగ్గగలదు. పైగా మన దేశంలో వివిధ పంటల ఉత్పత్తులు, కోడి తదితర మాంసాలపై "సున్నా నుంచి 2 శాతం" అతి తక్కువ సుంకాలతో అమెరికా వస్తువులు మన మార్కెట్లలో అమెరికా విక్రయించటం వలన కనీస ఉత్పత్తి (సాగు) ఖర్చులు సైతం లభించక రైతులు దివాళా తీసే ప్రమాదం కలదు. ఇప్పటికే మద్దతు ధరలు పంటలకు మార్కెట్‌లో లభించక నష్టపోతున్న రైతుల పరిస్థితి మరింత దీనస్థితికి దిగజారగలదు.

భారతదేశంతో సరిపోల్చుకుంటూ ప్రతీకార సుంకాలను అధిక మోతాదులో అమెరికా విధించటంలో ఏమాత్రం సముచితం కాదు. అమెరికా 29 ట్రిలియన్ డాలర్ల సంపదతో ప్రతి పౌరుడి తలసరి ఆదాయం 85 డాలర్లను కలిగిన సంపన్నమైన దేశం. ఆ దేశంలో కేవలం 1.2 శాతం (12 లక్షల మంది) మాత్రమే రైతులు వ్యవసాయం చేస్తారు. రైతుల సాగు ఖర్చులపై అక్కడి ప్రభుత్వం 110 శాతం వరకు పంట సబ్సిడీలనిస్తుంది. ఉదాహరణకు 25 క్వింటాలు ధాన్యానికి, గోదుమలకు సాగు ఖర్చు దాదాపు 170 డాలర్లు. పత్తికి అక్కడ సాగు ఖర్చు ఎకరానికి (క్వింటాలుకు) 80 డాలర్లు . దానిపై 110 శాతం సబ్సిడీని ప్రభుత్వం ప్రకటించటం వలన వారి సాగు ఖర్చు చాలా తక్కువ. అదే సమయంలో ప్రతి క్వింటాలు పత్తి సాగుకు (అధిక వ్యయ భరితమైన ఎరువులు, పురుగు మందుల పెట్టుబడి కలుపుకొని) 10 వేల వరకు ఖర్చు అవుతున్నది. ప్రభుత్వం క్వింటాలు పత్తిపై కేవలం మద్దతు ధర రూ.7,500 మాత్రమే ఇస్తున్నది. కాగా భారత మార్కెట్‌లో ప్రవేశించి కేవలం రూ.6 వేలకే (మన దేశ మద్దతు ధర కన్నా ఎక్కువగా) విక్రయిస్తే మన పత్తి రైతు మనగలుగుతాడా. అదే విధంగా ధాన్యం సైతం మన ఉత్పత్తి ఖర్చు (32 వేల కన్నా తక్కువగా), మద్దతు ధర 22 వేల కన్నా తక్కువగా అతి చౌకగా అమెరికా ప్రవేశించి విక్రయిస్తే మన రైతు దివాళా తీయక తప్పదు.

ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటీవో) షరతుల ప్రకారం మన రైతులకు ప్రభుత్వం పంట సాగు ఖర్చుల్లో 8 శాతం (ఎరువులు, విద్యుత్ తదితరాలు) మించి సబ్సిడీలను ఇస్తుండగా, గ్రీన్ బాక్స్ నిబంధనలను ఉల్లంఘించి (డబ్ల్యుటీవో) అమెరికా, జపాన్ తదితర దేశాలు 110 శాతం వరకు సాగు ఖర్చులను తమ రైతుల కిస్తున్నాయి. ట్రంప్ అధిక సుంకాల వలన మన రైతులు దేశీయ మార్కెట్‌లో చౌకగా అమ్ముడయ్యే ధాన్యం, వెన్న, కోడి మాంసం పత్తితో పోటీ పడలేక దివాళా తీసే పరిస్థితి కలదు. మరొక పక్క 27 శాతం సుంకాలతో అమెరికా మార్కెట్‌లో మన బియ్యం, మామిడి పండ్ల ధర 36 శాతం పెరిగి మరింత ప్రియమవుతుంది. దీనితో అమెరికాకు మన ఎగుమతులు తగ్గి, మన దేశీయ మార్కెట్లో పంటల ధరలు మరింత క్షీణిస్తాయి.

గత శతాబ్దపు 90వ దశకం వరకు మన దేశం నూనెగింజలు, పప్పుధాన్యాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధిని కలిగి ఉండే వాళ్లం. కాగా 1995వ సంవత్సరంలో అమలులోకి వచ్చిన డబ్ల్యుటీవో నిబంధనల ప్రకారం మనం పామాయిల్, పొద్దుతిరుగుడు నూనెలపై దిగుమతి సుంకాలను భారీగా తగ్గించి దిగుమతి చేసుకోవటం ప్రారంభించాం. దేశంలో ఈ పంటల సాగు గిట్టుబాటు కాక, రైతులు నువ్వులు, వేరుశెనగ, పప్పుధాన్యాల సాగును మానుకోవటంతో తలెత్తిన కొరతను నివారించటానికి కేవలం వంటనూనెల దిగుమతులపై మన ప్రభుత్వం 16 బిలియన్ డాలర్ల వరకు వెచ్చిస్తున్నది. ఈ పంటలను సాగు చేసే చిన్న రైతుల పరిస్థితి మరింత కుదేలయింది. ప్రముఖ ధాన్యం వ్యాపార సంస్థలైన కార్గిల్ వంటి బహుళ జాతి సంస్థలు అతి చౌకగా దేశీయ మార్కెట్‌లో బియ్యం, గోదుమలు విక్రయిస్తే వీటి సాగుపై ఆధారపడే చిన్న రైతులు, దేశ ఆహార భద్రత, ప్రభుత్వ పంపిణీ వ్యవస్థ తీవ్ర సంక్షోభానికి గురయ్యే ప్రమాదం కలదు.

గత నెల మన ప్రధాని మోదీ అమెరికా పర్యటనలో అధ్యక్షుడు ట్రంప్‌ని కలిశారు. ఇప్పటికీ ఆ చర్చల వివరాలను ప్రకటించలేదు. అధ్యక్షుడు ట్రంప్ ప్రతీకార సుంకాలు విధించి వారం రోజులు పైబడినా మన దేశ వాణిజ్య మంత్రి కానీ, ఆర్థిక మంత్రి కానీ సుంకాల ప్రభావంతో తల్లడిల్లుతున్న రైతులు, చిన్న పరిశ్రమలు, కుప్ప కూలుతున్న స్టాక్ మార్కెట్ మదుపర్లను ఉద్దేశించి ఏ ప్రకటనలు చేయకపోవటం ఆశ్చర్యం కలిగిస్తున్నది. బహుశా మోదీకి అత్యంత సన్నిహితుడైన గౌతమ్ అదానీని అమెరికాలో కోర్టు ప్రక్రియల నుంచి, అరెస్టుల నుంచి రక్షించటానికేనా అని అనేకులు భావిస్తున్నారు. ఒక సంపన్నుడైన గుత్త పెట్టుబడిదారుడిని రక్షించటానికి దేశ ప్రజల ప్రయోజనాలను బలి పెట్టటం ఏమాత్రం సమర్థనీయం కాదు. మౌనాన్ని వీడి ప్రధాని వెంటనే దేశ ప్రజల నుద్దేశించి ప్రసంగించాలి. వారికి నష్టాల నుంచి కోలుకోవటానికి చర్యలు సూచించాలి.

మన ప్రభుత్వం వెంటనే నిశ్శబ్దాన్ని వీడి సుంకాల తగ్గింపునకై ఉమ్మడి పోరుకు బ్రిక్స్, ఐరోపా యూనియన్, థాయలాండ్, మలేషియా తదితర ఆసియా దేశాలతో చర్చించాలి. ఈ దేశాలతో భారత ఎగుమతులు పెంపునకై ఉభయ తారకమైన ఒప్పందాలకై ప్రయత్నించాలి. అమెరికా సామ్రాజ్యవాదం గత ప్రపంచీకరణ, ప్రపంచ బ్యాంకు, ఐఎమ్ఎఫ్‌ల ద్వారా సాగిన నయా ఉదారవాద ఆర్థిక విధానాలను వదిలి అత్యంత క్రూరమైన ప్రతీకార సుంకాలు, ఆర్థిక ఆంక్షలతో అధిక లాభార్జనకు వెంపర్లాడుతున్నది. మన ప్రభుత్వం అమెరికా తమకు ప్రియ మిత్రుడు, ట్రంప్ ఎన్నిక ముందు జరిపిన పూజలు, వ్రతాలకు స్వస్తి చెప్పి దేశ సార్వభౌమత్వానికి, ప్రజల అవసరాలకు ప్రాధాన్యత నివ్వాలి. ఇప్పటి వరకు ఏ మాత్రం ప్రయోజనకరం కానీ ఎగుమతుల ఆధార ఆర్థిక వ్యవస్థ స్థానంలో 140 కోట్ల దేశీ మార్కెట్‌లో గిరాకీ పెంచటానికి తగు స్వావలంబన ఆర్థిక విధానాలు ప్రభుత్వం చేపట్టాలి.

- విశ్రాంత శాస్త్రవేత్త

'కొత్తపట్నం' నిషేధంపై నిరసనలు

ఆర్వీ రామారావ్

కొత్తపట్నం రాజకీయ పాఠశాలపై ఉమ్మడి మద్రాసు రాష్ట్ర ప్రభుత్వ దమనకాండపై తీవ్ర నిరసన వ్యక్తం అయింది. ప్రభుత్వం విధించిన నిషేధాజ్ఞలను ఉల్లంఘించినందుకు వంద మందిని పైగా ప్రభుత్వం అరెస్టు చేసింది. ఈ రాజకీయ పాఠశాలలో మిలిటరీ శిక్షణ ఇస్తున్నారని, బాంబులు తయారు చేయడం నేర్పుతున్నారని ప్రభుత్వం దాష్టీకానికి దిగింది. పిడతల రంగారెడ్డి, చేగిరెడ్డి బాల్‌రెడ్డి, సుందరయ్య అక్క గోవిందమ్మ, ఆమె భర్త శేషయ్య, బసవా రెడ్డి శంకరయ్య, కంభంపాటి సత్యనారాయణ, దొడ్డవరపు కామేశ్వర శాస్త్రి, కోడి నరసింహులు, శాయన్న మొదలైన వారిని అరెస్టు చేశారు. కొండా వెంకటప్పయ్య, ప్రకాశం పంతులు మొదలైన ప్రముఖులు ప్రభుత్వ దాడిని ఖండించారు. కేసులు ఎత్తివేయాలని కోరారు.

కొత్త పట్నం రాజకీయ పాఠశాలపై జరిగిన దాడిని పత్రికలు తీవ్రంగా ఖండించాయి. 1937 జూన్ "ఆంధ్రభూమి"మాసపత్రిక "కొత్త పట్నమున లాఠీ చార్జీ, ప్రభుత్వం వారి పచ్చి అబద్ధము" అనే శీర్షికతో తీవ్రంగా విమర్శిస్తూ ఇలా రాసింది...'కొత్త పట్నమున నెలకొల్పిన ఆర్థిక, రాజకీయ పాఠశాలను నిషేధించిన పోలీసువారు కావించిన లాఠీచార్జీ చాలా అక్రమమైంది. అరెస్టు కోరి నిలిచియున్న వారిపై బలప్రయోగము గావించుట, పశుబల ప్రదర్శనము గాని అన్యము కాదు. తిరగబడిన వారిని అరెస్టు చేసినామని ప్రభుత్వం వారు పలుకుట పచ్చి అబద్ధమనక తీరదు. నడమంత్రపు మంత్రులకు ప్రజాహిత కాంక్షయే గాక సత్యప్రియత్వము కూడా లేదని ఇందుమూలముగా స్పష్టమైంది. ప్రజలకు బాధ్యులు కాని ఈ మంత్రులు ప్రజలపై బాధ్యత ఎరుగక ఇట్టి చర్యలు జరుపుట వింతకాదు. ఈ పత్రిక సంపాదకులు ఆంధ్ర శేషగిరి రావు. ఈ పత్రికకు, 1960లో

హైదరాబాద్ నుంచి వెలువడి, ఇప్పుడు మూతపడిన "ఆంధ్ర భూమి"దిన పత్రికకు ఏ సంబంధమూ లేదు. జమీన్ రైతు పత్రిక కూడా ఈ లాఠీ చార్జీని గట్టిగానే ఖండించింది.

మే 22వ తేదీనాటికి అనేకమంది కాంగ్రెస్ నాయకులు ఒంగోలు వచ్చారు. వేముల కూర్మయ్య, అయ్యదేవర కాళేశ్వర రావు, బులుసు సాంబమూర్తి, కల్లూరి చంద్రమౌళి, షేక్ గౌస్ బేగ్, వనమంద్ర వెంకటప్పయ్య లాంటి వారు ఒంగోలు వచ్చిన వారిలో ఉన్నారు. ప్రకాశం పంతులు అధ్యక్షతన రాష్ట్ర కాంగ్రెస్ కార్యవర్గ సమావేశం జరిగింది. నిషేధాన్ని, అరెస్టులను, లాఠీ చార్జీని ఖండించింది. కాంగ్రెస్ ఆఫీసు వద్ద మే 22వ తేదీన పెద్ద బహిరంగ సభ జరిగింది. అంతకు ముందు సాయంత్రం మూడు గంటల నుంచి పెద్ద ఊరేగింపు జరిగింది. వందలాది యువకులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పతాకాలు, ఎర్ర జెండాలతో ఊరేగింపు సాగింది. ప్రకాశం, కాళేశ్వరరావు, మాగంటి బాపినీడు, గొట్టిపాటి బ్రహ్మయ్య నిషేధాన్ని, లాఠీచార్జీని నిరసిస్తూ మాట్లాడారు. ఎన్‌జీ రంగా నెహ్రూకు రాసిన లేఖను బట్టి కాంగ్రెస్ అధిష్ఠానవర్గంలో నిషేధాజ్ఞలు ఉల్లంఘించిన ఘటనపై తర్జన భర్జనలు జరిగినట్లు తెలుస్తోంది. రంగా రాసిన లేఖకు నెహ్రూ పంపిన సమాధానంలో కొత్త పట్నం లాఠీచార్జీని ఖండించారు. "నేనిది వరకు కొత్తపట్నం స్కూలు సంఘటన గురించి రాశాను, దానిపై పబ్లిక్ ప్రకటన కూడా చేశాను. ఇది అత్యంత నీచకృత్యం. అన్నింటికన్నా ప్రభుత్వం యొక్క నీచ స్వభావాన్ని ఇదే ఎక్కువ బయట పెట్టింది" అని నెహ్రూ రాశారు.

"ఈ ఘటన తరవాత రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులుగా ఉన్న ప్రకాశం పంతులుగారు సబ్ జైలులో ఉన్న కమ్యూనిస్టులను కలుసుకుని కళ్లనీళ్లు పెట్టుకున్నారంటే ఆ నాటికి కమ్యూనిస్టు పార్టీ సంపాదించుకున్న స్థానాన్ని అర్థం చేసుకోవచ్చు" అని 1965 డిసెంబర్ 29 నాటి "జనశక్తి" పత్రికలో ప్రచురితమైన వ్యాసంలో పేర్కొన్నారు. కొత్తపట్నంలో లాఠీ చార్జీ జరగకముందు రాత్రే వాసిరెడ్డి శివలింగ ప్రసాద్‌ను రాజద్రోహం నేరం కింద అరెస్టు చేసి ఒంగోలు పోలీసు లాకప్‌లో ఉంచారు. మరునాడు లాఠీచార్జీకి గురైన సబ్ జైలులో ఉన్న వారితో సంబంధం లేకుండా విడిగా ఉంచారు. తరవాత మిగతా వారిని తెనాలి, రేపల్లె సబ్ జైళ్లకు మార్చారు. శివలింగ ప్రసాద్, అన్నాప్రగడ కామేశ్వరరావుపై ఒంగోలు సబ్ కలెక్టర్ వద్ద, మిగతా వారిపై తెనాలి కోర్టులో విచారణ ప్రారంభమైంది. శివలింగ ప్రసాద్‌ను జామీనుపై విడుదల చేశారు. ఆ తరవాత ఒంగోలులో ఈయనకు ఒక సంవత్సరం శిక్ష పడింది. గుంటూరు సెషన్స్ కోర్టులో విచారణకు వచ్చే సరికి కాంగ్రెస్ మంత్రివర్గం ఏర్పడి ఈయనను, ఇతర కొత్తపట్నం ఖైదీలను విడుదల చేసింది.

కొత్తపట్నం లాఠీచార్జీ అనంతరం అరెస్టయిన వారిలో 36 మందిని 1937 జూన్ ఎనిమిదిన విడుదల చేశారు. 16 మందిపై కేసులు మోపారు. వీరిలో కంభంపాటి సత్యనారాయణ, అల్లూరి సత్య నారాయణకు ఆరు నెలల కఠిన శిక్ష, 200 రూపాయల జరిమానా విధించారు. మిగతా వారికి ఆరు నెలల శిక్ష, వంద రూపాయల జరిమానా విధించారు. తరవాత వారికి కోర్టు రెండు నెలల శిక్ష తగ్గించింది. కొత్తపట్నం రాజకీయ పాఠశాల నిర్వహణలోనూ, ఆ తరవాత ఆంక్షలకు గురైన వారిలోనూ కాంగ్రెస్ వారు కూడా ఉన్నారు. కానీ కొత్తపట్నం రాజకీయ ఖైదీలను విడుదల చేస్తూ కాంగ్రెస్ మంత్రివర్గం హెచ్చరిక జారీ చేసింది. "ఏ ఆశయం కోసమైనా సంఘటిత లేక అసంఘటిత హింసను ఉపయోగించే అభిప్రాయాలను, వర్గ ద్వేషాన్ని పురిగొల్పి వ్యాప్తినొందించడాన్ని అరికట్టడానికి అవసరమైన అన్ని చర్యలు ప్రభుత్వం తీసుకుంటుంది, అలాంటి చర్యలను సహించబోదు" అని పేర్కొన్నది. కొత్త పట్నం ఖైదీలను విడుదల చేసినా రాజాజీ మంత్రివర్గం నిఘా తొలగించలేదు. సుభాశ్‌చంద్ర బోస్ కూడా కొత్తపట్నం రాజకీయ పాఠశాలపై నిషేధాన్ని ఖండించారు.

తల్లీకూతుళ్లపై అమానుష దాడి

సూరత్: మానవత్వానికే మచ్చ తెచ్చే హృదయవిదారక ఘటన గుజరాత్‌లోని సూరత్‌లో గల ఏపీఎమ్‌సీ మార్కెట్‌లో ఇటీవల చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. స్థానిక మీడియా కథనాల ప్రకారం తల్లీకూతుళ్లు కూరగాయల చోరీకి పాల్పడ్డారు. విషయం బయటపడటంతో వారిపై ఓ సెక్యూరిటీ గార్డు మరో ఇద్దరు పురుషులు దాడికి తెగబడ్డారు. ఆ సెక్యూరిటీ గార్డు ఓ చేతిలో కర్ర పట్టుకుని, మరో చేత్తో మహిళ జుట్టు పట్టుకుని నేలపై ఈడ్చి పారేశాడు. మరో ఇద్దరు ఆమె కూతురిని నేలపైకి తోసి, పొట్టలో తన్నారు. బహిరంగంగా ఇంత దారుణం జరుగుతున్నా అక్కడున్న వారెవరూ కల్పించుకోలేదు. బాధితులను ఆదుకునేందుకు ముందుకు రాలేదు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ కావడంతో విమర్శలు వెల్లువెత్తాయి. ఈ దారుణంపై సూరత్ పోలీసులు స్పందించారు. మహిళలపై దాడికి దిగిన వ్యక్తులను అరెస్టు చేసినట్టు తెలిపారు. వీడియోపై నెట్టింట ఆగ్రహం పెల్లుబుకుతోంది. బలహీనులపై ఈ స్థాయిలో దాడి చేయడం క్షమార్హం కాదని అనేకమంది ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలపై చేయి చేసుకున్న వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మహిళలను కొడుతున్నా చుట్టూ ఉన్న వారు చూస్తూ మిన్నకుండిపోవడంపై విచారం వ్యక్తం చేశారు. మానవత్వం, పౌర స్పృహ జనాల్లో లోపిస్తున్నాయని ఆగ్రహం వెలిబుచ్చారు. ఈ తీరు సమాజానికి మంచిది కాదని, ఈ నిర్లిప్తతతో అమాయకులు బలయ్యే అవకాశం ఉందని అన్నారు.

టెక్నాలజీ, టారిఫ్‌లదే హవా

కేంద్రమంత్రి జైశంకర్

న్యూదిల్లీ: ప్రపంచ భౌగోళిక రాజకీయాల్లో రెండు 'టీ'లు కీలక భూమిక పోషిస్తున్నాయని విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ అన్నారు. టెక్నాలజీ, టారిఫ్‌లను ఉద్దేశించి ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం దిల్లీలో జరిగిన కార్నెగీ గ్లోబల్ టెక్ సమ్మిట్‌లో ఆయన మాట్లాడారు. 'కొద్దికాలంగా మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో ఈరోజు ఇక్కడ 'టీ' పదం గురించి చర్చించడానికి మనం సమావేశమయ్యాం. రెండు 'టీ'లకు మధ్య ఉన్న సంబంధాన్ని మీరు ఆలోచించాలని నేను కోరుకుంటున్నాను. ఈ భౌగోళిక, సాంకేతిక నేపథ్యంలో మనం ప్రపంచాన్ని ఎలా చూడాలి? నేనైతే దీనినొక అవకాశంగా చూస్తాను. ఈ మార్పు, టీ అక్షరం గురించి మాట్లాడేటప్పుడు అమెరికా నుంచే ప్రారంభిస్తాం. ప్రపంచంతో అనుసంధానమయ్యే విధానాన్ని అమెరికా ప్రాథమికంగా మార్చేసింది. దాంతో ప్రపంచంపై దాని పరిణామాలు ఉంటాయి. ముఖ్యంగా టెక్నాలజీ రంగంలో అవి మరింత తీవ్రంగా ఉంటాయి. అమెరికా అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉండటం ఒకటే అందుకు కారణం కాదు. దాంతోపాటు ఆ దేశ సాంకేతిక పురోగతి అత్యంత కీలకం. అమెరికాను మళ్లీ గొప్పగా మార్చడంలో టెక్నాలజీ కీలక పాత్ర పోషిస్తుంది అన్నది స్పష్టం. అందుకే మేక్ అమెరికా గ్రేట్ అగైన్‌కు, టెక్‌కు మధ్య సంబంధం ఉంది. 2016 నుంచి 2020 (అప్పుడు ట్రంప్ మొదటిసారి అధికారంలో ఉన్నారు) మధ్య అది ఇంత స్పష్టంగా కనిపించలేదు' అని మంత్రి మాట్లాడారు. చైనా స్థిరమైన ఎదుగుదలను ఆయన ప్రస్తావించారు. ఐరోపాలో నెలకొన్న ఆర్థిక అనిశ్చిత పరిస్థితులను వివరించారు.

ఉద్యోగం వద్దు... నగదు ఇవ్వండి: ఫొగట్

చండీగఢ్: ప్రముఖ భారత రెజ్లర్, కాంగ్రెస్ ఎమ్మెల్యే వినేశ్ ఫొగట్‌కి హర్యానా ప్రభుత్వం రెండు ప్రతిపాదనలు చేసింది. పారిస్ ఒలింపిక్స్‌లో ఆమె ప్రదర్శనకు గౌరవ సూచికగా గ్రూప్-ఎ ప్రభుత్వ ఉద్యోగం కానీ, నగదు బహుమతి కానీ, నివాస స్థలం వంటివి ఇస్తామని తెలిపింది. అయితే వినేశ్ ఫొగట్ ప్రభుత్వ ఉద్యోగం వద్దని, నాలుగు కోట్ల రూపాయల నగదు బహుమతి కావాలని తెలిపారు. ఈ రివార్డులను హర్యానా షెహ్రీ వికాస్ ప్రాధికార్ కింద వినేశ్‌కి అందించనున్నారు. హర్యానా క్రీడా విధానం ప్రకారం టాప్ అథ్లెట్లకు డిప్యూటీ డైరెక్టర్ స్థాయి పదవి ఇవ్వనుంది. కాగా, రాష్ట్ర క్రీడా విధానం ప్రకారం ఒలింపిక్ రజత పతక విజేతకు సమానమైన 30 ఏళ్ల ప్రయోజనాలను వినేశ్ ఫొగట్‌కి అందించాలని హర్యానా మంత్రివర్గం నిర్ణయించినట్లు ముఖ్యమంత్రి నయాబ్‌సింగ్ సైనీ మార్చిలో జరిగిన బడ్జెట్ సమావేశాల్లో ప్రకటించారు. సీఎం ప్రకటనతో వినేశ్ ఫొగట్ నగదు బహుమతి అందుకోవాలన్న తన నిర్ణయాన్ని క్రీడా విభాగానికి రాసిన లేఖలో పేర్కొన్నారు. వినేశ్ ఫొగట్ పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొన్నారు. కానీ కేవలం గంట ముందు ఆమెపై అనర్హత వేటు పడింది. దీంతో ఆమె రెజ్లింగ్‌కి గుడ్‌బై చెప్పి రాజకీయాల్లోకి ప్రవేశించారు. 2024 హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో ఆమె జులానా నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచారు.

ఎన్‌కౌంటర్‌లో ఉగ్రవాది హతం

శ్రీనగర్ : చీనాబ్‌లోయలోని కిష్త్వార్ జిల్లాలో గుర్తుతెలియని ఉగ్రవాది మరణించినట్లు అధికారులు శుక్రవారం ప్రకటించారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్ మూడవ రోజుకి చేరుకున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు ఒక ఉగ్రవాది మరణించారని, ప్రతికూల భూభాగం, వాతావరణం ఉన్నప్పటికీ భద్రతాదళాలు ఆపరేషన్ చేపడుతున్నారని లోయ ఇంచార్జ్, ఆర్మీ వైట్ కార్ప్స్ ప్రతినిధి తెలిపారు. ఏప్రిల్ 9న కిష్త్వార్‌లోని ఛత్రు ఎగువ ప్రాంతంలో ఉగ్రవాదులు ఉన్నారనే సమాచారంతో పోలీసులతో కలిసి సంయుక్తంగా గాలిస్తుండగా, కాల్పులు ప్రారంభమయ్యాయని అన్నారు. జమ్మూలోని ఉధంపూర్‌లో మరో ఎన్‌కౌంటర్ జరిగిందని సీనియర్ అధికారి తెలిపారు. ఈ ఏడాది జమ్మూలో ఉగ్రవాద కార్యకలాపాలు పెరిగాయని అన్నారు. మార్చిలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో నలుగురు పోలీసులు, ఇద్దరు ఉగ్రవాదులు మరణించారని అన్నారు.

పాఠశాల నుంచి మిత్రులు రాణా, హెడ్లీ

వీరే ముంబై పేలుళ్ల సూత్రధారులు

న్యూదిల్లీ: ముంబై దాడుల వెనక ఉగ్రవాదులుగా మారిన ఇద్దరు పాఠశాల మిత్రులు సూత్రధారులుగా పనిచేశారు. 166 మంది ప్రాణాలు తీశారు. అమెరికా చట్టాల్లోని లొసుగులు వాడుకొని భారత్‌కు దొరక్కుండా తప్పించుకోవడానికి విశ్వప్రయత్నం చేశారు. చివరికి ఒకరిని జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) భారత్‌కు తీసుకొచ్చింది. మరొకరు అమెరికా జైల్లో ఉన్నాడు. వారిద్దరే తహవ్వుర్ రాణా, డేవిడ్ కోల్‌మన్ హెడ్లీ. వీరిద్దరి వయస్సు 64 ఏళ్లు. వీరిద్దరూ పాక్‌లోని హసన్‌అబ్దల్‌లోని సైనిక అకాడమీ క్యాడెట్ కాలేజీ (సీసీహెచ్)లో చదువుకున్నప్పటి నుంచి మిత్రులు. పాకిస్థానీ దౌత్యవేత్త, బ్రాడ్‌కాస్టర్ దావూద్ సయ్యద్ గిలానీ, ఓ అమెరికా జాతీయురాలికి డేవిడ్ హెడ్లీ జన్మించాడు. ఆ తర్వాత గిలానీ కుటుంబం పాక్‌కు వలస వెళ్లింది. అక్కడే హెడ్లీ సీసీహెచ్‌లో చేరాడు. తహవ్వుర్ రాణా 1961లో ఓ హైస్కూల్ ప్రిన్సిపల్ కుటుంబంలో జన్మించాడు. ఇతడూ సీసీహెచ్‌లోనే చేరాడు. అక్కడే తొలిసారి హెడ్లీ-రాణా మిత్రులుగా మారారు. ఆ తర్వాత కాలంలో తల్లితో కలిసి హెడ్లీ అమెరికాలోని ఫిలడెల్ఫియా వెళ్లాడు. అక్కడ అతడు మాదక ద్రవ్యాల వ్యాపారం, కీలక సమాచారాన్ని ఏజెన్సీలకు విక్రయించడం వంటివి చేశాడు. పాక్‌లో లష్కరే, సైన్యానికి, ఇటు అమెరికాలోని సీఐఏకు ఇన్ఫార్మర్‌గా పనిచేశాడు. మరోవైపు రాణా పాక్ ఆర్మీ మెడికల్ కోర్‌లో కెప్టెన్ హోదాలో పని చేశాడు. 1997లో ఆర్మీని వదిలి... భార్యతో కలిసి కెనడాకు వలసవెళ్లి 2001 నాటికి పౌరసత్వం సంపాదించాడు. టొరంటోలో 'ఫస్ట్ వరల్డ్ ఇమిగ్రేషన్ సర్వీస్' పేరిట ఓ సంస్థ స్థాపించాడు. ఆ తర్వాత దాని కార్యాలయాలను చికాగో, న్యూయార్క్‌ల్లోనూ తెరిచాడు. ఈ కంపెనీ ముసుగులోనే రాణా ముంబై దాడులకు కుట్రను అమలుచేశాడు. 2006 నుంచి ముంబై దాడులకు ధ్వంస రచన మొదలైంది. అదే ఏడాది హెడ్లీ తొలిసారి ముంబైని సందర్శించాడు. అప్పుడు మెస్సర్స్ ఇమిగ్రేషన్ లా సెంటర్ పేరిట ఓ కార్యాలయం ఏర్పాటు కోసం ఆర్‌బీఐకి పత్రాలు సమర్పించాడు. వీటిపై రేమాండ్ జోసఫ్ శాండర్స్ అనే వ్యక్తి సంతకాలున్నాయి. ఇది రాణాకు చెందిన ఫస్ట్ వరల్డ్ ఇమిగ్రేషన్‌కు అనుబంధంగా పనిచేసింది. ఇందుకోసం టార్డియో ఏసీ మార్కెట్‌లో ఆఫీస్ స్పేస్ తీసుకొన్నాడు. భారత్ వచ్చినప్పుడు దానిని స్థావరంగా వాడుకొన్నాడు. మొత్తం ముంబైలో ఎనిమిది సార్లు పర్యటించి రెక్కీలు నిర్వహించాడు. 26/11 దాడులకు రెండు వారాల ముందు రాణా స్వయంగా భారత్‌కు వచ్చాడు. అతడు ఫైవ్‌స్టార్ హోటల్ పొవాయ్‌లో దాదాపు 10 రోజులు తిష్ఠ వేసి కుట్రలు పన్నాడు. కాగా, డేవిడ్ హెడ్లీకి అవసరమైన వీసాను రాణానే ఇప్పించినట్లు జాతీయ దర్యాప్తు సంస్థ వెల్లడించింది. ఇందుకోసం అతడి పేరు, తండ్రి వివరాలను తప్పుగా చూపించారు. ముంబయిలో రెక్కీల సందర్భంగా హెడ్లీ నిరంతరం రాణాతో టచ్‌లో ఉన్నాడు. అతడు చేసిన సాయానికి ప్రతిగా... పాక్ ఐఎస్ఐ అధికారులతో మాట్లాడి ఓ ఒప్పందం కుదిర్చాడు.

హెడ్లీ అరెస్టుతో వీడిన బంధం

ముంబై దాడుల తర్వాత కూడా హెడ్లీ-రాణా టచ్‌లో ఉన్నారు. విజయవంతంగా ముంబైలో మారణహోమం సృష్టించినందుకు ఉగ్రవాది లష్కరే సాజిద్‌ను రాణా అభినందించాడు. ఈ దాడిలో మరణించిన ఉగ్రవాదులకు పాక్ అత్యున్నత పురస్కారం నిషాన్ ఈ హైదర్ ఇవ్వాలని హెడ్లీ వద్ద రాణా వ్యాఖ్యానించాడు. 2009 అక్టోబర్ 3న చికాగో అంతర్జాతీయ విమానాశ్రయంలో హెడ్లీని ఎఫ్‌బీఐ అరెస్టు చేయడంతో ఇద్దరి స్నేహం ముగిసింది. అతడు సీఐఏకు పని చేస్తున్నా... తరచూ పాక్‌కు వెళ్లి రావడంపై అమెరికా నిఘా సంస్థ కన్నేసింది. డెన్మార్క్‌లోని కోపన్‌హెగన్‌లో ఉగ్రదాడికి కుట్ర పన్నుతున్నట్లు అతడిపై అనుమానాలు ఉన్నాయి. అప్పటికే హెడ్లీని తమకు అప్పగించాలని భారత్ అమెరికాను కోరుతోంది. ఆ తర్వాత కొన్ని నెలలకే రాణాను డెన్మార్క్ కుట్ర కేసులో అరెస్టు చేశారు. ఈ నేరం నిరూపితమైనా... భారత్‌లో 26/11 దాడుల కుట్ర అభియోగాలు మాత్రం వీగిపోయాయి. ఈ విచారణ సందర్భంగా తనను హెడ్లీ ఇందులోకి లాగాడని రాణా చెప్పాడు. డెన్మార్క్ కుట్ర కేసులో రాణాకు వ్యతిరేకంగా హెడ్లీ సాక్ష్యం చెప్పడంతో ఈ కేసులో అతడికి 14 ఏళ్ల జైలు శిక్ష పడింది. అతడు 2020 కోవిడ్ సమయంలో విడుదలయ్యాడు. ఆ మర్నాడే అతడిని అరెస్టు చేయడానికి నేరగాళ్ల అప్పగింత ఒప్పందం మేరకు అమెరికా వారెంటు కోరింది. దాదాపు ఐదేళ్ల వివిధ దశల్లో జరిపిన న్యాయపోరాటం తర్వాత అతడు విచారణను ఎదుర్కోవడానికి భారత్‌కు తీసుకొచ్చారు.

మోదీ ఈఎల్ఐ పథకం మరో మోసం

రాహుల్‌గాంధీ విమర్శ

న్యూదిల్లీ: ఉపాధి ఆధారిత ప్రోత్సాహక పథకం (ఈఎల్ఐ) మోదీ ప్రభుత్వ మరో మోసపూరిత ప్రకటన అని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ శుక్రవారం విమర్శించారు. ప్రధాని రోజుకో కొత్త నినాదం సృష్టిస్తున్నారని, వాటిలో ఇది ఒకటని అన్నారు. యువత నిజమైన ఉపాధి అవకాశాల కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. 2024 ఎన్నికల తర్వాత ప్రధాని మోదీ ఉపాధి ఆధారిత ప్రోత్సాహక పథకాన్ని ఎంతో ఆర్భాటంగా ప్రకటించారని, యువతకు ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారని అన్నారు. ఈ పథకాన్ని ప్రకటించి ఏడాది కావస్తోందని, కానీ అమలు చేయలేదని అన్నారు. ఆ పథకం కోసం కేటాయించిన రూ.10 వేల కోట్ల నిధులను వెనక్కు తీసుకున్నారని, ఈ చర్య నిరుద్యోగంపై మోదీ వైఖరిని తెలియజేస్తోందని దుయ్యబట్టారు. పెద్ద కార్పొరేట్‌లపై మాత్రమే దృష్టిసారించడం, నిష్పాక్షిక, న్యాయమైన వ్యాపారాల కన్నా తన స్నేహితులను ప్రోత్సహించడం, స్వదేశీ నైపుణ్యాలను విస్మరించడంతో ఉద్యోగాలను సృష్టించలేమని అన్నారు. సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలలో పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టడం, పోటీ పడగల నిష్పాక్షిక మార్కెట్లు, స్థానిక ఉత్పత్తి, నెట్‌వర్క్‌లకు మద్దతివ్వడం, సరైన నైపుణ్యంతోనే కోట్లాది ఉద్యోగాలు సృష్టించగలమని అన్నారు. మోదీ ఈ ఆలోచనలతో ఏకీభవించరని అన్నారు. 'ప్రధాని గారు... మీరు గొప్పగా ఈఎల్ఐ పథకాన్ని ప్రకటించారు. కానీ రూ.10 వేల కోట్ల పథకం ఎందుకు అదృశ్యమైంది. మీరు మీ వాగ్దానాలను పక్కనపెట్టినట్లు, నిరుద్యోగ యువతను కూడా విడిచిపెట్టారా. ఉద్యోగాలు సృష్టించడానికి మీ ప్రణాళిక ఏమిటి లేదా ఇది కూడా మరో మోసపూరిత ప్రకటనేనా' అని మోదీని నిలదీశారు.

నాటి ఉగ్రదాడి నుంచి త్రుటిలో తప్పించుకున్నా: అసోం సీఎం

న్యూదిల్లీ: ముంబై ఉగ్రదాడి ప్రధాన కుట్రదారుల్లో ఒకడైన తహవ్వుర్ హుస్సేన్ రాణాను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) దిల్లీకి తీసుకొచ్చిన వేళ నాటి భయానక ఘటనను అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ గుర్తుచేసుకున్నారు. ఉగ్రదాడులు జరిగిన రోజు తాను ముంబై తాజ్ హోటల్లో బస చేయాల్సి ఉండగా... షెడ్యూల్ మారడంతో మరో హోటల్లో దిగానని తెలిపారు. దాంతో ఆ దాడుల నుంచి త్రుటిలో తప్పించుకోగలిగానని అన్నారు. ఆ రోజు జరిగిన ఎన్ఎస్‌జీ ఆపరేషన్ ఇంకా తన కళ్ల ముందు మెదులుతోందని, కర్మ సిద్ధాంతం ప్రకారం ఉగ్రదాడుల వెనక ఉన్న సూత్రధారులకు ఏదొకరోజు శిక్ష పడుతుందని తాను భావించానని తెలిపారు. 'పదహారేళ్ల తర్వాత రాణాను దేశంలో చూస్తుంటే న్యాయ వ్యవస్థపై మరింత విశ్వాసం పెరుగుతోంది. కేంద్రంలో ఉన్న బలమైన నాయకత్వం ఇటువంటి చర్యలు తీసుకోవడం ద్వారా భారత్‌పై దాడులు చేయాలంటే ముష్కరులు రెండోసారి ఆలోచిస్తారు' అని హిమంత బిశ్వశర్మ సోషల్ మీడియా వేదికగా స్పందించారు.

కుటుంబ ప్రయోజనాలే వారికి ముఖ్యం

ప్రతిపక్షాలపై ప్రధాని ఎదురుదాడి

వారణాసి: ప్రతిపక్షాలపై ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి ఎదురుదాడికి దిగారు. అధికార కాంక్షతో కుటుంబ ప్రయోజనాలపై మాత్రమే దృష్టి సారిస్తున్నాయని విమర్శించారు. తమ పార్టీ మాత్రం పదవీ కాంక్ష లేకుండా సమ్మిళిత అభివృద్ధి లక్ష్యంతో ముందుకుసాగుతోందని చెప్పుకొచ్చారు. ఎన్డీఏ కూటమి నేతలంతా ప్రతి ఒక్క పౌరుడి అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నారని చెప్పారు. పూలే దంపతులను ఆదర్శంగా తీసుకొని తాము మహిళల విద్య, అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో రూ.3,880 కోట్ల విలువైన 44 ప్రాజెక్టులకు ప్రధాని శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఇక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మోదీ ప్రసంగిస్తూ ప్రతిపక్షాలు 'పరివార్ కా సాథ్ పరివార్ కా వికాస్' (కుటుంబంతో కలిసి... కుటుంబం కోసం) అనే విధానాన్ని అనుసరిస్తాయని ఆరోపించారు. దానికి విరుద్ధంగా తాము 'సబ్‌కా సాథ్..సబ్‌కా వికాస్' (అందరితో కలిసి..అందరి కోసం) నినాదంతో ముందుకువెళ్తామన్నారు. ప్రస్తుతం ప్రారంభించిన ప్రాజెక్టుల్లో కూడా గ్రామీణాభివృద్ధికి పెద్దపీట వేశామని అన్నారు. వాటిలో 130 తాగునీటి ప్రాజెక్టులు, నాలుగు గ్రామీణ రోడ్లు, 100 కొత్త అంగన్‌వాడీ కేంద్రాలు, 356 గ్రంథాలయాలు, పాలిటెక్నిక్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉన్నాయని ప్రధాని తెలిపారు. గతంలో పూర్వాంచల్‌లో ఆరోగ్య సౌకర్యాలు తక్కువగా ఉండేవని, నేడు కాశీ పూర్వాంచల్‌కు ఆరోగ్య రాజధానిగా మారుతోందని ప్రధాని అన్నారు. అభివృద్ధి, వారసత్వం అనే రెండింటితో భారత్ ముందుకువెళ్తోందని పేర్కొన్నారు. 2036లో నిర్వహించనున్న ఒలింపిక్స్‌కు భారత్ ఆతిథ్యం ఇవ్వాలని భావిస్తుందని, అందుకు అనుమతి తీసుకోవడానికి అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. తన సొంత నియోజకవర్గమైన కాశీ ఎప్పటికీ తనదేనని, తాను కాశీకి చెందినవాడినని మోదీ పేర్కొన్నారు. 70 ఏళ్లు దాటిన ముగ్గురు లబ్ధిదారులకు ఆయుష్మాన్ కార్డులను అందజేశారు.

నిందితులపై కఠినచర్యలు

వారణాసిలో చోటుచేసుకున్న దారుణ సామూహిక అత్యాచార ఘటనపై మోదీ ఆరా తీశారు. 6 రోజుల్లో 23 మంది వ్యక్తులు 19 ఏళ్ల యువతిపై అత్యాచారానికి పాల్పడిన అమానవీయ ఘటన బాధించిందని చెప్పారు. ఉదయం అక్కడకు రాగానే అత్యాచార ఘటన గురించి జిల్లా మేజిస్ట్రేట్, పోలీస్ కమిషనర్, డివిజినల్ కమిషనర్‌ను అడిగి తెలుసుకున్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని ఆదేశాలిచ్చారు.

వలసలు, నిరుద్యోగం కట్టడిలో నితీశ్ విఫలం

సచిన్ పైలట్

పాట్నా: బీహార్‌లో పెరుగుతున్న నిరుద్యోగం, వలసలను అరికట్టడంలో నితీశ్ కుమార్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో విఫలమైందని కాంగ్రెస్ సీనియర్ నేత సచిన్ పైలట్ విమర్శించారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ నితీశ్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. దేశంలోని వేర్వేరు ప్రాంతాలకు బీహార్ నుంచి వలసలు పెరిగాయని, యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడంలోనూ నితీశ్ ఘోరంగా విఫలమయ్యారని, పెరుగుతున్న నిరుద్యోగానికి ఆయనే బాధ్యత వహించాలన్నారు. బీహార్‌లో నియామకాల ప్రక్రియల్లో పారదర్శకత లోపించిందని ఆరోపించారు. 'పారదర్శకంగా, వివాదం లేకుండా పరీక్షలు, నియామకాలు జరగడం బీహార్‌లో అరుదు. రాష్ట్రంలో ఎన్డీయే పాలన పేదలకు, యువతకు వ్యతిరేకంగా సాగుతోంది. సమాజంలో వెనుకబడిన వర్గాలు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల సాధికారత కోసం పనిచేసే పార్టీ కాంగ్రెస్ ఒక్కటే. బీహార్‌తో పాటు దేశంలోని యువతకు ఉద్యోగాల కల్పనకు కట్టుబడి ఉన్నాం' అని సచిన్ పైలట్ అన్నారు. సమీప భవిష్యత్‌లో జరగబోయే బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే ప్రభుత్వాన్ని రాష్ట్ర ప్రజలు నిలదీస్తారని చెప్పారు. అనంతరం పలాయన్ రోకో, నౌక్రీ దో (వలసలు ఆపండి, ఉద్యోగాలు ఇవ్వండి) యాత్రలో సచిన్ పైలట్ పాల్గొన్నారు. ఈ యాత్రకు ఎన్ఎస్‌యూఐ జాతీయ ఇన్‌చార్జి కన్హయ కుమార్ నేతృత్వం వహించారు. ఇదే క్రమంలో కాంగ్రెస్ ప్రతినిధి బృందం తమ డిమాండ్లపై ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌ను కలిసి మెమోరాండాన్ని సమర్పించింది. కాగా, కాంగ్రెస్ పాదయాత్ర 26 రోజులుగా అనేక జిల్లాల గుండా సాగుతూ శుక్రవారం సాయంత్రం పాట్నాలో ముగిసింది.

వర్షబీభత్సం... 47 మంది మృతి

న్యూదిల్లీ: దేశంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, బీహార్, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్, దిల్లీ తదితర రాష్ట్రాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది. వివిధ ప్రాంతాల్లో పిడుగులు పడ్డాయి. ఈ వర్షాల కారణంగా సంభవించిన ప్రమాదాల్లో సుమారు 47 మంది ప్రాణాలు కోల్పోయారు. అనేక మంది గాయపడ్డారు. ముఖ్యంగా బీహార్ రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో పిడుగులు, వడగళ్ల వాన కారణంగా 25 మంది మరణించినట్లు అధికారులు తెలిపారు. నలందలో 18 మంది, సివాన్‌లో ఇద్దరు, కతిహార్, దర్భంగా, బెగుసలరాయ్, బాగల్పూర్, జెహానాబాద్‌లో ఒక్కొక్కరు మరణించారు. మరోవైపు దర్భంగా, నలంద, పాట్నాతో సహా అనేక జిల్లాలకు ఐఎండీ ఆరెంజ్ హెచ్చరిక జారీ చేసింది. ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్... రాష్ట్రంలో మృతి చెందిన వారి సంఖ్య 50 కంటే ఎక్కువే ఉంటుందన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని 15 జిల్లాల్లో కురిసిన వర్షానికి 22 మంది మరణించారు. ఫతేపూర్, అజంగఢ్‌లో ముగ్గురు చొప్పున మరణించగా, ఫిరోజాబాద్, కాన్పూర్ దేహత్, సీతాపూర్‌లో ఇద్దరు చొప్పున, ఘాజీపూర్, గోండా, అమేథి, సంత్ కబీర్ నగర్, సిద్ధార్థ్ నగర్, బల్లియా, కన్నౌజ్, బారాబంకి, జౌన్‌పూర్, ఉన్నావ్‌లో ఒక్కొక్కరు ప్రాణాలు కోల్పోయారు. సీఎం యోగి ఆదిత్యనాథ్ బాధిత కుటుంబాలకు రూ.నాలుగు లక్షల పరిహారం చెల్లించాలని అధికారులను ఆదేశించారు. జార్ఖండ్‌లో ధన్‌బాద్, హజారీబాగ్, కోడెర్మ ప్రాంతాల్లో పంటలు దెబ్బతిన్నాయి. చెట్లు నేలకూలాయి.

బెంగాల్‌లో టీచర్ల ర్యాలీ

ఎస్ఎస్‌సీ భవన్ వరకు కదం తొక్కిన వేలాది మంది

ఓఎంఆర్ షీట్ల విడుదలకు డిమాండ్

కోల్‌కతా: నియామకాలు చెల్లవంటూ సర్వోన్నత న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేయడంతో బెంగాల్‌లో ఉద్యోగాలు కోల్పోయిన టీచర్లు శుక్రవారం నిరసనకు దిగారు. వేలాది మంది వీధుల్లోకి వచ్చి నిరసన తెలిపారు. సాల్ట్ లేక్‌లోని కరుణమోయే నుంచి పశ్చిమ బెంగాల్ స్కూల్ సర్వీస్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) భవన్ వరకు కదం తొక్కారు. తమను అర్హులైన అభ్యర్థులుగా గుర్తించడం కోసం ఆప్టికల్ మార్క్ రికగ్నిషన్ (ఓఎంఆర్) షీట్లను తక్షణమే విడుదల చేయాలని టీచర్లు డిమాండ్ చేశారు. తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. ఈ మేరకు ప్లకార్డులు ప్రదర్శించారు. అర్హులైన టీచర్ల సెగ్రిగేషన్‌కు ఓఎంఆర్ షీట్లను ఎస్ఎస్‌సీ విడుదల చేయాల్సిందేనని ప్రదర్శనకారులు డిమాండ్ చేశారు. నినాదాలు చేశారు. టీచర్ల ప్రదర్శనకు వివిధ పౌర సంఘాలు సంఘీభావం తెలిపాయి. గతంలో కస్బాలోని డీఐ కార్యాలయం వద్ద ఆందోళన చేసిన టీచర్లను కాలుతో కొట్టినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసు అధికారికే తమపై కేసుల దర్యాప్తును అప్పగించడాన్ని ఆందోళనకారులు ఆక్షేపించారు. ఈ విచారణ నుంచి ఏం ఆశించగలమని ప్రశ్నించారు. బాధితులపై ఓ నిందితుడు దర్యాప్తు చేపట్టడమన్నది నాగరిక సమాజంలో ఎన్నడూ జరిగివుండదని అన్నారు. ఎస్ఎస్‌సీ నుంచి స్పష్టత వచ్చేంత వరకు ఆందోళన ఆగదన్నారు. 'ఓఎంఆర్ షీట్లు ఎందుకు విడుదల చేయలేదు? కచ్చితమైన సంఖ్యలను సుప్రీంకోర్టు, కలకత్తా హైకోర్టుకు ఇచ్చివుంటే నేడు మా జీవితాలు ఇలా రోడ్డున పడేవి కాదు' అని నిరసనకారుల్లో ఒకరైన సుమన్ బిశ్వాస్ ఆవేదన వ్యక్తంచేశారు. టీచర్ల ర్యాలీతో ఎస్ఎస్‌సీ భవన్ వద్ద రాపిడ్ యాక్షన్ ఫోర్స్‌తో పాటు పోలీసులను మోహరించారు. రాష్ట్ర ఎయిడెడ్ స్కూళ్లలో పనిచేసే 25,753 మంది టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది నియామకాలు చెల్లవంటూ సుప్రీంకోర్టు గతవారంలో తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే.

యూపీఏ హయాంలోనే ఎన్ఐఏ ఏర్పాటు

సిబల్



న్యూదిల్లీ: ముంబైలో ఉగ్రదాడి ఫలితంగానే నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ) ఆవిర్భావం జరిగిందని ప్రముఖ న్యాయవాది కపిల్ సిబల్ తెలిపారు. ఉగ్రదాడి నిందితుడు తహవ్వుర్ రాణా అరెస్టు నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ ముంబై ఉగ్రదాడుల ఘటనలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు యూపీఏ హయాంలోనే సెంట్రల్ కౌంటర్ టెర్రరిజం లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీ ఏర్పాటయిందని చెప్పారు. 'ముంబైలో 26/11 దాడి ఘటన జరిగి అనేక మంది ప్రాణాలు కోల్పోవడంతో ఇలాంటి ఉగ్ర ఘటనల్లో ప్రమేయమున్న వారిపై కఠిన చట్టం అవసరమైంది. యూపీఏ హయాంలోనే ఎన్ఐఏ ఏర్పడినట్లు నాకు బాగా గుర్తు. ఈ ఘటనకు సంబంధించి 2009 నవంబర్ 11న ఎన్ఐఏ కేసు నమోదు చేసింది. అందులో డేవిడ్ హెడ్లీ, తహవ్వుర్ రాణా నిందితులుగా ఉన్నారు' అని సిబల్ తెలిపారు. ఎన్ఐఏ దర్యాప్తు గురించి మరింత వివరిస్తూ 2008 ముంబై ఉగ్రదాడి కేసులో కొన్ని ఆరోపణలపై రాణాను అమెరికా విడిచిపెట్టడంపై ఎన్ఐఏ అసంతృప్తి వ్యక్తం చేసిందని, కస్టడీలో ఉన్న సహనిందితుడు హెడ్లీని ఎన్ఐఏ బృందం ప్రశ్నించి కుట్రను వెలికితీసిందని చెప్పారు. 'రాణాను చికాగోలో అరెస్టు చేశారు. కానీ ఆ తర్వాత విడుదల చేశారు. దీనిపై ఎన్ఐఏ అసంతృప్తి వ్యక్తం చేస్తూ 2009 డిసెంబర్‌లో రాణా, హెడ్లీ, గుర్తుతెలియని మరికొందరిపై ఛార్జిషీటు దాఖలు చేసింది. పరస్పర సహకారంతో ఎన్ఐఏ బృందం అమెరికా వెళ్లి కస్టడీలో ఉన్న హెడ్లీని ప్రశ్నించింది. కుట్ర మొత్తాన్ని బయటకు లాగింది' అని సిబల్ తెలిపారు. రాణాను భారత్‌కు తీసుకురావడాన్ని కపిల్ సిబల్ స్వాగతించారు. గతంలోని యూపీఏ ప్రభుత్వం, ప్రస్తుత ఎన్డీయే ప్రభుత్వానికి ఈ ఘనత దక్కుతుందని అన్నారు. రాణా అరెస్టుతో ఉగ్రదాడి కుట్రలో పాకిస్థాన్ ప్రమేయం బయటకువస్తుందని చెప్పారు.

ఎన్ఐఏ దర్యాప్తునకు ముంబై పోలీసుల సహకారం

ఫడ్నవిస్

ముంబై: ముంబై ఉగ్రదాడి కుట్రలో ఒకడైన తహవ్వుర్ రాణాను అమెరికా నుంచి భారత్ తీసుకురావడం, ఎన్ఐఏ నేతృత్వంలో దర్యాప్తు జరుపుతుండటంపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ శుక్రవారం స్పందించారు. దర్యాప్తు విషయంలో ఎన్ఐఏకు ముంబై పోలీసులు సహకరిస్తారని రాష్ట్ర హోం మంత్రిగా కూడా ఉన్న ఫడ్నవిస్ చెప్పారు. రాణాను దిల్లీ నుంచి ముంబై తీసుకువస్తారా అని అడగగా... దానిపై ఎన్ఐఏ నిర్ణయిం తీసుకుంటుందని సీఎం జవాబిచ్చారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ, ఎన్ఐఏ కలిసి రాణాను ఎక్కడికి తీసుకువెళ్లాలనే దానిపై నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. ఎన్ఏఐకు అన్ని విధాలా సహకరించేందుకు ముంబై పోలీసులు సిద్ధంగా ఉన్నారని, అవసరమనుకుంటే ముంబై పోలీసులు ఎన్ఐఏను సంప్రదిస్తారని చెప్పారు. రాణాను విజయవంతంగా భారత్‌కు తీసుకువచ్చి దేశ న్యాయవ్యవస్థ ముందు నిలబెట్టిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఫడ్నవిస్ ప్రశంసించారు. నవంబర్ 2008లో జరిగిన ముంబై ఉగ్రదాడుల్లో తమ కుటుంబాలను కోల్పోయిన ముంబై ప్రజల తరపున ప్రధానికి కృతజ్ఞతలు తెలిపారు. ఉగ్రదాడుల తర్వాత ముంబై క్రైం బ్రాంచ్ పోలీసులు తొలుత విచారణ చేపట్టారు. తొలి ఛార్జిషీటు దాఖలు చేశారు. ఆ తర్వాత ఎన్ఐఏ రంగలోకి దిగి... దర్యాప్తును తమ అధీనంలోకి తీసుకుంది.

కంగన రెండు నెలల విద్యుత్ బిల్లు చెల్లించలేదు

సిమ్లా: బాలీవుడ్ నటి, బీజేపీ ఎంపీ కంగనా రణావత్ రెండు నెలల విద్యుత్ బకాయిలు చెల్లించలేదని హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ బోర్డు (హెచ్‌పీఎస్ ఈబీ) స్పష్టం చేసింది. రెండు నెలల విద్యుత్ బకాయిల మొత్తం రూ.90,384 ఉందని తెలిపింది. మేడమ్ బిల్లులు చెల్లించకపోగా... రాష్ట్ర ప్రభుత్వాన్ని దూషించారని రాష్ట్ర పీడబ్ల్యూడీ మంత్రి విక్రమాదిత్య సింగ్ మండిపడ్డారు. మనాలిలోని తన ఖాళీ నివాసానికి నెలకు లక్ష రూపాయల విద్యుత్ బిల్లు వచ్చిందని ఇటీవల మండిలో నిర్వహించిన బహిరంగ సభలో కంగన ఆరోపించిన సంగతి తెలిసిందే. మేడమ్ విద్యుత్ బిల్లులు కట్టరని, బహిరంగవేదికలపై ప్రభుత్వాన్ని దూషిస్తారని మంత్రి తన ఫేస్‌బుక్ పోస్ట్‌లో పేర్కొన్నారు. జనవరి, ఫిబ్రవరి నెలలకు చెందిన బిల్లులు రూ.90,384 అని, వాటిలో గతంలో రూ.32,287 కూడా ఉన్నాయని హెచ్‌పీఎస్‌ఈబీ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది.

మనాలిలోని సిమ్సా గ్రామంలో కంగనా రణావత్ నివాసంలో ఆమె పేరు మీద 100000838073 నెంబర్ కింద విద్యుత్ కనెక్షన్ ఉందని తెలిపింది. విద్యుత్ కనెక్టెడ్‌లోడ్ 94.82 కేడబ్ల్యూ అని, సాధారణ నివాస సగటు విద్యుత్ లోడ్ కన్నా 1500 శాతం ఎక్కువని పేర్కొంది. అక్టోబర్, డిసెంబర్ వరకు కంగన బిల్లులు సకాలంలో చెల్లించలేదని ఆ ప్రకటనలో తెలిపింది.

విశాలాంధ్ర హైదరాబాద్

భారం పడుతున్నా పథకాల అమలుకు కృషి : మహేందర్ రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో - మేడ్చల్ మల్కాజిగిరి, మేడిపల్లి : ప్రభుత్వంపై భారం పడుతున్న పథకాలను అమలు చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా శామీర్ పేట్ మండలంలోని తూముకుంటలోని ఎస్ఎస్ఆర్ కన్వెన్షన్‌లో ఎంపీ ఈటెల రాజేందర్ తోకలిసి ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ చేసారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ ప్రభుత్వం పై భారం పడుతున్న పథకాలను అమలు చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని, పార్టీలకు అతీతంగా ఎంపీ తదితరులతో కలిసి మల్కాజిగిరి నియోజక వర్గం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామన్నారు. ఘట్కేసర్ లో 116, కాప్రాలో 36, మేడ్చల్ 52, మూడు చింతలపల్లిలో 25, మేడిపల్లిలో 102, షామీర్పేట్ లో 58 మొత్తం 389 మంది లబ్ధిదారులకు సుమారు 4 కోట్ల రూపాయల కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పట్నం మహేందర్ రెడ్డి, ఈటల రాజేందర్ చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేసారు. ఆర్డీవో ఉపేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులు, వజ్రేష్ యాదవ్ పాల్గొన్నారు. అనంతరం దేవరియంజాల్ లోని శ్రీ సీతారామస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాల కళ్యాణ మహోత్సవంలో హాజరైన ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.

ఖాళీ ప్రభుత్వ స్థలాల వివరాలు డిజిటలైజేషన్‌కు సిద్ధంగా ఉండాలి : కలెక్టర్

విశాలాంధ్ర, -హైదరాబాద్ : జిల్లాలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాల వివరాలను సెంటర్ ఫర్‌గుడ్ గవర్నెన్స్ (సిజిజి) నిర్దేశిత యాప్‌లో అప్లోడ్ చేసేందుకు సంసిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తహసిల్దార్లను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆర్డిఓలు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, సర్వేయర్లులతో నిర్వహించిన రెవిన్యూ అధికారుల కాన్ఫరెన్స్‌లో అయన పాల్గొని ల్యాండ్ బ్యాంక్, ప్రభుత్వ భూముల కేటాయింపులు తదితర 20 అంశాలపై మండలాల వారీగా సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాల వివరాలను సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ యాప్‌లో అప్లోడ్ చేసేందుకు సిద్ధంగా ఉండాలని, ప్రభుత్వం వేరే శాఖలకు ఇచ్చిన భూములు వినియోగంలో ఉన్నవి ఎన్ని, వినియోగంలో లేనివి ఎన్ని, ఖాళీగా ఉన్నవి ఎన్ని అని గుర్తించి ఆక్రమణల గురికాకుండా ఉండేందుకు వివరాలను డిజిటలజైషన్, అప్డేషన్ చేయాలన్నారు. ఈనెల 22న పైలెట్ ప్రాజెక్టుగా తిరుమలగిరి మండలంలో చేపట్టాలని ఆయన ఆదేశించారు. అదనపు కలెక్టర్ జి.ముకుంద రెడ్డి, డిఆర్ఓ ఈ.వెంకట చారి, ఆర్డీవో సాయి రాం, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి శ్రీరాం, ఈ-డిఎం రజిత, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, తహసిల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, సర్వేయర్లు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - మల్కాజిగిరి : తెలంగాణ రాష్ట్ర బిల్డింగ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి ఆధ్వర్యంలో ఈనెల 21 22 తేదీల్లో శంషాబాద్‌లో ఏర్పాటు చేసినటువంటి మహాసభలను జయప్రదం చేయాలని గోడపత్రిక విడుదల చేశారు. అల్వాల్ మండల తెలంగాణ భవన నిర్మాణ సంఘం ఆధ్వర్యంలో టెంపుల్ అల్వాల్ ఏరియాలో జిల్లా నాయకులు వై.వెంకటేష్ నాయకత్వంలో గోడపత్రిక విడుదల చేశారు. అల్వాల్ మండలంలో భవన నిర్మాణం కార్మికులు ఎదుర్కొంటున్నటువంటి సమస్యల పట్ల లేబర్ చట్టాల అమలు చేయాలని భవనంపై నుండి పడ్డటువంటి భవన కార్మికులకు నష్టపరిహారం ఇవ్వాలని వారి వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని, కార్మికులు నిత్యం అడ్డాల పైన ఎదుర్కొంటున్నటువంటి సమస్యలు మరుగుదొడ్లు గాని ఉండడానికి షెల్టర్లు గాని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డి.జంగయ్య, రమేష్ సింగ్, సిహెచ్ మల్లేష్, సంతోష్, సిద్దు, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్ ధరను వెంటనే వెనక్కి తీసుకోవాలి

విశాలాంధ్ర - మల్కాజిగిరి : ఐద్వా మల్కాజిగిరి మండల కమిటీ ఆధ్వర్యంలో మల్కాజ్గిరి చౌరస్తాలో కట్టెల పోయితో నిరసన కార్యక్రమం చేయడం జరిగింది. ఐద్వా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.వినోద, ఐద్వా మల్కాజిగిరి మండల ప్రధాన కార్యదర్శి పి.మంగలు మాట్లాడుతూ...బడుగు బలహీన వర్గాల మహిళలు పేద మధ్యతరగతి మహిళలు నిత్యవసర వస్తువుల రేట్లు ఆకాశమంటుతున్న పరిస్థితిని చూస్తున్నామన్నారు పెట్రోల్ డీజిల్ రేట్లు పెరిగి సతమతమవుతున్న ఈ తరంలో గ్యాస్ రేట్ పెంచడం కేంద్ర ప్రభుత్వానికి సరైంది కాదు వారు వాపయ్యారు వెంటనే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా డిమాండ్ చేస్తుందని అన్నారు. నజీమా, ఎస్ రాజ్యలక్ష్మి, అనిత, షాహిన్, నరసమ్మ, కే.పద్మ, అంజమ్మ, ఫౌజియా, అరుణ, లక్ష్మి, లక్ష్మీ పద్మావతి, రాధమ్మ, కవిత తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభించిన మైనంపల్లి

విశాలాంధ్ర - మల్కాజిగిరి : సఫిల్ గుడా చౌరస్తాలో (ఎంఎస్ఎస్ఓ) మరియు పిట్టల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంనీ మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత రావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వేసవి తాపం తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. చలి వేంద్రంలో ఎప్పటికప్పుడు శుభ్రమైన నీటిని ప్రజలకు అందుబాటులో ఉంచే విధంగా నిర్వాహకులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ వై.ప్రేమ్ కుమార్, రాజ్ జితేంద్ర నాథ్, మల్కాజిగిరి ఇంచార్జ్ లక్ష్మీకాంత్ రెడ్డి, వెంకటేష్ యాదవ్, శ్రీనివాస్, పిట్టల సాయికిరణ్, పిట్టల నాగరాజు, గుండా నిరంజన్, ఎస్.ఆర్.ప్రసాద్, బాబు, సత్యనారాయణ, సంతోష్ రాందాస్, సీనియర్ నాయకుడు చంద్రశేఖర్, సంపత్ గౌడ్, వినోద్ యాదవ్, ప్రవీణ్, యూత్ కాంగ్రెస్ నాయకులు చరంజీత్ గౌడ్, ఫరీద్, ఫైజల్, సయ్యద్ మబ్బు, అగమయ్య, మంద భాస్కర్, ఇస్తారి, అరుణ్ కుమార్, ఆశా, ప్రభ, శారద, లాస్య తదితరులు పాల్గొన్నారు.

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి

పూలే పోరాటాలు మరువలేనివి: సీఎం

విశాలాంధ్ర - హైదరాబాద్: అంటరానితనం, కుల వివక్ష నిర్మూలన కోసం మహాత్మ జ్యోతిరావు పూలే జరిపిన పోరాటాలు మరువలేనివని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి ఆయన అలుపెరగని పోరాటాలు చేశారని పేర్కొన్నారు. అంబర్పేట్‌లో జ్యోతిరావు పూలే విగ్రహానికి టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, మాజీ ఎంపీ విహెచ్‌లతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సీఎం మాట్లాడుతూ మహిళలకు విద్యా హక్కు, బాల్య వివాహాలను అరికట్టడానికి పూలే తన జీవితాన్ని అంకితం చేశారన్నారు. పూలే ప్రతిఒక్కరికి స్ఫూర్తిదాయకమని, ఆయన సతీమణి సావిత్రీబాయి పూలే కూడా గొప్ప సంఘసంస్కర్త అని గుర్తు చేశారు. తెలంగాణ ప్రభుత్వం సావిత్రీబాయి పూలే జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించి ఆమెను గౌరవించిందని చెప్పారు.

విగ్రహ ఏర్పాటుకు స్థల పరిశీలన...

నెక్లెస్ రోడ్‌లోని ఐమాక్స్ సమీపంలో జ్యోతిరావు పూలే విగ్రహం ఏర్పాటుకు సీఎంతో కలిసి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్థలాన్ని పరిశీలించారు. బడుగు బలహీన వర్గాలకు సామాజిక న్యాయం అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన చేపట్టి దేశానికే ఆదర్శంగా నిలిచిందని అన్నారు. అభివృద్ధి ఫలాలు ఆయా వర్గాలకు దక్కాలనే సంకల్పంతో బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లోను, విద్య, ఉపాధి రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీ బిల్లు ఆమోదించి చరిత్ర సృష్టించిందన్నారు. ఉన్నత న్యాయ స్థానం ఆదేశాల ప్రకారం ఎస్సీ వర్గీకరణ చేపట్టిన మొదటి రాష్ట్రంగా తెలంగాణ చరిత్ర సృష్టించిందని చెప్పారు. స్థలం సర్వే చేసి పూర్తి స్థాయి ప్రణాళికలతో నివేదిక అందించాలని అధికారులను సీఎం అదేశించారు. భవిష్యత్‌లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా డిజైన్ చేయాలని సూచించారు. ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు, మేయర్ విజయలక్ష్మి, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, జాజుల శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

విద్యా విప్లవానికి మార్గదర్శి జ్యోతిరావు పూలే

మేయర్ గద్వాల్, కమీషనర్ ఇలంబర్తి

విశాలాంధ్ర - హైదరాబాద్ : మహాత్మా జ్యోతిరావు పూలే విద్యా విప్లవానికి మార్గదర్శిగా నిలిచారని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకుని శుక్రవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కమీషనర్ ఇలంబర్తి జ్యోతి రావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ... "మహాత్మా జ్యోతిరావు పూలే బడుగు, బలహీన వర్గాలకు విద్య, స్వాభిమానం అందించేందుకు చేసిన కృషి చిరస్మరణీయమైనదన్నారు. సమాజ మార్పు విద్య ద్వారానే సాధ్యమవుతుందని దారి చూపించిన మహనీయుడని అన్నారు. వారు సమాజానికి అందించిన సేవలను ఆమె కొనియాడారు. జ్యోతిబా పూలే భారతీయ సమాజంలో సమానత్వానికి, విద్యా హక్కులకు బాసటగా నిలిచిన వ్యక్తి అని, మహిళలు, దళితులు, అణగారిన వర్గాలకు విద్య అందించాలనే దృఢ సంకల్పంతో ఆయన స్థాపించిన తొలి బాలికల పాఠశాల భారతీయ సమాజ పునర్నిర్మాణానికి మైలురాయిగా నిలిచిందన్నారు. ఆయన చూపిన మార్గం ప్రతి ఒక్కరికి ఆదర్శంగా ఉండాలని అన్నారు. నేటి యువత ఆయన ఆశయాలతో ముందుకెళ్లాలన్నారు. కమీషనర్ ఇలంబర్తి మాట్లాడుతూ... జ్యోతి రావు పూలే మహిళా విద్యకు పునాదులు వేసిన మహనీయుడని, అన్ని వర్గాల సమానత్వం కోసం పోరాడిన ఆయన సేవలు నేటికీ సూర్తిదాయకంగా నిలుస్తాయన్నారు. పూలే విద్యావేత్తగా, సంఘ సంస్కర్తగా, రచయితగా, రైతుల హక్కుల కోసం పోరాడిన యోధుడిగా భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని పేర్కొన్నారు. సమాజాన్ని చైతన్యవంతం చేయాలన్న ఆయన సంకల్పాన్ని కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు వేణుగోపాల్, గీతా రాధిక, చీఫ్ ఇంజనీర్ రత్నాకర్, సిపిఆర్ఓ మహమ్మద్ ముర్తుజా అలీ, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొని పూలే చిత్రపటానికి పుష్పాంజలి అర్పించారు.

మహిళా విద్యకు మార్గదర్శకులు పూలే

విశాలాంధ్ర, హైదరాబాద్ : బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి, మహిళా విద్యకు మార్గదర్శకులు మహాత్మా జ్యోతిబా పూలే అని నేటితరం వారి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని మహిళా విద్యకు పెద్ద పీట వేయాలని జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. మహాత్మా జ్యోతిబాపూలే 199వ జయంతి సందర్భంగా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మహాత్మా జ్యోతిబా పూలే చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ కుల వివక్షకు వ్యతిరేకంగా సమాజం కోసం పోరాడిన, బహుజన తత్వవేత్త సామాజిక దార్శనికుడు మహాత్మా జ్యోతిబా పూలే అని, ఆయన దేశానికి ఎన్నో సేవలు అందించారని, వర్ణ వివక్షను రూపుమాపడం కోసం, దళిత బహుజన మహిళా వర్గాల అభ్యున్నతి కోసం, జ్యోతి రావు పూలే ఆచరించిన కార్యాచరణ మహోన్నతమైనదని తెలిపారు. అనంతరం అదనపు కలెక్టర్ సహాయ వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి బి.రమేష్ గీసిన మహాత్మా జ్యోతిబాపూలే చిత్ర పటానికి పూలమాల వేశారు. జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, బిసి సంక్షేమ అధికారి బి. కేశు రాం, పిడి మెప్మా మల్లీశ్వరి, జిల్లా సివిల్ సప్లయ్ అధికారి శ్రీనివాస్, ఈడీ ఎస్.సి కార్పొరేషన్ పద్మావతి, డిపిఆర్ఓ పి.సి.వెంకటేశం, బీసీ ఫ్రంట్ చైర్మన్ జి.మల్లేష్ యాదవ్, వడ్డెర సంఘం ప్రతినిధి బోసు రవి, కల్లు గీత కార్మిక సంఘం ప్రతినిధి సుధాకర్ గౌడ్, జిల్లా రజక సంఘం ప్రతినిధి అజయ్, బిసి సంఘం నాయకులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఇండియన్ బ్యాంక్ ఉద్యోగుల ప్రదర్శన

విశాలాంధ్ర, హైదరాబాద్ : ఇండియన్ బ్యాంక్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగులు శుక్రవారం హైదరాబాద్‌లోని లిబర్టీ ప్లాజాలో ఉన్న ఇండియన్ బ్యాంక్ ఫీల్డ్ జనరల్ మేనేజర్, జోనల్ కార్యాలయం వద్ద పెద్ద సంఖ్యలో ప్రదర్శన నిర్వహించారు. ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్స్ (ఎఫ్ఐబిఇయు) పిలుపు మేరకు హైదరాబాద్ జంట నగరాల్లో పనిచేస్తున్న ఇండియన్ బ్యాంక్ వందలాదిమంది ఉద్యోగులు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. ఇండియన్ బ్యాంక్‌లో ఉన్న సాధారణ ఖాళీలలో క్లరికల్ స్టాఫ్, సబ్-స్టాఫ్, స్వీపర్లు, డ్రైవర్లను తగినంతగా నియమించాలని, అలహాబాద్ బ్యాంక్‌ను ఇండియన్ బ్యాంక్ విలీనం చేసిన తర్వాత ఉద్యోగులకు ఇంటిగ్రేటెడ్ ట్రాన్స్‌ఫర్ పాలసీని, పెండింగ్ ఉన్న కారుణ్య నియామకాలను వెంటనే చేట్టాలని, బ్యాంకులో పనిచేస్తున్న తాత్కాలిక ఉద్యోగులకు కనీస వేతనాలు, బోనస్ చెల్లించాలని, బ్యాంకులో ఉన్న శాశ్వత ఖాళీలలో తాత్కాలిక ఉద్యోగుల సేవలను క్రమబద్ధీకరించాలని వారు డిమాండ్ చేశారు. బ్యాంక్ కారుణ్య నియామకం కోసం మరణించిన సిబ్బంది కుటుంబ సభ్యుల అనేక దరఖాస్తులు యాజమాన్యం వద్ద పెండింగ్ ఉన్నాయని, ఆ దరఖాస్తులను పరిశీలించి వెంటనే నియామకాలు చేపట్టాలని కోరారు. అనేక ఏళ్లుగా యాజమాన్యం వద్ద పెండింగ్ ఉన్న అన్ని సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. అఖిల భారత బ్యాంక్ ఉద్యోగుల అసోసియేషన్ (ఎఐబిఇఎ) జాతీయ కార్యదర్శి బి.ఎస్.రాంబాబు మాట్లాడుతూ తాత్కాలిక ఉద్యోగుల సమస్యలతో సహా బ్యాంకులో ఉద్యోగ నియామకాల కోసం ఆందోళన చేస్తున్న ఉద్యోగులను అభినందించారు. మార్చి 4న ఫరీదాబాద్ సమావేశమై, చర్చల సమయంలో నిర్ణయించిన 54 డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ చేస్తూ ఆందోళన కార్యక్రమాన్ని ప్రారంభించాలని నిర్ణయించిందన్నారు. ఈ మేరకు సమ్మె డిమాండ్ అన్నింటినీ ప్రస్తావిస్తూ అన్ని శాఖల నుండి ఇండియన్ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్, సిఇఓకు విజ్ఞాపన పత్రాన్ని సమర్పించినట్లు తెలిపారు. పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏప్రిల్ 19న అన్ని జోనల్, ఎఫ్.జి.ఎం కార్యాలయాల ముందు ధర్నాను, చివరకు ఏప్రిల్ 25న ఒక రోజు సమ్మె నిర్వహించనున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో ఉద్యోగ నియామకాలను కోరుతూ మరిన్ని సమ్మెలకు సిద్ధంగా ఉండాలని ఆయన సిబ్బందికి పిలుపునిచ్చారు. యూనియన్ అధ్యక్షుడు ఎం.ఎస్.కుమార్ అధ్యక్షత వహించగా, యూనియన్ జాయింట్ జనరల్ సెక్రటరీ జి.నల్లప్ప రెడ్డి, మహిళా కౌన్సిల్ కన్వీనర్ జి.పద్మ పాల్గొన్నారు.

కులగనన దేశవ్యాప్తంగా చేపట్టే వరకు పోరాడాలి

విశాలాంధ్ర, మల్కాజిగిరి : జనగణలో కులగన దేశ వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టే వరకు బీసీ వర్గాలంతా పోరాడే సమయం ఆసన్నమైందని రాష్ట్ర బీసీ హక్కుల సాధన సమితి ఉపాధ్యక్షులు సిహెచ్ దశరథ్ అన్నారు. శుక్రవారం ఈసీఐఎల్ నీలం రాజశేఖర్ రెడ్డి భవన్‌లో రాష్ట్ర బీసీల హక్కుల సాధన సమితి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఆధ్వర్యంలో ఏ.బాపు రాజ్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సిహెచ్ దశరథ రాష్ట్ర బీసీల హక్కుల సాధన సమితి ఉపాధ్యక్షులు హాజరై ప్రసంగించారు. గత ఆరు సంవత్సరాల నుండి బీసీలు అనేక పోరాటం చేయవడం వల్ల రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో 42 శాతం బీసీల రిజర్వేషన్ బిల్లు ప్రవేశం పెట్టారని, అట్టి బిల్లును కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపి షెడ్యూలు 9లో చేర్చాలని ఆయన అన్నారు. బీసీ డిక్లరేషన్ శాసనసభ ఎన్నికల సందర్భంగా కామారెడ్డిలో వచ్చిన హామీని నెరవేర్చాలని, అన్ని మండల గురుకుల బీసీల పాఠశాలను అలాగే తెలంగాణలో అన్ని జిల్లాలో డిగ్రీ బి.సి కళాశాలలను ఏర్పాటు చేయాలని ఆయన అన్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సిపిఐ కార్యదర్శి డిజి సాయిలు గౌడ్ ప్రసంగిస్తూ కులవృత్తుల పనులు వారికి ఎంపిక చేసి వారికి పది లక్షల రూపాయలు ఆర్థిక సాయం అందించి, బీసీ యువతకు జీవన ఉపాధి కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీ జిల్లా అధ్యక్షులు బాపు రాజు, బీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణలు మాట్లాడుతూ జిల్లాలో బీసీ ఎస్సీ, ఎస్టీ మైనార్టీ సమీకరించి జేఏసీ ఏర్పాటు చేసి కేంద్ర ప్రభుత్వం కులగణ చేపట్టే వరకు వివిధ మార్గంలో పోరాటాలు చేస్తామని వారన్నారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దామోదర్ రెడ్డి, మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి జే.లక్ష్మి, బీసీ హక్కుల సాధన సమితి నాయకులు ప్రమీల, మహాలక్ష్మి, ఆర్.గిరిజా కృష్ణమూర్తి, రైతు సంఘం నాయకులు ఎస్.నర్సింహులు, డి.జంగయ్య, ఏఐటీయూసీ నాయకులు శ్రీనివాస్, పి.సత్యనారాయణ, వెంకటేష్ చారి, నర్సమ్మ పాల్గొన్నారు.

దేశ రాజకీయ ముఖచిత్రాన్ని మార్చిన జ్యోతిరావుపూలే

విశాలాంధ్ర - హైదరాబాద్ : మహాత్మ జ్యోతిరావు పూలే 198వ జయంతి సందర్భంగా సిపిఐ హైదరాబాద్ జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రేమ్ పావని పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి మాట్లాడుతూ ఆనాడు దేశంలో కొనసాగుతున్న ఆధిపత్య రాజకీయాలను ప్రశ్నిస్తూ అందరికీ చదువుకునే హక్కు కావాలని విద్య ద్వారా మాత్రమే సమాజంలో సమూలమైన మార్పులు వస్తాయని భావించిన జ్యోతిరావు పూలే అనేక పాఠశాలలో నెలకొల్పాడు.

స్వయంగా తన భార్య అయిన సావిత్రిబాయి పూలేకు చదువు నేర్పి నాడు చదువుకు, జ్ఞానానికి దూరంగా ఉన్న మహిళల కోసం ప్రత్యేక పాఠశాలలు నెలకొల్పి వారి జీవితాలలో వెలుగులు నింపటానికి కారణం అయ్యారు. బ్రిటిష్ ప్రభుత్వం నియమించిన హంటర్ కమిషన్‌కి దేశంలో శ్రామిక కులాలకు చదువుకునే హక్కు కల్పించాలని నివేదికలు, వినతిపత్రాలు ఇవ్వడం జరిగింది. వితంతువుగా ఉన్న మహిళలపై సొంత బంధువులు కుటుంబ సభ్యులే అత్యాచారాలకు ఒడిగట్టిన సందర్భాలలో అట్లాంటి గర్భం దాల్చిన మహిళలను చంపుతున్న వ్యవస్థను నిరసిస్తూ ఆ మహిళలను చేరదీసి తన ఆశ్రమంలో అవకాశం కల్పించడం జరిగింది. అనేక అవమానాలు, చిత్కారాల చివరికి తన ఇంటి నుండి కూడా బహిష్కరణకు గురైనటువంటి వ్యక్తి మహాత్మ జ్యోతిరావు

శివాజీ చరిత్రను వెలికి తీసిన పూలే : ఎస్.ఛాయాదేవి సిపిఐ జిల్లా కార్యదర్శి

ఆధిపత్య బ్రాహ్మణీయ భావజాల కుట్రలకు బలైన క్షేత్రపతి శివాజీ చరిత్రను తెలుసుకున్న జ్యోతిరావు పూలే స్వయంగా ఆయన సమాధికి దగ్గరికి వెళ్లి ఆయన రైతు బాంధవుడని అనేక కవితల ద్వారా చాటి చెప్పుతూ నివాళులు అర్పించారు. నేటి కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం శివాజీ, శంబాజీల చరిత్రను వక్రీకరిస్తూ నేటి తరానికి ఒక మత విద్వేష రాజకీయాలకు ప్రతీకగా చూపిస్తున్నారు. దీనిని మనం ఎదుర్కోవాలి వాస్తవ చరిత్రలను ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, స్టాలిన్, జిల్లా కార్యవర్గ సభ్యులు పడాల నళిని, కౌన్సిల్ సభ్యులు దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆరుట్ల రాజ్ కుమార్, జేరిపోతుల కుమార్, భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు చెట్టు కింది శ్రీనివాస్ ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు చైతన్య, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు కళ్యాణ్, విద్యార్థి నాయకులు అనిల్, అరుణ్, వంశి, కార్మిక నాయకులు రాము, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అది ప్రభుత్వ భూమే...

విశాలాంధ్ర - హైదరాబాద్ : కంచ గచ్చిబౌలి భూమిని పరిశీలించడానికి వచ్చిన సుప్రీంకోర్టు ఎంపవర్డ్ కమిటీ మెంబర్ వినెయ్ లిమాయిని భువనగిరి ఎంపీలు చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రఘురాం రెడ్డిలు కలిశారు. సర్వే నెం 25 కంచ గచ్చిబౌలి గ్రామం శేరిలింగంపల్లి మండలం, రంగారెడ్డి జిల్లాలో మొత్తం 2,324-05 గుంటల భూమి పూర్తిగా ప్రభుత్వ భూమి అని వారు కమిటీ మెంబర్‌కు వివరించారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం కంచ గచ్చిబౌలి గ్రామంలోని సర్వే నెం.25లోని భూమి "కంచ అస్తబల్ పోరంబోకే సర్కారీ" అంటే ప్రభుత్వ భూమిగా నమోద్కెందని చెప్పారు. 1975లో యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్ (హెచ్‌సీయూ)కి కంచ గచ్చిబౌలి గ్రామంలోని సర్వే నెంబర్ 25, ఇతర సర్వే నంబర్‌లలో ఉన్న మొత్తం భూమిని స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. పైన పేర్కొన్న భూమి అప్పుడూ అన్యాక్రాంతమైందని, యాజమాన్యం యూఓహెచ్ అనుకూలంగా బదిలీ చేయబడలేదని వివరించారు. అలాగే రెవెన్యూ రికార్డు ప్రకారం, అటవీ శాఖ ప్రకారం, సర్వే నెంబర్ 25లోని భూమిని "అటవీ"గా వర్గీకరించలేదని లిమాయి వివరిస్తూ ఎంపీలు మెమోరాండం సమర్పించారు.

అసెంబ్లీలో పూలే విగ్రహ ఏర్పాటు చేసే వరకు పోరాటం ఆగదు

విశాలాంధ్ర - హైదరాబాద్ : నగరంలోని నెక్లెస్ రోడ్డు పరిసరాల్లో మహాత్మ జ్యోతి రావు పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ యోచనను స్వాగతిస్తున్నాని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. కార్వాన్‌లో పూలే జయంతి వేడుకల్లో పాల్గొన్న అమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ట్యాంక్ బండ్ పై విగ్రహ ఏర్పాటుకు స్థల పరిశీలన చేశారని తెలిసిందని కాని పూలే విగ్రహాన్ని అసెంబ్లీలో కూడా ఏర్పాటు చేయాలని అమె డిమాండ్ చేశారు. అసెంబ్లీలో పూలే విగ్రహం ఏర్పాటు చేసే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు. కులగణన వివరాలను గ్రామాల వారీగా బహిర్గతం చేయాల్సిన అవసరం వుందన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం కచ్చితంగా పరిగణలోకి తీసుకోవాలన్నారు. అంతకుముందు మింట్ కాంపౌండ్ వద్ద పూలే విగ్రహానికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీతో కలిసి పూలమాలలు వేసి నివాళ్ళు ఆర్పించారు. అయితే అసెంబ్లీ ఆవరణలో పూలే విగ్రహం ఏర్పాటుకు సిపిఎం కార్యదర్శి జాన్ వెస్లీ మద్దతు కోరగా దానికి జాన్ వెస్లీ ఎమ్మెల్సీ కవిత కృషికి సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు అయన ప్రకటించారు.

ఆస్తి పన్ను చెల్లించేవారికి సువర్ణావకాశం

విశాలాంధ్ర- దుండిగల్: ఆస్తి పన్ను ముందస్తు చెల్లింపుదారులకు ప్రభుత్వం ఎర్లీ బర్డ్ స్కీం కింద 5శాతం రాయితీని కల్పించిందని, కావున భవన యజమానులు అదరూ ఈ స్కీముని ఉపయోగించు కొని లబ్ధి పొందాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్ పేర్కొన్నారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్‌మెంట్, కోడ్ డివిజన్ మల్టిపుల్ యాక్సెస్ వారి ఆదేశం మేరకు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్ ప్రవేశపెట్టిన ప్రాపర్టీ టాక్స్ కలెక్షన్‌లో భాగంగా శుక్రవారం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి 10 వార్డ్ టెక్ మహేంద్ర యూనివర్సిటీ వారు ఎర్లీ బర్డ్ 5శాతం రిబేట్‌ని సద్వినియోగం చేసుకొని రూ.1,04,62,603 ఆస్తి పన్ను చెల్లించారు. అనంతరం కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎర్లీ బర్డ్ 5శాతం రిబేట్ పథకం ఏప్రిల్ 30వ తేదీ వరకు ఉంటుందని, గృహ యాజమాను దారులందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించు కోవాలని తెలిపారు. టెక్ మహీంద్రా యూనివర్సిటీ ప్రతినిధులు, బిల్ కలెక్టర్స్, వార్డ్ ఆఫీసర్స్ పాల్గొన్నారు.

మహారాజశ్రీ గుంటూరు 1వ అదనపు జిల్లా జడ్జివారి కోర్టులో

యం.వి.ఓ.పి.నెం.1319/2024

బిట్వీన్:
తొర్లికొండ రామలింగేశ్వర రావు వగైరా - పిటీషనర్లు
మరియు
గొల్లపోతు దుర్గా హరి ప్రసాద్ వగైరా - రెస్పాండెంట్లు

టు,
అర్-1: గొల్లపోతు దుర్గా హరి ప్రసాద్, తండ్రి శ్రీనివాస రావు, నివాసం: హెచ్ నెం.EWS 94, కె.పి.హెచ్.బి.కాలనీ, ఫేజ్ -1, కూకట్ పల్లి, మేడ్చల్, మల్కాజ్ గిరి, తెలంగాణ - 500072 (మోటారు సైకిల్ ఓనరు (KTM),TS08KC0635)

పై నెంబరు యం.వి.ఓ.పి.లోని పిటీషనర్లు యాక్సిడెంటుకు నష్టపరిహారం కొరుచూ దాఖలు చేసిన పిటీషనులో 1వ రెస్పాండెంటు అయిన మీకు పై కోర్టు వారినుండి నోటీసులు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు మీకు నోటీసును ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియచేయుమని ది:28-04-2025 కి వాయిదా వేసినారు. కావున వాయిదా రోజున ఉ.గం.10-30 ని.లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని లేక మీ వకీలు గారి ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలను తెలుపుకొనగలరు. లేనిచో శ్రీ కోర్టు వారిచే చట్ట ప్రకారం మీ పరోక్షంగా విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది: 28-04-2025

కె.శ్యాంప్రసాద్, ఎం.రత్న ప్రసాద్,
పిటీషనర్ల తరపు అడ్వకేట్స్,
అరండల్ పేట, గుంటూరు.

వక్ఫ్ బోర్డు రద్దుకు భారీ ర్యాలీ

విశాలాంధ్ర - షాద్ నగర్,రూరల్: రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలో ముస్లిం పౌరులు శుక్రవారం రోజు పటేల్ రోడ్డు జామియా మస్జీద్ నుంచి ప్రారంభమైన ర్యాలీ షాద్ నగర్ ముఖ్య కూడలి నుండి ఎమ్మార్వో కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పాల్గొన్న ముస్లిం మత పెద్దలు, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి హాజరయ్యారు. అనంతరం ఎమ్మార్వో కార్యాలయంలో తహసీల్దార్ కు వినతి పత్రం సమర్పించారు. ర్యాలీకి షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మహబూబ్ నగర్ ఎమ్మెల్సి నవీన్ రెడ్డి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ మత రాజకీయాలకు అండగా ఉంది ఒక వర్గానికి అన్యాయం చేస్తుందన్నారు. ముస్లీమ్ సోదరులు చేస్తున్న పోరాటానికి కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతు ఇస్తుందన్నారు. వక్ఫ్ ఏ మెయిన్మెంట్ యాక్ట్‌ను రద్దు చేయకపోతే ఆందోళనలు తీవ్రమవుతాయన్నారు. ముస్లిం మైనార్టీ మత పెద్దలు, ముస్లిం మహిళలు, వివిధ పార్టీల నాయకులు యువకులు,చిన్నారులు పెద్ద ఎత్తున తదితరులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయానికి దిశా నిర్దేశం చేసిన మహనీయుడు పూలే

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఈ దేశంలో సామాజిక న్యాయం కోసం పెద్ద ఎత్తున పోరాటం చేసి, ఆ వర్గాలకు దిశా నిర్దేశం చేసిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు కొనియాడారు. శుక్రవారం యూసఫ్ గూడ సమీపంలోని సీడిఎస్ (సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్) కేంద్రంలో మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం డిప్యూటీ సీఎం మీడియాతో మాట్లాడుతూ దేశంలోని అనేకమంది వెనుకబడిన వర్గాలు ప్రధానంగా మహిళలకు సామాజిక న్యాయం జరగాలని జ్యోతిరావు పూలే పెద్దఎత్తున పోరాటం చేసి ఈ దేశంలో ఆ వర్గాలకు దశా దిశా నిర్దేశం చేశారని డిప్యూటీ సీఎం తెలిపారు. పూలే జయంతి సందర్భంగా అందరం స్మరించుకుంటూ వారు చూపిన మార్గంలో ప్రయాణిస్తూ వారి ఆశయాలు నెరవేర్చడం కోసం కాంగ్రెస్ పార్టీ, ప్రజా ప్రభుత్వం కట్టుబడి పని చేస్తుందని తెలియజేశారు. సమాజంలో బడుగు బలహీన వర్గాల కోసం పనిచేయాలన్న ఆలోచన ఉన్న ప్రతి ఒక్కరు పూలే జయంతి సందర్భంగా మరోసారి ఆ వర్గాల జీవితాల్లో వెలుగులు నింపేందుకు కృషి చేయాలని కోరారు. ఎస్సీ కార్పొరేషన్ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీధర్, సీడీఎస్ నిర్వాహకులు మల్లేపల్లి లక్ష్మయ్య, సీనియర్ జర్నలిస్టు రామచంద్ర మూర్తి పాల్గొన్నారు. సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ కేంద్రంలో ఉన్న వసతులు, ఇప్పటివరకు చేపట్టిన కార్యక్రమాలు తదితర విషయాలను నిర్వాహకులు, అధికారులను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అడిగి తెలుసుకున్నారు. సెంటర్ లోని అన్ని ఫ్లోర్లలో తిరిగి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : అణగారిన వర్గాల హక్కులు, మహిళోద్ధారణ, కుల వ్యవస్థ నిర్మూలన, సామాజిక సమానత్వం కోసం అవిశ్రాంతంగా పోరాడిన మహనీయుడు మహాత్మా జ్యోతిబా పూలే అని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. మహాత్మ జ్యోతిబా పూలే 198వ జయంతిని పురస్కరించుకొని కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి కలెక్టర్ ఘనంగా నివాళులర్పించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కుల వివక్ష, లింగ అసమానతలకు వ్యతిరేకంగా అణగారిన వర్గాల హక్కులు, మహిళోద్ధరణ, మహిళా విద్యా, సామాజిక సంస్కరణలకు మార్గదర్శకుడు, గొప్ప సంఘసంస్కర్త మహాత్మ జ్యోతిబా పూలే అని అన్నారు. అదనపు కలెక్టర్ డాక్టర్ జి.ముకుంద రెడ్డి, డీఆర్ఓ ఈ.వెంకటాచారి, ఆర్డీవో సాయిరాం, రెవెన్యూ, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - మల్కాజిగిరిలో : ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్‌లో మహాత్మా జ్యోతిరావు పూలే 198వ జయంతి సందర్భంగా తెలుగు దేశం పార్టీ నాయకులు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జ్యోతి రావు పూలే బడుగు, బలహీన వర్గాలకు అభ్యున్నతికి చేసిన కృషి మరువలేనిదన్నారు. ఆయన ఆశయ సాదనకు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి కోఆర్డినేటర్ కరణం గోపి, వగ్గు చంద్రశేఖర్, మహిళా నాయకురాలు నరసమ్మ, భాస్కర చరీ, శ్రీనివాస్ నాయుడు, వెంకటేష్ గౌడ్, శ్రీనివాస్, సత్తయ్య యాదవ్, కోటి, హేమంత పాల్గొన్నారు.

గౌతంనగర్ డివిజన్‌లో....

ఘనంగా మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బాల్యవివాహాలు రద్దుచేసి సమాజ సేవను తోడ్పాటు అందించిన మహాత్మ జ్యోతిరావు పూలే ఆసియా సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రామ్ యాదవ్ అన్నారు. మల్కాజిగిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి సలహా సూచనల మేరకు శుక్రవారం మహాత్మ జ్యోతిరావు పూలే జయంతిని గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని చౌరస్తాలో గల జ్యోతిరావు పూలే విగ్రహానికి కార్పొరేటర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బీఆర్ఎస్ నాయకులు మేకల రాము యాదవ్ స్థానిక కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సిపిఎం ఆధ్వర్యంలో...

గొప్ప సంఘసంస్కర్త జ్యోతిరావు పూలే 198వ జయంతి కార్యక్రమం మల్కాజిగిరి సిపిఎం పార్టీ మండల కమిటి ఆధ్వర్యంలో, పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు కృపా సాగర్ పూలే చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. మండల నాయకురాలు మంగా, జిల్లా నాయకులు వినోద, కొండల్, రాజా లక్ష్మీ, ససీమ, అరుణ, సుకన్య తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - హైదరాబాద్ : వినూత్న ఆలోచనలతో సామాజిక మార్పు కొరకు పోరాటం చేసిన మహాత్మా జ్యోతిబా పూలే సామాజిక స్ఫూర్తిదాతగా సమాజంలో నిలిచిపోయారని తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య వెలుదండ నిత్యానందరావు అన్నారు. జ్యోతిబా పూలే 198వ జయంతి సందర్భంగా శుక్రవారం తెలుగు విశ్వవిద్యాలయంలో 'స్ఫూర్తిదాతలకు నీరాజనం పేరిట బి.సి, ఎస్.సి, ఎస్.టి. సెల్ ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయ విద్యాత్మక భవన ప్రాంగణంలోని జ్యోతిబా పూలే దంపతుల విగ్రహాలకు ఉపాధ్యక్షులు నిత్యానందరావు పుష్పాంజలి ఘటించారు. ఆయన మాట్లాడుతూ సమాజంలోని అట్టడుగు వర్గాల ప్రజల అణచివేతకు వ్యతిరేకంగా వారి హక్కులు, స్వేచ్ఛ, సమానత్వం కోసం పోరాడుతూ సామాజిక రుగ్మతలను రూపుమాపడానికి జ్యోతిబా పూలే చేసిన పోరాటం స్మరణీయమని అన్నారు. విశ్వవిద్యాలయంలోని జానపద కళలశాఖలో అధ్యాపకులుగా పని చేస్తున్న గంగాధర్‌కు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉగాది వేడుకలలో భాగంగా 'కళారత్న' పురస్కారాన్ని అందజేసిన సందర్భంగా విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు వారిని శాలువాతో అభినందించారు. బి.సి.సెల్ డైరెక్టర్ డా.కె.రత్నశ్రీ స్వాగతం పలుకగా, ఎస్.సి.ఎస్.టి సెల్ డైరెక్టర్ డా.విజయ్ పాత్ లోత్ సమన్వయకర్తగా వ్యవహరించారు.

విశాలాంధ్ర - మల్కాజిగిరి : మహాత్మ జ్యోతిరావు పూలే మహనీయుని 198వ జయంతి సందర్భంగా శుక్రవారం మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహానికి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మల నరసింహ, జిల్లా అధ్యక్షులు డి.జంగయ్య యాదవ్, అల్వాల్ మండల కార్యదర్శి సహదేవ్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ వై.వెంకటేష్, బీ.సీ.హక్కుల రాష్ట్ర నాయకులు మహాత్మ జ్యోతిరావు పూలే ఉత్సవ కమిటీ అధ్యక్షులు వంశిరాజ్ మల్లేష్ పూలమాలతో ఘనంగా నివాళులు అర్పించారు.

విశాలాంధ్ర - హన్మకొండ: పీడిత ప్రజల బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి నిత్య స్ఫూర్తి ప్రదాత మహాత్మ జ్యోతిబాపూలే చిరస్మరణీయులని వారి ఆశయాల సాధనకు చైతన్యంతో సంఘటితమై పోరాటాలు నిర్వహించడమే వారికి నిజమైన నివాళులు అర్పించినట్లు కాగలదని బీసీ హక్కులసాధన సమితిరాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు అన్నారు. బీసీహక్కుల సాధన సమితి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వలభోజు వెంకన్న ఆధ్వర్యంలో వరంగల్ ములుగు రోడ్ వద్ద 198వ జయంతిని జ్యోతిబాపూలే విగ్రహానికి పూలమాలలువేసిఘనంగానిర్వహించారు. బీసీ హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షుడు వలభోజువెంకన్న, వరంగల్ మండల కార్యదర్శి మేడిది అశోక్, పులుగోటి రమణాచారి, నోముల ప్రదీప్, బచ్చల స్వప్న, పెరుమళ్ళ రాజేష్, సరిత, సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - ఎల్.బి.నగర్ : బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో శుక్రవారం సిపిఐ అనుబంధ ప్రజా సంఘాల కార్యాలయం ఎస్.ఏ.డాంగే బవన్, న్యూ నాగోల్ కొత్తపేట డివిజన్, ఉప్పల్ మండలం, మేడ్చల్ జిల్లా, ఎల్బీనగర్ నియోజకవర్గం సంబంధించిన ఉడుతల మల్లేష్ గౌడ్ అధ్యక్షతన జ్యోతి బాపూలే జయంతిని నిర్వహించడం జరిగింది. ముఖ్యఅతిథిగా బీసీ హక్కుల సాధన రాష్ట్ర సమితి సహాయ కారదర్శి బొడ్డుపల్లి కృష్ణ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతిబాపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాసమల్ల రాజేందర్, సంగు సైదారావు, చింతల పద్మ, పి.మల్లేష్, ఆర్.కావ్య తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - హైదరాబాద్ : మహాత్మ జ్యోతిరావు పూలే వంటి మహనీయులను స్మరించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉన్నది జలమండలి ఎండీ అశోక్ రెడ్డి అన్నారు. శుక్రవారంనాడు ఖైరతాబాద్ లోని ప్రధాన కార్యాలయంలో జల మండలి బీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో జ్యోతి రావు పూలే 199వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎండీ హాజరై.. జ్యోతి ప్రజ్వలన చేసి, పూలే చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈఎన్సీ-డైరెక్టర్ (ఆపరేషన్-2) వీఎల్ ప్రవీణ్ కుమార్, డైరెక్టర్ (ప్రాజెక్టు) సుదర్శన్, డైరెక్టర్ (ఆపరేషన్-1) అమరేందర్ రెడ్డి, డైరెక్టర్ (ఫైనాన్స్) పద్మావతి, కార్యక్రమం కోఆర్డినేటర్ సీజీఎం వినోద్ భార్గవ, సీజీఎంలు మహ్మద్ అబ్దుల్ ఖాదర్, ప్రభు, చంద్ర జ్యోతి, కేదారేశ్వరి, రవీందర్ రెడ్డి, జీఎంలు, జలమండలి ఇంజినీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్, జలమండలి బీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ యూనియన్ల నాయకులు, కార్మిక సంఘాల నాయకులు, ఉద్యోగులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి ఉత్సవాన్ని పురస్కరించుకొని, చందానగర్‌లో గల డఫ్ అండ్ డమ్ (చెవిటి మూగ) స్కూల్ నందు మహాత్మ జ్యోతిరావు పూలే గారి జయంతి ఉత్సవాన్ని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి, విద్యార్థినీ విద్యార్థులకు ఫ్రూట్స్, బిస్కెట్స్ అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ విచ్చేసి మాట్లాడుతూ భారత దేశ ఆధునిక యుగ వైతాళికుడు మరియు ప్రథమ సామాజికవేత్త మహాత్మాపూలే అని కొనియాడారు. స్కూల్ ప్రిన్సిపల్ మెర్సీ, అధ్యాపకురాలు శోభా, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కౌండిన్యశ్రీ నండూరి వెంకటేశ్వరరాజు, పాలం శ్రీను, బాలరాజు, జనార్ధన్, జిల్ మల్లేష్, సుబ్బయ్య, చంద్రశేఖర్, విజయానంద్ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : అంబర్ పేట, అడిక్ మెట్ లలో జ్యోతి రావు విగ్రహాలకు పూలమాల వేసి బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు నాగేష్ ముదిరాజ్ ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే కుల వివక్ష, మత వివక్షను వ్యతిరేకించారన్నారు. బి ఆర్ ఎస్ నాయకులు జెల్ల బిక్షపతి, రాజేష్, నాగ సాయి, శ్రీనివాస్, సుదర్శన్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - కొత్తూరు : బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావ్ పూలే అని మున్సిపల్ చైర్ పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్ అన్నారు .శుక్రవారం మహాత్మా జ్యోతిరావ్ పూలే 199వ జయంతిని పురస్కరించుకొని ఆమె ఆధ్వర్యంలో మండలకేంద్రంలోని ముఖ్యకూడలిలో నిర్వహించిన ఉత్సవాల సందర్భంగా లావణ్య దేవేందర్ యాదవ్ పలువురు నాయకులతో కలిసి పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి, విద్యా అభివృద్ధి, సమసమాజ స్థాపనకు పాటుపడి గొప్ప సంఘ సంస్కర్తగా నిలిచిన దీనజన బాంధవుడు మహాత్మ జ్యోతిరావ్ పూలే అని కొనియాడారు. వైస్ చైర్మన్ డోలి రవీందర్, కౌన్సిలర్స్ కోసిగి శ్రీనివాస్, సోమ్లా నాయక్, మాధవి గోపాల్ గౌడ్,అనిత శ్రీనివాస్ గౌడ్, బ్యాగరీ ప్రసన్న లత యాదయ్య, మాజీ ఎంపిటిసి రాజేందర్ గౌడ్, జంగగళ్ళ కృష్ణయ్య, మున్సిపాలిటీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగగళ్ళ శివకుమార్, కుమార్ పాల్గొన్నారు.

విశాలాంధ్ర-బషీర్ బాగ్: మహాత్మా జ్యోతిబా పూలే 198వ జయంతి పురస్కరించుకొని శుక్రవారం హైదర్ గూడ చౌరస్తాలో పూలే దంపతుల విగ్రహాలను తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల నరేందర్ గౌడ్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నరేందర్ గౌడ్ మాట్లాడుతూ మహనీయులు సామాజిక మార్పుకోసం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మహిళల సాధికారిత కొరకు పూలే దంపతులు అహర్నిశలు పాటు పడ్డారన్నారు. ఈ సందర్భంగా ఆళ్ల రామకృష్ణ మాట్లాడుతూ కనీసం ఈనాడు శూద్రులు, అతిశూద్రులు అనబడే హిందువులు కనీసం స్థాయిలో బ్రతకలుగుతున్నారంటే అది పూలే దంపతుల త్యాగ ఫలితం అన్నారు. నవీన్ రాజు, ఎర్ర శ్రీహరి గౌడ్, సరికొండ రామకృష్ణంరాజు, బీసీ సంక్షేమ సంఘం కార్య నిర్వాహక అధ్యక్షులు శివకుమార్, గిరగాని భిక్షపతి గౌడ్, కలల్ నర్సింలు గౌడ్, ఆనంతుల ప్రసాద్ గౌడ్, రవికుమార్ యాదవ్, ఉపేందర్ కొత్త వినయ్ బాబు, అక్షిత్ జైస్వాల్, విశ్వపతి పాల్గొన్నారు.

విశాలాంధ్ర - కాప్రా : మహాత్మ జ్యోతిబాపూలే, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జీవితాలు ప్రస్తుత తరానికి ఆదర్శప్రాయంగా నిలుస్తాయని డెక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్ చైర్మన్ కే నవనీతరావు పేర్కొన్నారు. పూలే, అంబేద్కర్‌ల జయంతిని పురస్కరించుకుని శుక్రవారం నాచారం పరిధిలోని డెక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్లో మహనీయుల జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల చైర్మన్ నవనీతరావు మాట్లాడుతూ మహనీయుల ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకంగా నిలవాలని ఆకాంక్షించారు. పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ నవీన్ కుమార్, ఆపరేషన్ హెడ్స్ కిషోర్ కుమార్ రెడ్డి, ప్రిన్సిపాల్ సుమా మీనన్, సీనియర్ వైస్ ప్రిన్సిపాల్ స్వర్ణ అక్కినేని, అన్ని సెగ్మెంట్ వైస్ ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు హాజరయ్యారు.

విశాలాంధ్ర - జవహర్‌నగర్ : జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో శుక్రవారం బాలాజీ నగర్ చౌరస్తాలో ఘనంగా జ్యోతిరావు పూలే 198 వ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తోటపల్లి శంకర్, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషిచేసిన దార్శనికుడని సమాజంలో అణగారిన వర్గాల విద్యాభివృద్ధికి కృషిచేసిన గొప్ప సంఘసంస్కర్త అని వారి సేవలను కొనియాడారు. సిపిఐ మండల కార్యదర్శి దర్శనం యాదగిరి, ఏఐటీయూసీ మండల అధ్యక్షులు అంబాల ఎల్లయ్య, గిరిజన సమైక్య జిల్లా ప్రధాన కార్యదర్శి వి స్వరూప నాయక్, గిరిప్రసాద్ నగర్ శాఖ కార్యదర్శి కొండ సత్యం, సాగర్,సిపిఐ సీనియర్ నాయకులు అశోక్ చారి, మహిళా సమైక్య నాయకురాలు డి మల్లిక తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - హైదరాబాద్ : మహాత్మా జ్యోతిరావ్ పూలే మహిళా విద్య కోసం, బడుగు వర్గాల అభ్యున్నతి కోసం, సకలజనుల సామాజిక న్యాయం కోసం పోరాడారని, సమాజంలో సాంఘిక సమానత్వం సాధించి చూపటమే మహాత్మ జ్యోతిరావ్ పూలేకి నిజమైన నివాళి అవుతుందని సింగరేణి సంస్థ చైర్మన్ మరియు ఎండీ ఎన్.బలరామ్ పేర్కొన్నారు. హైదరాబాద్ సింగరేణి భవన్‌లో జరిగిన మహాత్మా జ్యోతిరావ్ పూలే జయంతి ఉత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ముందుగా మహాత్మ జ్యోతిరావ్ పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. బీసీ ఉద్యోగ సంఘాల ప్రతినిధిగా డీ.జీ.ఎం చౌటపల్లి ప్రభాకర్ ప్రసంగించారు.

విశాలాంధ్ర- హైదరాబాద్ : బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావు పూలే 198వ జయంతి సందరరేగా దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) హైదరాబాద్ జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో హిమాయత్ నగర్ సత్యనారాయణ రెడ్డి భవన్‌లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్. జిల్లా అధ్యక్షులు ఆరుట్ల రాజ్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి జేరుపోతుల కుమారస్వామిలతో కలిసిఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మారుపాక అనిల్ కుమార్ మాట్లాడారు.

ఎన్‌టిఆర్ భవన్‌లో మహాత్మా జ్యోతిరావుపూలే జయంతి కార్యక్రమాన్ని శుక్రవారం ఎన్‌టిఆర్ భవన్‌లో మహాత్మా జ్యోతిరావుపూలే జయంతి కార్యక్రమాన్ని తెలంగాణ తెలుగుదేశం పార్టీ నిర్వహించింది. జ్యోతిరావుపూలే చిత్రపటానికి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. పొలిట్‌బ్యూరో సభ్యులు అరవింద్ కుమార్ గౌడ్ మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ ఎమ్మెల్సీ బీద రవిచంద్ర రాష్ట్ర పార్టీ నాయకులు, అజ్మీరా రాజునాయక్ రాష్ట్ర పార్టీ నాయకులు పోలంపల్లి అశోక్ కుమార్, పార్లమెంట్ అడ్‌హాక్ కమిటీ కన్వీనర్ కసిరెడ్డి శేఖర్ రెడ్డి, మీడియా కమిటీ చైర్మన్ ప్రకాష్ రెడ్డి, నర్సింగ్‌రావు, గూడెపు రాఘవులు, తమోదన్ రావు, జగదీష్, శ్రీరామోజు శివ, లలిత చౌదరి పాల్గొన్నారు.

ఆస్తిపన్ను వసూళ్లలో జీహెచ్ఎంసీ కొత్త రికార్డు

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఆస్తిపన్ను వసూళ్లలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్ఎంసి) రికార్డ్ స్థాయిలో అద్భుతమైన వసూళ్లను సాధించి చరిత్ర సృష్టించిందని జిహెచ్ఎంసి కమీషనర్ ఇలంబర్తి అన్నారు. 2 వేల కోట్లకుపైగా ఆస్తిపన్ను వసూలు చేయడంలో క్షేత్రస్థాయి అధికారులు బాగా పని చేశారని అన్నారు. జిహెచ్ఎంసికి 2024-25 ఆర్థిక సంవత్సరానికి రికార్డ్ స్థాయిలో ఆస్తి పన్ను వసూలైన నేపథ్యంలో, అందుకు కృషి చేసిన రెవెన్యూ అధికారులు, బిల్ కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్స్పెక్టర్లు, ఏ.ఎం.సిలు, డిప్యూటీ కమిషనర్లకు శుక్రవారం బంజారా హిల్స్‌లోని బంజారా భవన్‌లో అభినందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమీషనర్ ఇలంబర్తి మాట్లాడుతూ గతంలో ఎప్పుడూ వసూలు కానంతగా రికార్డు స్థాయిలో ఈ సంవత్సరం లక్ష్యాన్ని మించి పన్ను వసూలు కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. పన్ను వసూలు ఎంత ఎక్కువగా వస్తే ప్రజలకు అంత బాగా సేవలు అందించవీలుంటుందన్నారు. ఆస్తి పన్ను బకాయిలపై వన్ టైమ్ సెటిల్‌మెంట్ (ఓటిఎస్) పథకం అమలుతో మంచి ఫలితాలు వచ్చాయన్నారు. అధికారులు, ఆయా సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పన్ను చెల్లింపుదారులను ప్రోత్సహించడంతో ఈ ఏడాది అత్యధికంగా పన్ను వసూలైందని తెలిపారు. అత్యధికంగా పన్ను వసూళ్లు చేసిన బిల్ కలెక్టర్లకు, ట్యాక్స్ కలెక్షన్ ఇన్స్పెక్టర్లకు, డిప్యూటీ కమిషనర్‌లకు, ఏ.ఎం.సి లకు, జోనల్ కమిషనర్ లకు ప్రశంసా పత్రాలు, మెమెంటోలు అందజేసి కమీషనర్ అభినందనలు తెలిపారు. అడిషనల్ కమీషనర్లు అనురాగ్ జయంతి, వేణుగోపాల్ రెడ్డి, రఘు ప్రసాద్, వేణుగోపాల్, సామ్రాట్ అశోక్, సరోజ, జోనల్ కమిషనర్లు హేమంత్ కేశవ్ పాటిల్, ఉపేందర్ రెడ్డి, రవికిరణ్, వెంకన్న, సిసిపి శ్రీనివాస్, జాయింట్ కమిషనర్ మహేష్ కులకర్ణి, డిప్యూటీ కమిషనర్లు, ట్యాక్స్ ఇన్స్పెక్టర్లు, ఏ.ఎం.సిలు, బిల్ కలెక్టర్లు, ఐటి విభాగం అధికారులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను వసూళ్లలో చందానగర్ సర్కిల్ నాలుగవ స్థానం

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: బంజారాహిల్స్‌లోని బంజారా భవన్‌లో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ)లో 2024-25 ఆస్తి పన్ను వసూలు రికార్డు స్థాయిలో వసూలైన సందర్భంగా జిహెచ్ఎంసి రెవెన్యూ విభాగానికి (30 సర్కిళ్లకు) సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా చందానగర్ సర్కిల్-21 నాలుగవ స్థానం వచ్చినందున చందానగర్ సర్కిల్ రెవెన్యూ విభాగానికి సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఉప కమీషనర్ పి. మోహన్ రెడ్డి మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ. 109.54 కోట్ల ఆస్తి పన్ను వసూలైనట్లు తెలిపారు. అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్లు, టాక్ ఇన్స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు మొత్తం బృందం సమిష్టి కృషి వల్ల ఈ ఘనత సాధించగలిగామని తెలిపారు. చందానగర్ రెవిన్యూ విభాగాన్ని ప్రత్యేకంగా అభినందిస్తున్నానని తెలిపారు.

మైనార్టీ వక్ఫ్ బచావో మార్చ్‌కు విద్యార్థి, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాల మద్దతు



విశాలాంధ్ర- బషీర్ బాగ్: ఏప్రిల్ 13న మైనార్టీ వక్ఫ్ బచావో మార్చ్‌కు తెలంగాణ విద్యార్థి, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాల మద్దతు తెలుపుతున్నట్లు గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ వెంకటేష్ చౌహాన్ తెలిపారు. శుక్రవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో తెలంగాణ విద్యార్థి జేఏసీ నాయకులు ఎస్సీ ఎస్టీ బిసి సంఘాల ఆధ్వర్యంలో ఏప్రిల్ 13న ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద జరిగే ధర్నాకు బహుజన సంఘాలు మద్దతు ప్రకటించాయి. ఈ సందర్భంగా గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ వెంకటేష్ చౌహాన్ మాట్లాడుతూ బిజెపి కేంద్ర ప్రభుత్వ విధానాలు పేద వర్గాలకు వ్యతిరేకంగా ముఖ్యంగా ముస్లింల భూములు ఆస్తులను దోపిడీకి పాల్పడుతుందని ఆరోపించారు. గిరిజన సంఘాల జేఏసీ చైర్మన్ రాజేష్ నాయక్ మాట్లాడుతూ బిల్లుకు మద్దతు ఇచ్చిన చంద్రబాబు పవన్ కళ్యాణ్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. వక్ఫ్ బచావో మార్చ్ కో ఆర్డినేటర్ ఖదీర్ మాట్లాడుతు నేడూ దేశవ్యాప్తంగా విభజించి పాలించే రాజకీయం చేస్తుందని తెలిపారు. బహుజన స్టూడెంట్ ప్రొటెక్షన్ రాష్ట్ర కన్వీనర్ సురేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్నటువంటి నిర్ణయం సరైనది కాదని ఇలాంటి సమయంలో పేద వర్గాలందరూ ఐక్యంగా ముస్లిం మైనార్టీల పక్షాన నిలబడాల్సిన అవసరం ఉందని తెలియజేశారు. తెలంగాణ మాదిగ యూత్ ఫోర్స్ అధ్యక్షులు రమేష్ దక్కన్ వర్బ్ ప్రొడక్షన్స్ సొసైటీ నజీర్ సలీం మక్బూల్ తెలంగాణ ఎరుకల సంఘం నాయకులు రాజేష్, మాదిగ విద్యార్థి జేఏసీ ఓయూ ప్రెసిడెంట్ జోగు గణేష్, శ్రీమాన్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సహకారం మరువలేనిది : సీఐ

విశాలాంధ్ర - ఆమనగల్లు: ఆమనగల్లు సిఐగా విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్తున్న ప్రమోద్ కుమార్ను శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. అనంతరం బదిలీపై వెళ్తున్న సీఐ మాట్లాడుతూ తన 14 నెలల పదవీకాలంలో ఈ ప్రాంత ప్రజలతో ఏర్పడిన అనుబంధం, ప్రజల సహకారం మరువలేనిదని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగి జీవితంలో బదిలీ అనేది సహజమని, ఉద్యోగులు తాము పనిచేసే చోట ఎంతో అంకితభావంతో విధులు నిర్వహించి ప్రజల మన్ననలు పొందాలన్నారు. ఆమనగల్లు ఎస్సై వెంకటేశ్, తలకొండపల్లి ఎస్సై శ్రీకాంత్,అదనపు ఎస్సై సీతారామ్ రెడ్డి, ఏఎస్సైలు బాల్ రెడ్డి, మురళీధర్ రెడ్డి, హెడ్ కానిస్టేబుళ్లు లక్ష్మణ్, శ్రీనివాస్ గౌడ్, టైటాస్, సిబ్బంది శ్రీను, శ్రీశైలం, శివ కుమార్, రఘు, మహేష్, శివా రెడ్డి, భాను, ప్రవీణ్, పుష్పలత, సుజాత, శశిరేఖా, మల్లేష్, శ్రీశైలం, నాగరాజు, భాస్కర్ పాల్గొన్నారు.

ప్రజలంతా రాజ్యాంగ పరిరక్షణకు పాటుపడాలి :కొలను

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: ప్రజలంతా రాజ్యాంగ పరిరక్షణ కొరకు పాటుపడాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలను శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రాజ్యాంగ విలువలపై ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యమని, ప్రజాస్వామ్యాన్ని ప్రశ్నించుకోవడానికి రాహుల్ గాంధీ జై బాపూ,జై భీమ్,జై సంవిధాన్ నినాదానికి పిలుపునిచ్చారు. అందులో భాగంగా నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ లోని పెద్ద ఎత్తున పాదయాత్ర జై బాపూ, జై భీమ్, జై సంవిధాన్ అనే నినాదంతో నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హనుమంత్ రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, ఎన్ ఎం సి అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తూ ప్రతి డివిజన్లకు కాలినడకతో ప్రజల మధ్యకు వెళ్లి మన దేశం గొప్పతనం మన రాజ్యాంగం గొప్పతనం తెలుపుతూ ప్రజలలో చైతన్యం కలిగిస్తూ మరింత ముందుకు కొనసాగుతున్నారు. శుక్రవారం 8వ రోజు బాచుపల్లి 1వ డివిజన్ లో పాదయాత్ర కార్యక్రమం నిర్వహించి ప్రజల మధ్యకు వెళ్లారు. కొలను శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగం గొప్పతనం తెలుపుతూ ప్రజలలో చైతన్యం కలిగిస్తున్న జై బాపూ, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమానికి మాతోపాటు అందరూ పాల్గొని మీ వంతు బాధ్యతను మీరు నిర్వహిస్తున్నందుకు వారికీ ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. మాజీ కార్పొరేటర్లు కొలన్ వీరేందర్ రెడ్డి, చెట్ల దివాకర్, ఇంద్రజిత్ రెడ్డి, ఆవుల జగదీష్, రఫియా బేగం, కడియాల ఇందిరా, సీనియర్ నాయకులు కొలన్ జీవన్ రెడ్డి, రాజిరెడ్డి, వీరబాబు, వరగాని వాసు, మురళీ కృష్ణ, మేడ శ్రీనివాస్, బిక్కన్ షా, రఫత్, పంగా శ్రీనివాసరావు, మల్లికార్జున్, నారాయణరెడ్డి, మహేష్, రాములు నాయక్, చిరంజీవి, ఏనుగుల మధుసూదన్ రెడ్డి, లింగాల గంగాధర్, ఏలూరి సత్య, శ్రీశైలం యాదవ్, ప్రభాకర్, నవీన్, రాజసూర, కృష్ణ, నరసింహులు, వెంకటేశ్వరరావు, రాజు,శ్రీనివాసరాజు, ఎ రవీంద్ర, రమేష్, మద్ది నారాయణరెడ్డి, గోలి శ్రీను, రఫత్, అరవింద్ నాయుడు, సురేంద్ర కుమార్, శివకుమార్, పవన్, మహమూద్, నవీన్, శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

మావోయిస్టుల అంతం తేలిక కాదు

ప్రజాసమస్యల పరిష్కారంతోనే సాధ్యం

సీపీఐ కార్యదర్శి నారాయణ

విశాలాంధ్ర-విశాఖ: ముంబై ఉగ్రదాడుల సూత్రధారి తహవ్వుర్ హుస్సేన్ రాణాను అమెరికా నుంచి తీసుకొచ్చారని, మన దేశానికి మోదీ రప్పించగలిగారని, కానీ బీజేపీ అండదండలు ఉండడం వల్లే విదేశాల్లో దాక్కున్న ఆర్థిక ఉగ్రవాదులను తీసుకురాలేకపోతున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ విమర్శించారు. సీపీఐ దేశవ్యాప్త ప్రచార కార్యక్రమంలో భాగంగా విశాఖ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద శుక్రవారం ఏర్పాటుచేసిన బహిరంగసభలో నారాయణ మాట్లాడారు. బీజేపీ అధికారంలోకి వచ్చేనాటికి దేశంలో నిరర్థక ఆస్తుల విలువ రెండున్నర లక్షల కోట్లు కాగా...ఈ 11 ఏళ్ల మోదీ పాలనలో అవి పదహారున్నర లక్షల కోట్లకు పెరిగాయని నారాయణ చెప్పారు. ట్రంప్, మోదీ మంచి మిత్రులని ప్రచారం చేసుకుంటున్నారని, కానీ భారత్‌పైనా ట్రంప్ సుంకాల దాడి చేస్తున్నారని, దీనివల్ల వ్యవసాయ ఆధారిత భారత్ అనేక సమస్యలు ఎదుర్కొంటున్నదని చెప్పారు. ట్రంప్‌నకు ఊడిగం చేయకుండా యూరోపియన్ యూనియన్ దేశాలు, చైనాతో కలిసి ట్రంప్ సుంకాలను తిప్పి కొట్టాలన్నారు. దేశంలో బీజేపీ పలుకుబడి తగ్గడంతో పాటు మోదీ ప్రతిష్ఠ కూడా మసకబారిందని, గత ఎన్నికల ఫలితాలే ఇందుకు నిదర్శనమన్నారు. వచ్చే ఎన్నికల్లో గెలిచే అవకాశాలు లేకపోవడంతో సున్నితమైన అంశాలను రెచ్చగొడుతున్నారని విమర్శించారు. గుజరాత్‌లో ఒకరిని హత్య చేయించడంతో శిక్ష పడి... గుజరాత్ నుంచి బహిష్కరణకు గురైన అమిత్ షా... 2026 మార్చి నాటికి దేశంలో నక్సలిజాన్ని పూర్తిగా అంతమొందిస్తామని చెప్పడం అవివేకమని అన్నారు. మావోయిస్టులందరినీ చంపినా వారి సిద్ధాంతం బతికే ఉంటుందని, కొంతమంది నక్సలైట్లు పుట్టుకొస్తారని, చరిత్ర ఇదే చెబుతోందని అన్నారు. మావోయిస్టులను అంతమొందిస్తే సమస్య పరిష్కారం కాదని, అణగారిన వర్గాల ప్రజల అభివృద్ధితోనే నక్సలిజాన్ని రూపుమాపవచ్చన్నారు. దేశ సంపద కొన్ని వర్గాలకే పరిమితం కాగా దళితులు, గిరిజనులు, సామాన్య, మధ్యతరగతి ప్రజల స్థితిలో ఎటువంటి మార్పు లేదన్నారు. పార్లమెంటు సభ్యుల్లో 92 శాతం మంది సంపన్నులని, దేశంలో సంపన్న ముఖ్యమంత్రి చంద్రబాబు అని చెప్పారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని, లౌకిక రాజ్యాన్ని ధ్వంసం చేస్తున్నా చంద్రబాబు, జగన్, పవన్ నోరు మెదపడం లేదని విమర్శించారు. దేశంలో 11 సంవత్సరాల పాటు బెయిల్‌పై ఉన్న ఏకైక వ్యక్తి జగన్ అని, మోదీ-అమిత్ షా ఆశీసులు లేకుండా ఇది సాధ్యం కాదని అన్నారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేగువేరా నుంచి సావర్కర్‌గా మారారని, సనాతన ధర్మం గురించి మాట్లాడుతున్న పవన్‌కు అసలు సనాతన ధర్మం అంటే ఏమిటో తెలుసా అని ప్రశ్నించారు. కేంద్రం ఆమోదించిన వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా 12వ తేదీన దేశవ్యాప్తంగా ఆందోళనలకు సీపీఐ పిలుపునిచ్చిందని తెలిపారు.

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి తూట్లు పొడుస్తోందని, ప్రశ్నిస్తున్న వారిని అరెస్టులు చేస్తోందని విమర్శించారు. ఆపరేషన్ కగార్ పేరుతో బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తూ మావోయిస్టులతో పాటు అమాయక గిరిజనులను బలి తీసుకుంటున్నారని దుయ్యబట్టారు. ఆపరేషన్ కగార్ అసలు లక్ష్యం దేశంలోని అటవీ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టడమేనని చెప్పారు. మావోయిస్టుల అంశాన్ని శాంతి భద్రతల సమస్యగా చూడకూడదని, ప్రజల సమస్యల పరిష్కారంతో మావోయిస్టుల సమస్య పరిష్కారమవుతుందని, మావోయిస్టులు కూడా ప్రజల మధ్యకు వచ్చి ప్రజాఉద్యమాలు చేయాలని కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపుతానన్న పవన్ కల్యాణ్ సవాల్ ఏమైందని ప్రశ్నించారు. దేశంలో ప్రతి గంటకు నలుగురు దళిత, గిరిజన మహిళలు అత్యాచారానికి గురవుతున్నారన్నారు. దేశంలో ఉపాధి అవకాశాలు లేక యువత తప్పుడు మార్గంలోకి వెళ్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సీపీఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు మాట్లాడుతూ మోదీ పాలనలో అదానీ, అంబానీ బాగున్నారని, సామాన్యుల పరిస్థితి దిగజారిందని విమర్శించారు. జీవీఎంసీ సీపీఐ ఫ్లోర్ లీడర్ ఏజే స్టాలిన్, విశాఖ ఉక్కు గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.శ్రీనివాసరావు, ఎ.విమల, రెహమాన్, చంద్రశేఖర్, ఎం.మన్మథరావు, కె.సత్యనారాయణ, కె.సత్యాంజనేయ, జి.రాంబాబు, సీఎన్ క్షేత్రపాల్, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు జేడీ నాయుడు, ఎస్.నాగభూషణం తదితరులతో పాటు పార్టీ, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గొప్ప సంఘ సంస్కర్త పూలే

సామాజిక వేత్త, సంఘ సంస్కర్త, సమాజ సేవకుడు మహాత్మా జ్యోతిరావు పూలే ... గొప్ప దేశభక్తి గల వ్యక్తి అని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. సీపీఐ అధ్వర్యంలో విశాఖలో శుక్రవారం పూలే 198వ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన నారాయణ మాట్లాడుతూ పూలే దంపతులు సమాజంలో నిమ్న , అణగారిన వర్గాల అభ్యున్నతికి, విద్యాభివృద్ధికి విశేషంగా కృషి చేశారని కొనియాడారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 77 సంవత్సరాలు నిండినప్పటికీ అట్టడుగు వర్గాల ప్రజలు ఇంకా దారిద్ర్య రేఖకు దిగువనే ఉన్నారని తెలిపారు. పాలకుల్లో చిత్తశుద్ధితో లేకపోవడమే అందుకు కారణమని విమర్శించారు. సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, జిల్లా కార్యదర్శి ఎం. పైడిరాజు, కార్యవర్గ సభ్యులు ఎ. విమల, సిఎన్. క్షేత్రపాల్, ఎస్.నాగభూషణం, బి. పుష్పలత, జి. కాసులరెడ్డి, యు. నాగరాజు, ఎ. ఆదినారాయణ, ఎ. రవి, ఎం. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నితీశ్ ఇంటికి కాంగ్రెస్ మార్చ్

లాఠీచార్జి: జలఫిరంగులతో అడ్డుకున్న పోలీసులు

కన్హయ సహా 30 మంది నిర్బంధం

పాట్నా: బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ఇంటి వరకు నిరసన ప్రదర్శనను కాంగ్రెస్ చేపట్టింది. ఇది హింసాత్మకంగా మారింది. ఆ పార్టీ నేత కన్హయ కుమార్ సహా అనేక మంది నేతలను పోలీసులు నిర్బంధించారు. సీఎం ఇంటికి వెళ్లి ఆయనకు వినతిపత్రం అందజేయాలని కాంగ్రెస్ నాయకులు భావించారు. అయితే మార్గం మధ్యలో అడ్డుకున్న పోలీసులు వారిపై లాఠీచార్జి చేశారు. జల ఫిరంకులతో చెదరగొట్టేందుకు యత్నించారు. దీంతో కాంగ్రెస్ నేతలకు, పోలీసులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది, ఓ దశలో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. కాగా, యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడంలో నితీశ్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, వలసలను అదుపు చేయలేకపోతోందని కాంగ్రెస్ ఆరోపించింది. కన్హయ కుమార్ సహా 30 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

మరో 3 డైట్ కళాశాలలకు ఆమోదం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విశాఖపట్నం, గుంటూరు, నెల్లూరు జిల్లాల విద్యా శిక్షణ సంస్థల (డైట్ కళాశాలలు)ను 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'గా తీర్చిదిద్దేందుకు రెండో విడతలో భాగంగా రూ.43.22 కోట్ల నిధులకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపినట్లు సమగ్ర శిక్షా ఎస్పీడీ బి.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మౌలిక సదుపాయాలు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపకల్పన చేయనున్నట్లు చెప్పారు. 2028 నాటికి రాష్ట్రంలో 13 డైట్లను 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'గా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.

ఖర్చు లేకుండా రిజిస్ట్రేషన్లు

శాశ్వత ఇంటి పట్టాల పంపిణీలో మంత్రి లోకేశ్

విశాలాంధ్ర-మంగళగిరి: రూపాయి ఖర్చు లేకుండా వచ్చే వారం నుంచి ఇంటి పట్టాలు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఇంటి పట్టా అమ్ముకునే హక్కు కూడా రెండేళ్లలో వస్తుందన్నారు. అయితే ఎవరూ పట్టాలు అమ్ముకోవద్దని, ప్రాంతాభివృద్ధికి చేయూత ఇవ్వాలని లోకేశ్ కోరారు. 'మన ఇల్లు-మన లోకేశ్' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మంగళగిరి డాన్ బాస్కో స్కూల్ వద్ద నిర్వహించిన సభలో రత్నాల చెరువు ప్రాంతానికి చెందిన 600 మందికి, తాడేపల్లి మహానాడు ప్రాంతానికి చెందిన 430 మంది పేదలకు శాశ్వత ఇంటి పట్టాలను మంత్రి అందజేశారు. మంగళగిరిలో 26 సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని చెబుతూ... గతంలో మంగళగిరి నుంచి 5,300 ఓట్ల తేడాతో ఓడిపోయిన తనను 91 వేల ఓట్ల మెజార్టీతో గెలిపించి అసెంబ్లీకి పంపిన మంగళగిరి ప్రజల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తున్నట్లు లోకేశ్ తెలిపారు. వంద పడకల ఆసుపత్రిని రాష్ట్ర కేబినెట్ రెండవ సమావేశంలో ఆమోదించినట్లు గుర్తుచేశారు. ఈనెల 13న ఆసుపత్రికి శంకుస్థాపన జరుగుతుందని, ఏడాదిలోగా నిర్మాణం పూర్తి అవుతుందన్నారు. 'భూగర్భ డ్రైనేజీ, వాటర్ పైప్ లైన్, గ్యాస్, కరెంట్ వంటి సౌకర్యాలు అందిస్తున్నాం. లక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని, పార్కులు, చెరువులను అభివృద్ధి చేస్తాం. క్రికెట్ టర్ఫ్‌లు, బాస్కెట్ బాల్ కోర్టులను ఏర్పాటు చేస్తాం' అని లోకేశ్ తెలిపారు. రూ.300 కోట్లతో రిటైనింగ్ వాల్ నిర్మిస్తామన్నారు. తాడేపల్లిలో హెల్త్ క్లినిక్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కొన్ని వార్డుల్లో పార్కులు నిర్మిస్తున్నామని, ఆరు పార్కులు సిద్ధమవుతున్నాయన్నారు. 31 కమ్యూనిటీ భవనాలను గతంలో కోరగా, అందులో 17కు భూముల గుర్తింపు పూర్తి అయిందని చెప్పారు. రెండు భవనాల పనులు ముగింపు దశకు చేరుకున్నాయన్నారు. మిగతా వాటి పనులనూ యుద్ధప్రాతిపదిక చేపడతామని లోకేశ్ తెలిపారు. గతంలో ఇంటి పట్టాల కోసం చెప్పులరిగేలా తిరిగారు... జిరాక్స్‌లకు, అర్జీలకే వేల రూపాయలు ఖర్చు చేశారు కానీ కూటమి ప్రభుత్వంలో యుద్ధప్రాతిపదికన కొలతలు తీశామన్నారు. సంబంధిత వివరాలన్నీ అందాక, కేబినెట్‌లో చర్చించి సముచిత విధానాన్ని అమల్లోకి తెస్తామని చెప్పారు. తద్వారా రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ భూముల్లో ఉంటున్న వారికి లబ్ధి చేకూరుతుందన్నారు. మంగళగిరిని చెత్తరహితంగా తీర్చిదిద్దుతున్నామని, స్వచ్ఛతలో మీ సహకారం కావాలని లోకేశ్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పద్మశాలియ వెల్ఫేర్ అండ్ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, టీడీపీ గుంటూరు జిల్లా పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, టీడీపీ నేతలు దామర్ల రాజు, ఆకుల జయసత్య, దుర్గారావు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై కేసులు ఎత్తేయాలి

ఏపీయూడబ్ల్యూజే డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: జర్నలిస్టులపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని ఆంధ్రప్రదేశ్ యూనియన్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఐవీ సుబ్బారావు, చందు జనార్దన్, ఐజేయూ జాతీయ కార్యదర్శి డి.సోమసుందర్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బాధితుడి బంధువులు చెప్పిన ప్రకారమే వార్తలు రాశారని, దీనిపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే వివరణ ఇవ్వాల్సింది పోయి కేసులు పెట్టడం బాధాకరం అన్నారు. గతంలో జర్నలిస్టులపై అనేక ప్రాంతాల్లో దాడులు జరిగాయని, ఆ సమయంలో పోలీసులు కేసులు నమోదు చేయడానికి కూడా వెనుకాడారని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు కేసులు పెట్టడానికి పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించడం విచిత్రంగా ఉందన్నారు. ప్రభుత్వం పోలీసుల వైఖరి గమనించి తగిన సూచనలు చేయాలని కోరారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి సాక్షి ఎడిటర్ ఆర్.ధనుంజయ రెడ్డి, మరో ఆరుగురిపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని అన్నారు. జర్నలిస్టులపై పెట్టిన కేసులను ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ రాష్ట్ర కమిటీ తప్పుబట్టింది. సామ్నా రాష్ట్ర అధ్యక్షుడు నల్లి ధర్మారావు, ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి... జర్నలిస్టులపై కేసులు పెట్టడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని జర్నలిస్టులపై పెట్టిన కేసులను తక్షణమే ఎత్తివేయాలని కోరారు.

సమాజంలో ఆర్థిక అసమానతలు తగ్గాలి

అందుకే పీ-4 అమలు చేస్తున్నాం

'మార్గదర్శి-బంగారు కుటుంబం'లో సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: సమాజంలో ఉన్నత స్థాయిలో ఉన్న 10 శాతం మంది... అట్టడుగున ఉన్న 20 శాతం పేదలను పైకి తీసుకొచ్చేందుకు ముందుకు రావాలని సీఎం చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. సమాజంలో ఆర్థిక అసమానతలు తగ్గాలని, అందుకోసమే దేశంలో ఎక్కడాలేని విధంగా ఏపీలో పీ-4 అనే వినూత్న కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని సీఎం చెప్పారు. పేద కుటుంబాల్లో వెలుగు తెచ్చేవరకు అండగా ఉంటానని, నేడు బంగారు కుటుంబానికి ఎంపికైన వారి పిల్లలే సహకారం అందిస్తే రేపు మార్గదర్శకులుగా తయారుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. నూజివీడు నియోజకవర్గం ఆగిరిపల్లిలో శుక్రవారం జ్యోతిరావు పూలే జయంతి వేడుకల్లో పాల్గొన్న సీఎం, అనంతరం 'బంగారు కుటుంబం-మార్గదర్శి' కార్యక్రమంలో పాల్గొన్నారు. పేదలను ఆదుకునేందుకు ముందుకొచ్చిన మార్గదర్శులను సీఎం సన్మానించారు. 'ఆగిరిపల్లిలోని 206 బంగారు కుటుంబాలకు వారి మార్గదర్శులు అండగా ఉంటారు. మొదటి దశలో రాష్ట్రంలోని 20 లక్షల కుటుంబాలను పేదరికం నుంచి తెచ్చేందుకు కృషి చేస్తున్నాం. పేదలను ఆదుకుని శాశ్వతంగా పైకి తీసుకొస్తే పూలేను గుర్తు పెట్టుకున్నట్లుగానే మార్గదర్శకులను గుర్తుంచుకుంటారు. ఒక స్థాయి వరకు సొంతానికి, వ్యక్తిగతంగా కష్టపడతాం, తర్వాత మంచి పేరు కోసం కష్టపడతాం. అలాంటి వేదిక కోసమే ఈ మార్గదర్శి-బంగారు కుటుంబం కార్యక్రమం. మార్గదర్శకులు ఓట్లు కోసం రావడం లేదు, పేరు కోసం ముందుకు వస్తున్నారు. అంబేద్కర్, పూలే, జగ్జీవన్ వంటి మహానుభావుల జయంతి వేడుకలు నిర్వహించుకుంటూనే పీ4 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం' అని చంద్రబాబు అన్నారు. అనంతరం బంగారు కుటుంబాలకు ఎంపికైన బోసం లక్ష్మీదుర్గా మాట్లాడుతూ తన భర్త బోన్ క్యాన్సర్‌తో మూడేళ్ల క్రితం చనిపోయాడని, అయినా వితంతు పింఛన్ కూడా రావడం లేదన్నారు. పాప, బాబు ఉన్నారని, సొంతిల్లు లేక నా తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నానన్నారు. పూట గడవడం కోసం కూలీ పనులకు వెళ్తున్నానన్నారు. జీవనోపాధి కల్పించాలని సీఎంకు విజ్ఞప్తి చేసింది. ముఖ్యమంత్రి స్పందిస్తూ వచ్చే నెల నుంచే మీకు వెంటనే పింఛను మంజూరు చేయడంతో పాటు 12 నెలల పింఛను కూడా ఇస్తామని, సొంతిల్లు కూడా కట్టించి ఉపాధి కల్పనకు చర్యలు తీసుకుంటామని ఆమెకు భరోసా కల్పించారు. మార్గదర్శకులు నూజివీడు సీడ్స్ అధినేత ప్రభాకర్ మాట్లాడుతూ మార్గదర్శి-బంగారు కుటుంబం చాలా మంచి కార్యక్రమమని, రాబోయే నాలుగేళ్లలో రూ.20 నుంచి 25 కోట్ల వరకూ ఆగిరిపల్లిలోని పేదలకు ఖర్చు చేస్తామన్నారు. తుక్కులూరులో కూడా ఈ కార్యక్రమాన్ని చేపడితే ముందుకొస్తామని సీఎంకు తెలియజేశారు. కుశలవ గ్రూప్ డైరెక్టర్ సిద్ధార్థ మాట్లాడుతూ చదువుకోవడానికి ఇబ్బంది పడేవారికి సాయం అందిస్తామన్నారు. ఇల్లు లేని వారికి ప్రభుత్వం స్థలం కేటాయిస్తే ఇల్లు నిర్మించి ఇస్తామన్నారు. హ్యాపీ వ్యాలీ స్కూల్ అధినేత గౌతమ్ మాట్లాడుతూ తాను స్థాపించిన హ్యాపీవ్యాలీ స్కూల్‌ను చంద్రబాబే ప్రారంభించారన్నారు. 'వంద కోట్లు అప్పు చేసి స్కూలు కట్టించాను. ఆ అప్పంతా తీర్చాను. 300 మంది విద్యార్థులకు ఉచితంగా విద్యను అందిస్తున్నాం. వారు మంచి జీవితాన్ని ప్రారంభించేదాకా బాధ్యత తీసుకుంటాం. మీరు ఇచ్చే పిలుపుతో మరిన్ని కార్యక్రమాలు చేపడతామని' సీఎంకు హామీ ఇచ్చారు.

బీజేపీ 'క్రెడిట్ రాజకీయం'

బీహార్ ఎన్నికలకు ముందు రాణాకు ఉరిశిక్ష: రౌత్ వ్యంగ్యం

న్యూఢిల్లీ: ముంబైలో 26/11 ఉగ్రదాడి నిందితుడు తహవ్వూర్ రాణాను బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఉరి తీసేలా మోదీ ప్రభుత్వం 'క్రెడిట్' (ఘనత) రాజకీయం చేయొచ్చని శివసేన(యూబీటీ) నేత సంజయ్ రౌత్ వ్యాఖ్యానించారు. రాణాను అమెరికా నుంచి దేశానికి తేవడాన్ని స్వాగతించిన ఆయన, ఎన్నికల లబ్ధి కోసం పక్కవారి ఘనతను దోచేయడం మోదీ ప్రభుత్వానికి కొత్తేమీ కాదని విమర్శించారు. పాక్‌తో సంబంధాలు ఉన్న ఓ ఉగ్రవాదిని విదేశాల నుంచి దేశానికి తేవడమన్నది దర్యాప్తు సంస్థలు సాధించిన గొప్ప విజయం, దీనిని ప్రచారాస్త్రంగా మార్చుకోరాదని రౌత్ అన్నారు. దర్యాప్తు సంస్థల పనిని తమ ఖాతాలో వేసుకుంటూ మోదీ ప్రభుత్వం గొప్పలు పోతుండటాన్ని ఆక్షేపించారు. ఇప్పుడు దేశంలో రాణా ఉత్సవాన్ని నిర్వహిస్తారా ఏమిటి అంటూ కేంద్రాన్ని ఎద్దేవా చేశారు. 'అలాంటి పనులు చేయొద్దు... దీనిపై రాజకీయం జరుగుతోందని మాకు తెలుసు' అని వ్యంగ్యంగా అన్నారు. 2009 నుంచి రాణాను భారత్‌కు తీసుకురావడం కోసం కసరత్తు జరుగుతోందని గుర్తుచేశారు. ఇది మోదీ ప్రభుత్వం సాధించిన ఘనత కాదని, దీని వెనుక అనేక ప్రభుత్వాలు, సంస్థల శ్రమ, కృషి ఉన్నాయని సంజయ్ రౌత్ చెప్పారు. రాజకీయ ప్రయోజనాల కోసం బీహార్‌లో ఎన్నికలకు ముందు రాణాను ఉరితీసే అవకాశాలు లేకపోలేదని వ్యాఖ్యానించారు. అయితే దర్యాప్తు సంస్థలు, న్యాయవ్యవస్థపై తనకు పూర్తి నమ్మకం ఉందని రౌత్ అన్నారు.

దారిమళ్లిన కార్మిక సంక్షేమ నిధి

రూ.416.33 కోట్లతో విద్యుత్ బిల్లుల మాఫీ

మధ్యప్రదేశ్ అసెంబ్లీకి కాగ్ నివేదిక

భోపాల్: మధ్యప్రదేశ్‌లో కార్మికుల సంక్షేమం గాడి తప్పింది. నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమ నిధి దారిమళ్లింది. ఈ మేరకు కంప్ట్రోలర్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా (కాగ్) తన తాజా నివేదికలో స్పష్టం చేసింది. నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమ నిధి నుంచి రూ.416.33 కోట్లను ప్రజారంజక పథకాల కోసం దారి మళ్లించినట్లు మధ్యప్రదేశ్ అసెంబ్లీకి నివేదిక ఇచ్చింది. విద్యుత్ బిల్లుల మాఫీకి ఈ మొత్తం వినియోగమైనట్లు తెలిపింది. 2022 మార్చి 31న మధ్యప్రదేశ్‌లో భవన నిర్మాణం, ఇతర నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమ బోర్డు నిధుల్లో మిగిలింది రూ.1,959.63. 2021-22లో ఫిక్స్‌డ్ డిపాజిట్ రూపేణ ఖర్చు కానీ మొత్తాలపై వడ్డీ సహా యాజమాన్యాల నుంచి సెస్ రూపంలో రూ.634.50 కోట్లు సంక్షేమ బోర్డుకు వచ్చాయి. 2021-22లో సంక్షేమ బోర్డు ఖర్చు చేసినది రూ.1128.57 కోట్లు కాగా అందులో నుంచి 36.89శాతం అంటే రూ.415.33 కోట్లు దారిమళ్లాయి. 2021 అక్టోబరులో బోర్డు రూ.415.33 కోట్లను విద్యుత్ సబ్సిడీ పథకాలైన 'ముఖ్యమంత్రి బకాయ బిజిలి బిల్ మాఫీ యోజన-2018, సరళ్ బిజిలి బిల్ యోజన-2020' కోసం వినియోగించినట్లు కాగ్ ఆడిట్ నివేదిక వెల్లడించింది. ఎలాంటి సంప్రదింపులు జరపకుండా బోర్డు కార్యదర్శి ఏకపక్షంగా ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. నిధులను ఇలా దారి మళ్లించడం 2015 ఆగస్టు 21న, 2015 సెప్టెంబరు 4న సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలను ధిక్కరించడమే అవుతుందని నివేదికలోని 28-29 పేజీల్లో కాగ్ పేర్కొంది. సంక్షేమ పథకాల కింద ఏ ఒక్క నిర్మాణ రంగ కార్మికుడు నమోదై లేకపోవడాన్ని కూడా గుర్తించింది. మధ్యప్రదేశ్ నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమ బోర్డు పనితీరుపై కాగ్ సమగ్ర నివేదిక ఇవ్వడం ఇది మొదటిసారి కాదు. 2006-11లో ఐదేళ్ల పనితీరును కాగ్ సమీక్షించి... నివేదిక ఇచ్చింది. అలాగే. 2011-16 పనితీరుపైనా నివేదిక ఇచ్చింది. అయితే తమ ఆడిట్ల ప్రభావం ఎంతన్నది కాగ్ పట్టించుకోవడం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ పరిస్థితుల్లో తమ ఆడిట్ ద్వారా వెలుగుచూసే వాస్తవాలు... సంస్థాగత సంస్కరణలకు దారితీస్తున్నాయా లేక కార్మికుల సంక్షేమ నిధులను లూటీ చేస్తున్న వారిని భయపెట్టడంలో విఫలమవుతున్నాయా అన్నది కాగ్ ఆత్మపరిశీలన చేసుకోవాలని కొందరు అభిప్రాయపడుతున్నారు.

పారదర్శక ఎక్సైజ్ చట్టం తెస్తాం

ఢిల్లీ సీఎం రేఖా గుప్తా

న్యూఢిల్లీ: ఢిల్లీలోని బీజేపీ ప్రభుత్వం కొత్తగా తీసుకు రాబోయే ఎక్సైజ్ చట్టం పారదర్శకంగా, లోపాలకు తావులేకుండా ఉంటుందని సీఎం రేఖా గుప్తా తెలిపారు. ఆదాయం పెంచేలా ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్న అద్భుత విధానాలతో కూడిన విధానాన్ని అమల్లోకి తేస్తామని పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె తెలిపారు. సమాజానికి ఇబ్బంది కలగకుండా ఆదాయాన్ని పెంచేలా ఈ విధానం ఉండబోతుందని చెప్పారు. ఢిల్లీ మద్యం వ్యాపారాన్ని సంస్కరించేలా కొత్త ఎక్సైజ్ విధానాన్ని ఆప్ ప్రభుత్వం తీసుకురాగా, ఆపై అవినీతి ఆరోపణలు భగ్గుమన్నాయి. దీనిపై సీబీఐ విచారణకు 2022 జులైలో ఎల్‌జీ వీకే సక్సేనా సిఫార్సు చేశారు. దీంతో 2022 ఆగస్టు 31న ఈ విధానం రద్దు అయింది. ప్రైవేటు మద్యం దుకాణాలను మూసివేశారు. పాత విధానం ప్రకారం హోల్‌సేల్, రీటెయిల్ మద్యం విక్రయాలు ఢిల్లీ ప్రభుత్వ పరిధిలో సాగేవి. ప్రస్తుతం ఢిల్లీలోని నాలుగు కార్పొరేషన్ల పరిధిలో 700 మద్యం దుకాణాలున్నాయి. ఎక్సైజ్ శాఖ సీనియర్ అధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించి కొత్త విధానం రూపకల్పనపై సీఎం చర్చించారు. పారదర్శక, సమర్థ ఎక్సైజ్ విధానాన్ని తేవడానికి ప్రభుత్వం కట్టుబడి ఉన్నట్లు 'ఎక్స్'లో సీఎంఓ వెల్లడించింది.

ఒకే కుటుంబంలో ముగ్గురికి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు

విశాలాంధ్ర-ధర్మవరం: సత్యసాయి జిల్లా ధర్మవరంలోని రాజేంద్రనగర్‌లో నివాసముంటున్న ఉపాధ్యాయుడు సోమిశెట్టి రమేష్ బాబు, శ్యామల దంపతుల కుమార్తెలు కావ్య, ప్రణతి లక్ష్మి ... యువ నృత్య కళాకారులుగా గుర్తింపు పొందుతూ గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు సంపాదించుకున్నారు. ఇటీవల భారతదేశ సాంస్కృతిక శాఖ, కేంద్ర సంగీత నాటక అకాడమీ సంయుక్తంగా ... భారత దేశ విభిన్న రాష్ట్రాలలోని 53 జానపద కళారూపాల విభిన్న నృత్యాల ప్రదర్శన నిర్వహించింది. 5,194 మంది కళాకారుల సమాహారంగా నృత్య ప్రదర్శన చేశారు. దీంతో గిన్నిస్ బుక్ ఆఫ్ ఓల్డ్ రికార్డును సాధించారు. ఆంధ్రప్రదేశ్ తరఫున వీరు జానపద నృత్యానికి ఎంపికయ్యారు. వీరి మేనత్త ప్రముఖ జానపద కళాకారిని సోమిశెట్టి సరళ గ్రూప్ లీడర్ అధ్వర్యంలో ఈ మహోన్నతమైన ప్రదర్శనలో పాల్గొన్నారు. వీరి ముగ్గురు పేర్లు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో నమోదు కావడంతో సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఒకే ఇంట్లో చెల్లెలు, కూతుర్లు ఉండడం, ఒకే కుటుంబంలో గిన్నిస్ రికార్డులో చోటు దక్కడం తమకు ఎంతో సంతోషాన్ని కలిగించిందని రమేష్ బాబు, శ్యామల తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.